Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

గురువారం, అక్టోబర్ 17, 2024 | సంపుటి - 20 | సంచిక 23 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

విలేకరులు కావలెను
అనతికాలంలోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొందుతున్న ది క్రైమ్ న్యూస్ దిన పత్రికకు ఉమ్మడి జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకర్గాల వారిగా ఆర్‌సీ ఇంచార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవజ్ఞులకు ప్రాధాన్యత ఇవ్వబడును
రాజకీయ అవగాహన కలిగిన కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.
వివరాలకు సంప్రదించండి 6305584064

## విపక్షనేతగా కెసిఆర్ వైఫల్యం

**కనీస మర్యాద పాటించడంలో విఫలం**

**అధికారం లేకపోతే బయటకు రాని వైనం**



హైదరాబాద్ : కెసిఆర్ తీరు ఎవరికీ అర్థం కావడం లేదు. ప్రతిపక్ష నేతగా ఉన్నా ప్రజల్లోకి రావడం లేదు. అంతా కొడుకు, అల్లుడు చూసుకుంటున్నారు.

మిగతా 2లో



## హర్యానా సిఎంగా మరోమారు నాయబ్ సింగ్ సైనీ

**గవర్నర్ దాత్తాత్రేయను కలిసిన సైనీ, అమిత్ షా**

**నేడు సైనీ ప్రమాణ స్వీకారానికి బిజెపి నిర్ణయం**

చండీగఢ్ : హర్యానాలో బీజేపీ ప్రభుత్వం కొలువుతీరనుంది. ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీని రెండోసారి ముఖ్యమంత్రి కొనసాగించేందుకు బీజేపీ అధిష్ఠానం నిర్ణయించడం, ఇందుకు అనుగుణంగా బీజేపీ శాసనసభా పక్షం బుధవారం ఉదయం జరిపిన సమావేశంలో ఆయన పేరును ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించడంతో ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఆ వెంటనే కేంద్ర పరిశీలకునిగా వెళ్లిన అమిత్‌షా, నయబ్ సింగ్ సైనీ రాజ్‌భవన్‌కు చేరుకుని గవర్నర్ బండారు దత్తాత్రేయను కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానిం చాల్సిందిగా కోరారు. సైనీ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించిన ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు సావిత్రి జిందాల్, దేవేంద్ర కద్యాన్, రాజేష్ దూన్‌లు కూడా గవర్నర్‌ను కలిసిన బీజేపీ ప్రతినిధి బృందంలో ఉన్నారు. దీనికి ముందు, పంచకులలో జరిగిన సమావేశంలో బీజేపీ శాసనసభా పక్ష నేతగా

2లో

## హైకోర్టులోనూ ఐఏఎస్‌లకు చుక్కెదురు

**కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాల్సిందే**

**సొంత రాష్ట్రాల్లోనే రిపోర్ట్ చేయాలి**

**ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ**



హైదరాబాద్ : అనుకున్నదే అయ్యింది. తెలంగాణలోనే పనిచేస్తామంటూ పట్టుబట్టిన ఆ నలుగురు ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ఊహించని సూచనలు అందజేసింది. వెంటనే కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ క్యాడర్ ఐఏఎస్‌లు క్యాట్ ఆదేశాలపై హైకోర్టులో లంచ్?మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆమ్రపాలి, వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, వాణీప్రసాద్‌ల లంచ్‌మోషన్ పిటిషన్‌ను అనుమతించిన కోర్టు మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణ ప్రారంభించింది. దాదాపు 2 గంటల విచారణ తర్వాత తీర్పును రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అంతేకాకుండా సదరు అధికారులు తమకు కేంద్రం

మిగతా 2లో

## రికార్డు స్థాయిలో ప్రభుత్వం అప్పులు

**రేవంత్ తెచ్చిన అప్పు 10 నెలల్లో రూ.80,500 కోట్లు**

**ఇంత అప్పులు తెచ్చి దేనికి ఖర్చు చేశారు?**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్న**



హైదరాబాద్ : రేవంత్ రెడ్డి గద్దె నెక్కిన రోజు నుంచి పది నెలల్లో రూ.80,500 కోట్ల అప్పు తెచ్చారని, రికార్డు స్థాయిలో అప్పులు తెచ్చి దేనికి ఖర్చు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. అప్పు చేయడమే తప్పు అన్నోళ్లను ఇప్పుడు దేని తో కొట్టాలని ప్రశ్నిం చారు. కొత్తగా ఒక్క ప్రాజెక్టు కట్టలేదని.. ఎన్నికల హామీలు నెరవేర్చలేదని.. అలాంట ప్పుడు అప్పు తెచ్చిన రూ.80 వేల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్ల బిల్లులకు ఆ మొత్తం ధారాదత్తం చేశారా? కమీషన్లకు కక్కుర్తి పడే అప్పులు తెస్తున్నారా అని ప్రశ్నిం చారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అప్పులతో ప్రాజెక్టు లు నిర్మించామని, ప్రతి పైసా మౌలిక సదుపా యాల కోసం ఖర్చు చేశామన్నారు.

2లో



## కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

**రబీ సీజన్‌లో పంటల కనీస మద్దతు ధర పెంపు**

**కేంద్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు**

న్యూఢిల్లీ : మోడీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక ప్రకటనలు చేశారు. ఒకవైపు కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు కానుకగా ఇస్తూనే మరోవైపు రైతులకు కూడా ప్రభుత్వం భారీ దీపావళి కానుకగా ఇచ్చింది. వాస్తవానికి రబీ సీజన్‌లో పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ని కేంద్రం పెంచింది. ఇందులో గోధుమ పంటకు

2లో

## ఢిల్లీలో తీవ్ర వాయు కాలుష్యం..

**పంజాబ్, హర్యాణా ప్రభుత్వాలపై సుప్రీం సీరియస్!**



మిగతా 2లో

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో రోజు రోజుకీ వాయు కాలుష్యం పెరిగిపోతోంది. ముఖ్యంగా చలికాలంలో ఎయిర్ క్వాలిటీ లెవెల్స్ దారుణ స్థితికి పడిపో తున్నాయి. ఈ సమస్యపై సుప్రీం కోర్టు బుధవారం సీరియస్ అయింది. రాజధానిలో గాలి కాలుష్యానికి ముఖ్యకారణం హర్యాణా, పంజాబ్ రాష్ట్రాల ప్రభుత్వమే నిర్లక్ష్యమని మండిపడింది.

## జైల్లో నన్ను చంపేందుకు బీజేపీ కుట్ర..

**పదేళ్లుగా ఢిల్లీ అభివృద్ధి పనులను బీజేపీ నిలిపివేసింది**

**కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు**



న్యూఢిల్లీ : తీహార్ జైల్లో తనను చంపేం దుకు బీజేపీ కుట్ర చేసిందని మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్ ఆరోపణలు చేశారు. పార్టీ ప్రజా ప్రచార కార్యక్రమంలో భాగంగా జరిగిన ర్యాలీలో కేజ్రీవాల్ ప్రసంగించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తీహార్ జైల్లో ఉన్నప్పుడు తనకు ఇన్సులిన్ ఇచ్చేందుకు నిరాకరించారని..

2లో

## రెండు దేశాల సంబంధాల్లో పీటముడి

**ఉగ్రవాదం ఎగదోస్తున్నందుకే అని గుర్తించండి**

**పాక్‌కు చురకలు వేసిన విదేశాంగ మంత్రి జయశంకర్**



పాకిస్థాన్‌లో జరుగుతోన్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో మాట్లాడిన భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్.. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి చురకలు వేశారు. సీమాంతర ఉగ్రవాదం గురించి ప్రస్తావించి విమర్శలు చేశారు. రెండు దేశాల మధ్య సంబంధాలు ఎందుకు దెబ్బతిన్నాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. నమ్మకం, సహకారం, స్నేహం లోపిస్తే పొరుగువారు దూరమవుతారని వ్యాఖ్యానించారు.

ఇస్లామాబాద్ : సరిహద్దుల్లో తీవ్రవాదం, ఉగ్రవాదం, వేర్పాటు వాద కార్యకలాపాలు ఉంటే.. ఆ రెండు దేశాల మధ్య వాణిజ్యం, అను సంధా నం, ప్రజల మధ్య సంబం ధాలకు అవకాశం ఉండదని మంత్రి వ్యాఖ్యా నించారు. ఎక్కడా కూడా పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించ లేదు. ఈ సమా వేశం అనంతరం మంత్రి ఎక్స్ (ట్విటర్) వేదికగా పోస్టు పెట్టారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో మన దేశం ప్రకటనను వినిపించాను. కల్లోల ప్రపం చంలో మనం ఎదుర్కొంటున్న సవాళ్లకు తగినవిధంగా ఎస్‌-సీఓ స్పందించాలని అంటూ పలు అంశాలను ప్రస్తావిం చారు. 2019లో పూల్వామాలో సీఆర్‌పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌పై ఉగ్రదాడి జరిగింది. నాడు ఆ ఘటనలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోగా.. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు.

మిగతా 2లో

## రైతులకు అనుకూలంగా కాంగ్రెస్ ప్రభుత్వం

**అనేక నిర్ణయాలు తీసుకున్నామన్న కోమటిరెడ్డి**

**దీపావళికి ముందే మిగిలిన వారికి రుణమాఫీ**

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి**



నల్లగొండ : రైతు సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్‌ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్ యార్డులో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం పండుతుందని, రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు

2లో

# హైకోర్టులోనూ ఐఏఎస్‌లకు చుక్కెదురు

(డిఓపీటీ) డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఆదేశాల ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే రిపోర్ట్ చేయాలని సూచనలు ఇచ్చింది.మీ అభ్యర్థనపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ అనుకూలమైన తీర్పు ఇవ్వకపోతే కోర్టుకు రావటం సరికాదని తెలిపింది. ఒకవేళ మీ పిటీషన్ డిస్మిస్ చేస్తే మళ్లీ కోర్టుకే వస్తారని, పని చేసేందుకు ఎక్కడ అవకాశం కల్పిస్తే అక్కడకు వెళ్లి పని చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. వీటిపై విచారణ తర్వాత చేస్తామని తెగేసి చెప్పేసింది. ఫలితంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో అఖిల భారత సర్వీస్ అధికారుల కేటాయింపులపై డీఓపీటీ ఆదేశాలకు అనుగుణంగా అలాటెడ్ రాష్ట్రాల్లో రిపోర్టు చేయాల్సిన తప్పని పరిస్థితి నెలకొంది.రొనాల్డ్‌రోస్, శివశంకర్, హరికిరణ్, ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్ డీఓపీటీ ఉత్తర్వులపై తెలంగాణ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.తాము ఉన్న క్యాడర్ లోనే పనిచేస్తామని, బదిలీలు లేకుండా కొనసాగించాలని కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. విచారించిన క్యాట్, డీఓపీటీ ఉత్తర్వులను నిలిపేసేందుకు నిరాకరించింది. దీంతో బుధవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసి అత్యవసరంగా విచారించాలని కోరారు. ఫలితంగా తీర్పును రిజర్వు చేస్తూ న్యాయస్థానం ప్రత్యేక సూచనలు ఇచ్చింది. మరోవైపు కేటాయించిన రాష్ట్రాల్లో చేరేందుకు డీఓపీటీ గడువు నేటితో తీరనుంది.జస్టిస్ అభినంద్ కుమర్ శావిలి బెంచ్ పిటీషన్లను విచారించింది. కేంద్రం తరఫున న్యాయవాది వాదిస్తూ ఏ అధికారి ఎక్కడ పని చేయాలో చెప్పే అధికారం కోర్టుకు లేదన్నారు. సివిల్ సర్వీస్ అధికారులు పూర్తిగా కేంద్రం అధీనంలో పనిచేస్తారని, ఈ మేరకు కేంద్రంలోని సీనియర్ అధికారులే వీరి పోస్టింగ్లులపై నిర్ణయాలు తీసుకుంటారన్నారు. విచారణ సమయంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అధికారులు ప్రజా సేవ కోసమే ఉన్నారని, ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడే పనిచేయాలని సూచించింది.

## విపక్షనేతగా కెసిఆర్ వైఫల్యం

అధికారం కోల్పోవడంతో ఇక ప్రజలతో తనకేమి పని అన్న ధోరణిలో ఉన్నట్లుగా ఉన్నారు. బిఆర్ఎస్ కూడా విమర్శలే లక్ష్యంగా పని చేస్తోంది. తమ హయాంలో భ్రష్టు పట్టించిన అంశాలకు సమాధానాలు చెప్పడం లేదు. వారసత్వంగా అందించిన సమస్యలపైనా చర్చించడం లేదు. ప్రతిరోజూ కెటిఆర్, హరీష్ రావులు అనేక సమస్యలు ప్రస్తావిస్తూ దాడి చేస్తున్నారు. ఇవన్నీ పదేళ్లుగా తమ హయాలంలో ఉన్నవే అని గుర్తించ లేక కాదు. తప్పులను రేవంత్ ఖాతాలో వేయాలన్న దుర్బుద్ధి తప్ప మరోటి కాదు. అదే సమయంలో ఎర్రవెల్లి ఫామ్ హౌజ్‌లో కెసిఆర్ విశ్రాంతి కొనసాగిస్తున్నారు. తొలినాళ్లలో ప్రగతి భవన్‌లో ఒక్కనాడు కూడా సామాన్యుల కు ప్రవేశం లేకుండా చేశారు. అలాంటి కేసిఆర్‌కు ప్రజల మీద హఠాత్తుగా ప్రేమ పుట్టుకు వచ్చింది. అధికారం పోయిన వెంటనే ఎర్రవెల్లికి బస్సులు వేసుకుని సామాన్యులు తమకుతాముగా పరుగెత్తుకుంటూ వచ్చారు. వారిని సాదరంగా ఆహ్వానించి భోజనాలు పెట్టించారు. ఓటమి చెందినా హుందాగా స్వీకరించలేక పోయారు. పదేండ్ల పాటు తనకు అధికారం చేయడానికి అవకాశం ఇచ్చిన ప్రజలకు కనీసం ధన్యవాదాలు తెలియజేయలేదు. ప్రజాతీర్పును స్వీకరిస్తున్నానని ప్రకటించలేదు. విజయం సాధించిన కాంగ్రెస్‌కు నోటిమాటగా నైనా శుభాకాంక్షలు తెలియజేయలేదు. సాధారణంగా కొత్త ముఖ్యమంత్రి ఎవరైనా దిగిపోతున్న సిఎం శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుతారు. ఆ కనీస మర్యాదను కూడా కెసిఆర్ పాటించలేదు. పది నెలలు గడిచినా కెసిఆర్ తను నిర్మించుకున్న సౌథం నుంచి ప్రజల్లోకి రావడం లేదు. ప్రజల సమస్యలను చర్చించడం లేదు. ఫామ్‌హౌస్‌కు బలవంతంగా తీసుకుని వచ్చిన వారిని మాత్రం కేసీఆర్ కలుసుకున్నారు. ఏదేమైనా కేసీఆర్ వ్యవహరించిన తీరు మాత్రం తెలంగాణ ప్రజలను కూడా అవమానించడమే. ప్రజల తీర్పు పట్ల ఆయన అసంతృప్తిగా ఉన్నా...అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రజలకోసం పోరాడే నేతగా నిరూపించుకోవాలి. అప్పుడే ప్రజలు నమ్ముతారు. విపక్ష నేతగా తన బాధ్యతను నిర్వహించాలి. మంచి సలహాలు ఇచ్చి తెలంగాణ అభివృద్దిలో భాగం కావాలి.

## హర్యానా సిఎంగా మరోమారు నాయబ్ సింగ్ సైనీ

నయబ్ సింగ్ సైనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హర్యానా మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టార్, రాష్ట్ర మాజీ మంత్రి అనిల్ విజ్‌లు సీఎం అభ్యర్థిగా సైనీ పేరును ప్రతిపాదించగా, సభ్యులు ఏకగ్రీవంగా అంగీకరించారు. దీంతో హర్యానా ముఖ్యమంత్రిగా రెండోసారి సైనీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాగా, హర్యానా ముఖ్యమంత్రిగా సైనీ గురువారంనాడు బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ ఘనవిజయం సాధించింది. 90 అసెంబ్లీ స్థానాల్లో 48 సీట్లు గెలుచుకుని మెజారిటీ మార్క్ (46)ను సునాయాసంగా దాటేసింది. కాంగ్రెస్ పార్టీ 37 సీట్లకే పరిమితమైంది.

## రెండు దేశాల సంబంధాల్లో పీటముడి

దీనికి ప్రతీకారంగా భారత వాయుసేన ఫిబ్రవరి 26న వైమానిక దాడులు చేపట్టింది. పాక్ భూభాగంలోని బాలాకోట్‌లోని జైషే మహ్మద్ ఉగ్ర స్థావరాలపై తెల్లవారుజామున బాంబుల వర్షం కురిపించింది. ఉగ్రవాదాన్ని తాము ఎన్నటికీ సహించబోమని ఈ ఘటనతో భారత్.. పాక్ సహా ప్రపంచదేశాలకు గట్టి సందేశమిచ్చింది. ఇక అప్పటినుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇదిలాఉంటే.. ఎస్సీవో సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన సభ్యదేశాల ప్రతినిధులకు పాక్ ప్రధాని మంగళవారం రాత్రి తన నివాసంలో విందు ఇచ్చారు. ఈసందర్భంగా జైశంకర్, షెహబాజ్‌లు కరచాలనం చేసుకొని కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఎస్సీవో సదస్సులో భారత బృందానికి జైశంకర్ నేతృత్వం వహిస్తారు. తొమ్మిదేళ్ల తర్వాత భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి పాకిస్థాన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. 2015 డిసెంబరులో అప్పటి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ పాకిస్థాన్‌లో పర్యటించారు.

## విమానాల్లో స్కై మార్షల్స్ సంఖ్యా పెంపు..

### నకిలీ బాంబు బెదిరింపులపై కీలక నిర్ణయం..!

న్యూఢిల్లీ : గత మూడు రోజులుగా భారతీయ విమానసంస్థలు నకిలీ బాంబు బెదిరింపుల్ని ఎదుర్కొంటున్నాయి. సోమవారం నుంచి ఈ రోజు బుధవారం వరకు మొత్తం 12 విమానాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. ఈ రోజు ముంబై నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానానికి, ఢిల్లీ నుంచి బెంగళూర్ వెళ్తున్న ఆకాస విమానానికి బాంబు ఉందంటూ బెదిరింపు సందేశాలు వచ్చాయి. మంగళవారం ఢిల్లీ-చికాగో ఎయిరిండియా విమానానికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. దీంతో విమానాన్ని కెనడాలోని ఓ మారుమూల విమానాశ్రయంలో ల్యాండ్ చేసి, తనిఖీలు నిర్వహించాల్సి వచ్చింది.ఈ నేపథ్యంలో ఈ రోజు కేంద్ర పౌరవిమానయాన అధికారులు అత్యున్న సమావేశం నిర్వహించారు. మంత్రిత్వ శాఖ, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ, హోం మంత్రిత్వ శాఖ అధికారులు భేటీలో పాల్గొన్నారు. సమాచారం ప్రకారం.. సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీ ఈ బూటకపు కాలర్లను గుర్తించి వీరిని 'నో ఫ్లై' జాబితాలో చేర్చేందుకు సమాయత్తమవుతోంది. ఇదే విధంగా విమానాల్లో ఎయిర్ మార్షల్స్ సంఖ్యను రెట్టింపు చేయడంపై కూడా చర్చ జరుగుతోంది. ఎన్ఎస్‌జీ కమాండో యూనిట్ ఎయిర్ మార్షల్స్‌ని ప్రధానంగా అంతర్జాతీయ మార్గాలు, దేశీయంగా సున్నితమైన మార్గాల్లో మోహరించనున్నారు. స్కై మార్షల్స్ సాధారణ ప్రయాణికుల వలే విమానంలో ప్రయాణించే సాయుధ భద్రతా అధికారులు. బాంబు బెదిరింపులపై నివేదిక సమర్పించాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్), బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి)లను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశించినట్లు తెలుస్తోంది. భారతదేశ విమానరంగానికి చెడ్డపేరు తెచ్చేందుకు కొందరు ఇలాంటి పనులు చేస్తున్నారని తెలుస్తోంది.

## యువతిపై అర్ధరాత్రి అత్యాచారం కేసు

### ఆటో డ్రైవర్‌ను గుర్తించి అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్ : గచ్చిబౌలి ఠాణా పరిధిలో అర్ధరాత్రి యువతిపై జరిగిన అత్యాచార ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆటోడ్రైవర్ ప్రవీణ్‌ను లింగంపల్లి పరిధిలోని గోపీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరా దృశ్యాలు, ఫోన్ నంబర్ ఆధారంగా కేసును ఛేదించారు. నిందితుడి స్వగ్రామం నల్గొండ జిల్లా కేతిపల్లిగా గుర్తించారు.

## కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

క్వింటాల్‌కు రూ.150, ఆవాల పంటపై క్వింటాల్‌కు రూ.300 చొప్పున పెంచారు.రైతులకు దీపావళి కానుకగా రావి పంటల ఎంఎస్‌పిని కూడా పెంచాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. నివేదిక ప్రకారం.. మార్కెటింగ్ సీజన్ 2025-26 కోసం ప్రభుత్వం రబీ పంటలకు కొత్త కనీస మద్దతు ధర (%మీఖా%)ని నిర్ణయించింది. ఇందులోభాగంగా గోధుమల ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.150 పెంచి రూ.2,425కి చేరుకుంది.ఇది ఇప్పటివరకు క్వింటాల్‌కు రూ.2,275గా ఉంది. ఆవాలపై ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.300 పెంచి క్వింటాల్‌కు రూ.5,650 నుంచి రూ.5,950కి పెరిగింది. అదేవిధంగా, కందుల ఎంఎస్‌పిని క్వింటాల్‌కు రూ.210 పెంచాలని నిర్ణయించారు. దాని కొత్త ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.5,650గా మారింది. ఇది గతంలో క్వింటాల్‌కు రూ.5440గా ఉంది. ఇది కాకుండా కందులుపై ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.275 పెంచి క్వింటాల్‌కు రూ.6,425 నుంచి రూ.6,700కి పెంచారు. కుసుమ ధర రూ.5,800 నుంచి రూ.140 పెరిగి రూ.5,940కి చేరింది.రైతులకు వారి పంటలకు ప్రభుత్వం హామీ ఇచ్చే కనీస మద్దతు ధర ఎమ్ఎస్పీ అంటారు. ప్రభుత్వం రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసే ధర ఇది. పంటల ధరల్లో హెచ్చుతగ్గుల వల్ల నష్టాల నుంచి రైతులను రక్షించడమే దీని లక్ష్యం. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ .. రైతుల సంక్షేమం కోసం కేంద్రం కట్టుబడి ఉందన్నారు. పంజాబ్-హర్యానా సరిహద్దులో ఉన్న రైతుల గురించి కూడా ప్రస్తావించారు. రైతుల సంక్షేమానికి పూర్తి కట్టుబడి ఉన్నామని, రైతులకు మేలు చేసే అనేక నిర్ణయాలు తీసుకున్నామన్నారు.

## ఢిల్లీలో తీవ్ర వాయు కాలుష్యం..

ఇంత తీవ్ర సమస్య ఉంటే ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా?.. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతారా? అని దేశ అత్యున్నత ఢిల్లీ పొరుగు రాష్ట్రాల తీరును ఎండగట్టింది. పంజాబ్ లోని రైతులు పంట ఎండు గడ్డి (మొద్దు)ని కాల్చడం వల్ల తీవ్ర వాయు కాలుష్యం ఏర్పడుతోందని గత కొన్ని సంవత్సరాలుగా పర్యావరణ నిపుణులు చెబుతున్నా.. ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవలేదో? అర్థం కావడం లేదని సుప్రీం కోర్టు త్రిసభ్యధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది.ముగ్గురు న్యాయమూర్తులు.. జస్టిస్ ఎహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎ జి మసీహ్, జస్టిస్ అభయ్ ఎస్. ఓకా లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం హర్యాణా, పంజాబ్ రాష్ట్రాలలోని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్ (సిఎక్యూఎం) అధికారులని ఢిల్లీ వాయు కాలుష్యానికి బాధ్యులుగా చేసింది. "హర్యాణా, పంజాబ్ రాష్ట్రాలలో పంట ఎండు గడ్డి కాల్చడంపై నిషేధం ఉన్నా రైతులు నియమాలను పాటించకపోతే వారిని ఎందుకు శిక్షించలేదు? హర్యాణాలో అయితే 2021 నుంచి ఇప్పటి వరకు కేవలం 200 మందిపై నామమాత్రంగా చర్యలు తీసుకున్నారు. అది కూడా ఏదో చిన్న ఫైన్ విధించి చేతులు దులుపుకున్నారు. అసలు అధికారులు పనిచేస్తున్నారా?. హర్యాణా, పంజాబ్ ప్రభుత్వాలు కోర్టు ఆదేశాలు పాటించవా?.. పాటించకపోతే తాము ఏమీ చేయలేమని చెప్పాలి? ఆ తరువాత మేము చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో చీఫ్ సెక్రటరీలపై ఎవరైనా రాజకీయ ఒత్తిడి చేస్తుంటే.. మాకు తెలియజేయాలి. వారికి కూడా కోర్టు సమన్లు జారీ చేస్తుంది. వాయు కాలష్యంపై ఎందుకు చర్యలు తీసుకోలేదో? పంజాబ్, హర్యాణా చీఫ్ సెక్రటరీలు సమాధానం చెప్పాలి. ఇద్దరూ వారం రోజుల తరువాత కోర్టులో స్వయంగా హాజరుకావాలి." అని సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనం వాయు కాలుష్యంపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కోర్టు విచారణ సమయంలో ప్రభుత్వం తరుపున వాదించే పంజాబ్ అడ్వకేట్ జెనెరల్ కు న్యాయమూర్తల కోపంతో చెమటలు పట్టాయి. 2013లో పంజాబ్ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షన చట్టం తీసుకువచ్చింది. కానీ దాని అమలు ఏమాత్రం లేదని సుప్రీం కోర్టు గమనించింది. విచారణ మధ్యలో పంజాబ్ ప్రభుత్వ న్యాయవాది తమకు ఎండు గట్టి కాల్చే లొకేషన్ తెలుసుకునేందకు ఆలస్యం జరుగుతోందని చెప్పగా.. న్యాయమూర్తులు మరింత ఆగ్రహం చూపించారు. భారతదేశ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో శాటిలైట్లు పంజాబ్, హర్యాణా ప్రభుత్వాలకు పొగ వచ్చే లొకేషన్ గుర్తించి వెంటనే సమాచారం అందిస్తోందని.. ఈ విషయం రికార్డుల్లో ఉన్నా.. కోర్టును మధ్య పెట్టేందుకు చూస్తారా? అని అడ్వకేట్ జెనెరల్ కు చురకలు అంటించారు. ఢిల్లీలో దసరా తరువాత వాయు కాలుష్యం పెరిగిపోయింది. పైగా త్వరలో దీపావళి రానుంది. ఈ నేపథ్యంలో రాజధానిలో టపాసులు కాల్చడం, విక్రయించడం, తయారు చేయడంపై నిషేధం ఉంది. వాహన కాలుష్యంపై కూడా ప్రభుత్వం సీరియస్ గా ఉంది. వాయు కాలుష్యం కారణంగా దేశ రాజధానిలో ప్రతీ సంవత్సరం శ్వాస సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న బాధితుల సంఖ్య పెరిగిపోతోంది.

## రైతులకు అనుకూలంగా కాంగ్రెస్ ప్రభుత్వం

కేంద్రాలకు తీసుకువస్తే 24 గంటల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ వద్ద గతంలో బత్తాయి పండ్ల కోసం నిర్మించిన షెడ్డులో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రితో విజ్ఞప్తి చేశారు. అనంతపూర్ తర్వాత నల్గొండ జిల్లాలోనే అత్యధికంగా బత్తాయి సాగు జరుగుతుందని, సుమారు 50,000 ఎకరాలలో బత్తాయి సాగు చేస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో భాగంగా నల్గొండ జిల్లాలో 375 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటి వరకే 152 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిం చామన్నారు. ఈ వారం చివరి వరకు అన్ని కేంద్రాలు ప్రారంభిస్తామని, కొనుగోలు కేంద్రాలలో తేమ కొలిచే యంత్రాలు,తూకం యంత్రాలు, లారీలు, హమాలీల వంటి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతులకు వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రెండు శుభవార్త లు చెప్పారు. నిడమానూర్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల రైతు భరోసా, రూ.2లక్షల రుణమాఫీ గురించి ప్రస్తావించారు. దీపావళి పండుగ కంటే ముందే మిగిలిన 4లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని తెలిపారు. త్వరలో రైతు భరోసా కూడా అందిస్తామని అన్నారు. పంటరుణం రూ.2 లక్షల కన్నా పైనున్న వారికి విడతల వారీగా డబ్బులు జమ చేస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ధాన్యం కొనుగోలు చేపడతామని.. రూ.500 బోనస్ కూడా ఇస్తున్నామని మంత్రి వివరించారు. రాష్ట్ర రైతాంగానికి అనుగుణమైన పరిపాలన అందిస్తున్నామని.. గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు చిన్నాభిన్నమైయ్యాని మంత్రి తుమ్మల అన్నారు. ఃూఒఃఅతోపాటు, నల్గొండ జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసి తీరుతామని తెలిపారు. కుందురు జానారెడ్డి1982 నుంచి రాజకీయాల్లో తన చేయి పట్టుకొని నడిపించారని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. తన రాజకీయ గురువు జానారెడ్డే అని ఆయన చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లోతనను నిలబెట్టింది జానారెడ్డి అని చెప్పుకొచ్చారు.12 శాఖల మంత్రిగా పని చేసిన జానా రెడ్డి తన్ను ప్రోత్సహించారని అన్నారు. జానారెడ్డి రాజకీయం అంటే నీతి నిజాయితీ నిబద్ధతతో ఉంటాయని మంత్రి తుమ్మల చెప్పారు.

## అప్పుల వారసత్వానికి ఆద్యులు ఎవరు?

### మీ హయాంలో అక్షరాలా రూ.7 లక్షల కోట్ల అప్పులు

### మంత్రి కేటీఆర్ ఆరోపణలకు మంత్రి సీతక్క కౌంటర్

హైదరాబాద్ : పదేళ్ల పాలనలో లక్షల కోట్ల అప్పులు చేశారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్టుల పేరుతో అందినకాడికి అప్పులు తీసుకున్నారు. ఈ లెక్కలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బయటపెట్టింది. అసెంబ్లీ సాక్షిగా అన్ని వివరాలను ప్రజల ముందు ఉంచింది. అధిక అప్పుల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో కూడా వివరించింది. అయినా కూడా తాము మ్యానేజ్ చేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేస్తామని స్పష్టం చేసింది. అయితే, 10 నెలల కాంగ్రెస్ పాలనలో రూ.80వేల కోట్లకు పైగా అప్పులు చేసినట్టు మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. దీనికి మంత్రి సీతక్క కౌంటర్ ఇవ్వడంతో రాష్ట్ర అప్పులపై మరోసారి చర్చ జరుగుతోంది.రేవంత్ కుర్చీ ఎక్కిన రోజు నుండి తెచ్చిన మొత్తం అప్పులు 80,500 కోట్లు అని, 10 నెలల్లో ఇదో రికార్డ్ అని విమర్శించారు కేటీఆర్. అప్పు తప్పు అన్నోళ్లని ఇప్పుడు దేనితో కొట్టాలని సెటైర్లు వేశారు."ఎన్నికల హామీలేవీ తీర్చలేదు. ఏ కొత్త సాగునీటి ప్రాజెక్టు కట్టలేదు. మరి ముఖ్యమంత్రి తెస్తున్న అప్పు ఏమైనట్టు? 80 వేల కోట్ల ధనం ఎవరి జేబులోకి వెళ్లినట్టు? బడా కాంట్రాక్టర్ల బిల్లులకే ధారాదత్తం చేస్తున్నారా? కమిషన్ల కోసం కక్కుర్తి పడే అప్పులు తెస్తున్నారా? అప్పు శుద్ధ తప్పు అని ప్రచారంలో ఊదరగొట్టి అవే అప్పుల కోసం ముఖ్యమంత్రి పాకులాడటమేంటి? బీఆర్ఎస్ హయాంలో అప్పులు తీసుకుని ప్రాజెక్టులు కట్టాం. ప్రతి పైసాతో మౌలిక సదుపాయాలు పెంచాం. తీసుకున్న రుణంతో దశాబ్దాల కష్టాలు తీర్చాం" అని అన్నారు కేటీఆర్. కానీ, రేవంత్ రెడ్డి తెస్తున్న అప్పుల అడ్రస్ ఎక్కడుందని ప్రశ్నించారు. రుణమాఫీ చేయకుండా, రైతుభరోసా వేయకుండా, కొత్త ప్రాజెక్టు కట్టకుండా, నెలలపాటు జీతాలు ఇవ్వకుండా, ఇన్ని వేలకోట్లు ఏమైనట్టు? ఎవరి జేబుల్లోకి వెళ్లినట్టు అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. సొంత ఆస్తులు పెంచుకోవడానికి అప్పులు చేయడం క్షమించరాని నేరం, తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు పెను ప్రమాదం అంటూ విమర్శించారు. అప్పులపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు మంత్రి సీతక్క. "తొమ్మిదన్నరేళ్లలో మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికి కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితిని తీసుకొచ్చింది ఎవరు? అప్పుల వారసత్వానికి ఆద్యులు ఎవరు? మీ హయాంలో అక్షరాలా రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారు. వాటికి కిస్తీలు, వడ్డీల కోసం ప్రతిరోజు టంచన్‌గా రూ.207 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. అంటే ప్రతి నెలా సగటున రూ.6 వేల కోట్ల ప్రజాధనాన్ని మీ అప్పుల కుప్పను కడగడానికే సరిపోతుంది. అప్పుల అప్పారావు లాగా అందిన కాడల్లా అప్పులు చేసి, రాష్ట్రాన్ని తిప్పలు పెట్టి, వడ్డీలతో ఆర్థిక వ్యవస్థ నడ్డి విరిచిన మిమ్మల్ని దేనితో కొట్టాలి" అంటూ కౌంటర్ ఇచ్చారు సీతక్క. అప్పులు చాలవన్నట్లు వేల కోట్ల బకాయిలను చెల్లించలేదని, చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో పెట్టారని మండిపడ్డారు. "మీ నిర్వాకంతో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ, ఈ 10 నెలల కాలంలో 18 వేలకోట్ల పంట రుణాలను ప్రజా ప్రభుత్వం మాఫీ చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళల వంటింటి భారం దించేందుకు రూ.500 కే గ్యాస్ సిలిండర్, సామాన్యులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పటికే 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ శాం. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటు, ఇలా ఎన్నో ప్రతిష్టాత్మక పథకాలకు శ్రీకారం చుట్టాం.

## రికార్డు స్థాయిలో ప్రభుత్వం అప్పులు

తెచ్చిన అప్పులతో దశాబ్దాల కష్టాలు తీర్చామన్నారు. రుణమాఫీ చేయకుండా, రైతుభరోసా ఇవ్వకుండా.. ఒక్క ప్రాజెక్టు కట్టకుండా.. నెలల పాటు జీతాలు ఇవ్వకుండా ఇన్ని వేల కోట్లు ఏం చేశారని నిలదీశారు. రాష్ట్రంలో సంపద సృష్టించే ప్రయత్నం చేయకుండా సొంత ఆస్తులు పెంచుకోవడానికి అప్పులు చేయడం క్షమించరాని నేరమన్నారు. ఈ అప్పులు రాష్ట్ర భవిష్యత్ కే పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు.

## జైల్లో నన్ను చంపేందుకు బీజేపీ కుట్ర..

సకాలంలో ఇంజెక్షన్ తీసుకోకపోతే చనిపోయే అవకాశం ఉందని తెలిపారు. ఈ మేరకు తీహార్ జైల్లో చంపేందుకు బీజేపీ కుట్ర చేసిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇక ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వస్తే.. ఉచిత విద్యుత్ పథకం ఎత్తేస్తారన్నారు. పదేళ్లుగా ఢిల్లీ అభివృద్ధి పనులను బీజేపీ నిలిపివేసిందని కేజ్రీవాల్ ఆరోపించారు.ఇక తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, ఢిల్లీలో ప్రజల కోసం పనిచేస్తున్నందున తనను జైలుకు పంపారని తెలిపారు. తాను బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత పగిలిన రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీలు శుభ్రం చేయడం, నీటి సరఫరా నిరాంతరాయంగా ఆప్ ప్రభుత్వం కొనసాగిస్తుందని చెప్పారు. ఇక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి గల కారణాలను వివరిస్తూ ఢిల్లీ ఓటర్లకు కేజ్రీవాల్ లేఖ రాశారు. ఈ లేఖను ఆప్ కార్యకర్తలు అక్టోబర్ 29 వరకు 70 నియోజకవర్గాల్లోని ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారు. వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆప్ ప్రభుత్వం స్పీడ్ పెంచింది. మరోసారి అధికారం కోసం ప్రణాళికలు రచిచూస్తోంది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేసి తీహార్ జైల్లో పెట్టారు. ఆరు నెలల తర్వాత సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంతో ఇంటికి వచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో అతిషిని ముఖ్యమంత్రిని చేశారు.

## ఏఐ ద్వారా సీవీని రూపొందించిన నిరుద్యోగి

న్యూఢిల్లీ : చాట్-జీపీటీ అనేక విధాలుగా ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే దీనిని జాగ్రత్తగా ఉపయోగించాలి లేకపోతే చెడు పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఢిల్లీకి చెందిన ఒక సీఈవో తన పోస్టలలో.. చాట్‌జీపీటీ సహాయంతో వ్రాసిన తర్వాత కూడా ప్రూఫ్ రీడింగ్ ఎందుకు అంత ముఖ్యమైనదో ఉదాహరణతో ప్రజలకు వివరించారు. ఎంట్రేజ్ సంస్థ సీఈఓ అనన్య నారంగ్ ఉద్యోగ దరఖాస్తుదారుకి చెందిన కవర్ లెటర్ స్క్రీన్‌షాట్‌ను పోస్ట్ చేసి, అందులోని ఓ తప్పుడు హైలైట్ చేశారు. ఇది వినియోగదారులను షాక్‌కు గురి చేసింది. స్క్రీన్ షాట్ చూస్తుంటే బహుశా అప్లికేషన్ పంపే వ్యక్తి తొందరపడి కవర్ లెటర్ ను సరిగ్గా చదవకుండా కాపీ పేస్ట్ చేసి ఉంటాడని తెలుస్తోంది. స్క్రీన్‌షాట్‌లో కవర్ లెటర్‌లో వ్యక్తిగత సమాచారం స్థానంలో టెంప్లేట్ ప్లేస్‌హోల్డర్‌లు ఉన్నాయి. ఈ లేఖ కంటెంట్ సంబంధిత స్థానం కోసం పంపబడింది. చాలా చోట్ల, వ్యక్తిగత సమాచారానికి బదులుగా, టెంప్లేట్‌లు మాత్రమే కనిపిస్తున్నాయి.అభ్యర్థి చాట్‌జీపీటీ సాయంతో తన సీవీని ఆసక్తికరంగా రూపొందించి కంపెనీకి పంపించాడు. ఈ దరఖాస్తును చూసిన ఎంట్రేజ్ సంస్థ సీఈఓ అనన్య నారంగ్‌కు కంగుతిన్నారు. సాధారణంగా, "చాట్‌జీపీటీకి ఫలానా ఉద్యోగం కోసం దరఖాస్తు రూపొందించు" అని చెబితే, ఆ ఏఐ ప్లాట్‌ఫామ్ సంబంధిత టెంప్లేట్‌ను చిటికెలో తయారుచేస్తుంది. అయితే, అభ్యర్థి చాట్‌జీపీటీ రూపొందించిన అప్లికేషన్‌ను కంపెనీకి పంపించాడని ఆమె గమనించారు. అందులో నైపుణ్యాలు, అనుభవం వంటి విషయాలను చూసి ఆమె ఆశ్చర్యపోయారు. దరఖాస్తు కోసం అభ్యర్థి చాట్‌జీపీటీని ఉపయోగించాడనే విషయం స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ విషయానికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను ఆమె 'ఎక్స్' వేదికపై పోస్ట్ చేశారు. నిరుద్యోగం ఉందని చెప్పడంలో ఆశ్చర్యం లేదు" అంటూ ఆమె తన వ్యాఖ్యలు జోడించారు. "ఇలాంటి ఉద్యోగ దరఖాస్తులపై ఎలా స్పందించాలి?" అని ఎక్స్ వేదికలో సలహాలు అడిగారు. "చాలామంది అభ్యర్థుల మాదిరిగా ఈ వ్యక్తి కూడా చాట్‌జీపీటీ సాయంతో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే, పంపేముందు మరోసారి దాన్ని చదవలేదు" అని ఆమె అసహనం వ్యక్తం చేశారు. అంతే కాకుండా.. ఆమె పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. చాట్‌జీపీటీ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇలాంటి దరఖాస్తులు సాధారణమైపోయాయని కొందరు రిక్రూటర్లు వెల్లడించారు.

## కంచి విశ్వవిద్యాలయంలో 86 మంది తెలంగాణ విద్యార్థులు

హైదరాబాద్, : కంచి లోని శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయంలో వివిధ ఉన్నత స్థాయి కోర్సులలో ఈ విద్యా సంవత్సరం తెలంగాణా రాష్ట్రానికి చెందిన 86 మంది చేరారు. వివిధ కోర్సులలో చేరిన ఈ విద్యార్థినీ విద్యార్థులకు కంచి స్వామిజి శంకర విజయేంద్ర స్వరస్వతి ఆశీర్వచనాలు అందచేశారు. . రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ కంచి కామకోటి పీఠానికి వెళ్లి కంచి స్వామీజీ విజయేంద్ర సరస్వతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్య సంవత్సరం కంచి విశ్వవిద్యాలయంలో చేరిన తెలంగాణా కు చెందిన 34 మహిళా విద్యార్థినులు, 52 మంది విద్యార్థులతో శైలజా రామయ్యర్ సమావేశమయ్యారు. కంచి విశ్వవిద్యాలయంలో భారతీయ సంస్కృతీ, తదితర విభాగాలలో ఈ విద్యార్థులు చేరారు. వివిధ కోర్సులలో చేరిన తమకు కంచి స్వామి శంకర విజయేంద్ర స్వరస్వతి ఆశీర్వచనాలు అందచేశారని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన ఈ విశ్వ విద్యాలయంలో అత్యంత నిష్ణాతులైన ఉత్తమ అధ్యాపకులు ఉన్నారని విద్యార్థులు ఆమెకు తెలిపారు.

# న్యాయవాదుల సమస్యలను పరిష్కరించే విధంగా పని చేస్తాను



**కరీంనగర్ టౌన్, అక్టోబర్16, (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ లోని జిల్లా న్యాయస్థానంలో బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేసి వారి మద్దతును ఇవ్వాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ నా రాజకీయ ప్రస్థానం ఇదే కరీంనగర్ కోర్టు నుండి ప్రారంభం అయిందని నాకు ఈ సమాజంలో గుర్తింపును రాజకీయంగా ప్రోత్సాహం కూడ ఈబార్ అసోసియేషన్ నాకు ఇచ్చిందని ఇప్పుడు ఎమ్మెల్సీగా కూడ ఈ బార్ సభ్యుల సహాకరం అలాగే ఉండాలని కోరుతున్నానాని వారు అన్నారు. అలాగే బాధ్యత కలిగిన పౌరునిగా ఓటు హక్కును వినియోగించుకోవడం మన ప్రాదమిక హక్కు మీరు వేసే ఓట్లు పట్టభద్రుల జీవితాలలో ఒక భరోసా కల్పిస్తుందని. 2021 నవంబర్ లోపు డిగ్రీ పూర్తి అయినా వారందరూ వచ్చే నెల అరోవ తారీకు లోపు పట్టభద్రులు ఓటరుగా నామోదు చేయించుకోవాలి ఈ నియోజకవర్గ పరిధిలో అన్ని అన్ లైన్ సెంటర్లలో లేద మా కార్యాలయంల కానీ ఓటర్ యొక్క ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు మా అఫిస్ అందజేస్తే మేమే ఆన్లైన్ లో ఎంట్రీ చేస్తామని వారు తెలియజేశారు. కనుక డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్లు గా నామోదు చేసుకోవాలని పోయినసారి నామోదు చేసుకొని ఓట్లు వేసినవారు కూడ మళ్ళీ ఈసారి కూడ నామోదు చేసుకోవాలని సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడిగా మిలో ఒకడిగా నాకు ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రుల, నిరుద్యోగుల, సమస్యల మీద ఒక అవగాహన కలిగిన వ్యక్తిగా వాటి పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తానని ఈ నాలుగు జిల్లాలకు చెందిన పట్టభద్రుల, నిరుద్యోగుల గొంతుకగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాను. అదేవిధంగా కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో ఉన్న ప్రతిఒక్క పట్టభద్రుడికి దేశంలో ఎక్కడ లేనటివిధంగా కేవలం ఒక్క రూపాయకే హెల్త్ ఇన్సూరెన్స్ చేయిస్తాను ఎందుకంటే నిరుద్యోగులు మరియు ప్రయివేట్ ఉపాధ్యాయులు, డిగ్రీలు పూర్తి చేసుకుని ప్రభుత్వ ఉద్యోగులు లేక ఇతర ప్రయివేట్ సంస్థలలో పనిచేసే వారి సమస్యలు నాకు తెలుసు చాలీచాలని జీతాలతో వారు జీవితాన్ని నెట్టుకోస్తున్నారు అలంటి వారికి వారు పనిచేసే ఏసంస్థ కూడ వారికి హెల్త్ ఇన్సూరెన్స్ చేయించారు అలాంటి పరిస్థితిలో వారికి అరోగ్య సమస్యలు వచ్చినప్పుడు అ కుటుంబం అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు అందుకే నన్ను ఎమ్మెల్సీగా గెలిపిస్తే వారందరికీ కేవలం ఒక్క రూపాయికే హెల్త్ ఇన్సూరెన్స్ చేయించి వారికి ఒక భరోసా కల్పిస్తునాని సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు సర్దార్ రవీందర్ సింగ్ కు సన్మానం చేసి న్యాయవాది సుంకె దేవకిషన్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార ఖర్చులకు 10116రూ విరాళాలం అందించారు. ఈ కార్యక్రమంలొ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలు రాజుకుమార్, మాజీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, న్యాయవాదులు అనీల్, తవుటు మురళి, పురెల్ల రాములు, విక్రం, సాదవేణి వినాయ్, మిరియల్ కర్ మునిందర్, కనకం వంశి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

# ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత మెగా గుండె వైద్య శిబిరం




**పెద్దపల్లి, అక్టోబర్ 16 ( ది క్రైమ్ న్యూస్ ):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలకేంద్రంలోని మల్లిఖార్జున స్వామిదేవాలయంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం దేవాలయ సిబ్బందికి ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి. వైద్య శిబిరాన్ని స్థానిక ఓదెల కాంగ్రెస్ పార్టీ మండలఅద్యక్షుడుమూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డిలుకలిసి ప్రారంభించారు. అనంతరంవారు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలను నిర్వహించడం ద్వారా ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కిడ్నీ, గుండె సమస్యలనుఎప్పటికీ నిర్లక్ష్యం చేయకూడదన్నారు. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంచుకోవడానికి సాధ్యం అవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆలయ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు ఆసుపత్రి డాక్టర్ దీక్షిత్ ఆధ్వర్యంలో వందమందికి పైగా వైద్య పరీక్షలను చేయించుకున్నారు బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఎకో మొదలగు సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆలయసిబ్బందికి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతోనే ఈ వైద్య శిబిరం నిర్వహించమన్నారు. అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని ఉచితంగా అందించినందుకు కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు వీరభద్రయ్య భూమయ్య ఆసుపత్రి సిబ్బంది బి. హారీష్, శ్రీనివాస్ ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్ట్ యూసఫ్ పై పెట్టిన అక్రమ కేసు తొలగించి విడుదల చేయాలి..

**- టిడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు సొడమల్ల యోహాన్, ఏబూసి సంపత్**





**జమ్మికుంట అక్టోబర్ 16 (ది క్రైమ్ న్యూస్):** జర్నలిస్టు ఎండి యూసుఫ్ పై చందుర్తి పోలీసులు పెట్టిన అక్రమ కేసును తొలగించి, జైల్లో వున్న అతనిని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు సొడమల్ల.యోహాన్, ఏబూసి. సంపత్ డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల పోలీసులు ఇటీవల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్, సిరిసిల్ల జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడైన జర్నలిస్టు ఎండి యూసుఫ్ కు సంబంధంలేని ఒక కేసును అంటగట్టి అతనిపై అక్రమంగా కేసు నమోదు చేశారని తెలిపారు. యూసుఫ్ పై పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరింపజేసి, అతనిని వెంటనే విడుదల చేయాలని కోరారు. తప్పు చేయని జర్నలిస్టులపై ఇలా తప్పుడు కేసులు పెట్టడం తగదని, ఈ సంఘటనపై ప్రత్యేక అధికారితో విచారణ జరిపించి జర్నలిస్టు యూసుఫ్ పై తప్పుడు కేసు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టులపై అక్రమ కేసులు ఉండవని భావించామని, కానీ అక్రమ కేసుల బనాయింపులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే యూసుఫ్ ను విడుదల చేసి అక్రమ కేసు తొలగించాలని లేనిపక్షంలో టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో పలు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# జీడీకే రెండవ పట్టణ ఎస్.ఐ గా సోనియా

**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** గోదావరిఖని రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా ఏ. సోనియా బుధవారం బాధ్యతలు చేపట్టారు. రామగుండం కమిషనరేట్ లో విధులు నిర్వహించిన ఎస్ఐ సోనియా సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్ కు వచ్చి పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రసాద్ రావు ను కలిసి పూల మొక్కను అందజేసి, జైనింగ్ రిపోర్ట్ అందజేశారు.



# పెండింగ్ ఫీజు రీయంబర్స్ మెంట్స్ స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి

**- ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ, పి.జి. కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేయాలి**

**- కళాశాలల బంద్‌తో పేద విద్యార్థుల చదువులు నష్టం**

**- తక్షణమే ఫీజులను విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు - ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ.**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఆరేండ్ల నుండి 8 వేల కోట్ల పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్స్ మరియు స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాని వారు డిమాండ్ చేశారు. ఈ ఫీజులను విడుదల చేయకపోవడం వల్ల ఇప్పటికే చాలా రకాల ప్రవేశ పరీక్షలు పూర్తి అయ్యి ఉన్నత చదువులకు వెళ్ళెవారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పేద విద్యార్థులు తమ అప్పులు చేసి మరి సర్టిఫికేట్స్ తీసుకుంటున్నారు. ఒక్క ప్రక్కన విద్యార్థులు ఇబ్బందులు, మరోవైపు యాజమాన్యాలు అప్పులు తెచ్చి నడిపిస్తున్నామని ,జీతాలు చెల్లించలేమని కళాశాలలబంద్‌కు పిలుపునిచ్చారు. ప్రభుత్వం యాజమాన్యాలతో చర్చించి పేద విద్యార్థులు నష్టం లేకుండా నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో డిగ్రీ, పి.జి. కళాశాలలు కంటే ప్రైవేట్ రంగంలో ఎక్కువ ఉన్నాయని వాటిలో ఎక్కువ మంది పేద విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బి.సి., మైనారిటీ విద్యార్థులే నష్టపోతారని ,ఒక్క ప్రక్కన విద్యలో విప్లవాత్మక మార్పులంటూ ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రారంభం చేస్తూనే విద్యార్థుల ఫీజులను గత ప్రభుత్వం వలె విద్యారంగానికి ప్రాధాన్యత తగ్గించి విద్యను ప్రైవేట్ రంగంలో మార్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఫీజులను విడుదల చేసి పేద విద్యార్థులందరికీ న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో అనేకమైన ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్, నాయకులు గద్దల సిద్ధార్థ, అభిరామ్, అనిరుద్, సాగర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ప్రారంభించిన సుడా చైర్మన్



**కరీంనగర్ టౌన్, అక్టోబర్16(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం మెయిన్ గేట్ ఎదురుగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వసుధ ఫ్యామిలీ రెస్టారెంట్ ను ప్రారంభించారు. నాణ్యమైన సేవలు అందించి వినియోగదారుల మందనలు పొందాలని రెస్టారెంట్ నిర్వాహకులకు కోమటిరెడ్డి సూచించారు. వినియోగదారుల మందనలు పొందినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు.

# వేదమంత్రాలతో ఒక్కటైన ప్రేమ జంట...

**కరీంనగర్ టౌన్, అక్టోబర్16(ది క్రైమ్ న్యూస్):** తాడికల్ గ్రామానికి చెందిన బోయిన కళ్యాణ్ కనకం రుచిత వేద మంత్రాల తో ఒక్కటయ్యారు. వాళ్ళు చిన్ననాటి నుంచే ఒకరినొకరు ప్రేమించుకున్నారు. కానీ వాళ్ళ కుటుంబ సభ్యులకు ఇష్టం లేక వాళ్లను ఎదురించి చొప్పదండి మండలం చాకుంట గ్రామం శ్రీ వెంకటేశ్వర దేవాలయం లో వేద మంత్రాలతో ఒక్కటయ్యారు. బెజ్జంకి రాజేష్,కోరుకంటి రామచంద్రం, బోయిన సురేష్, శైలజా సమక్షంలో వాళ్ళ పెళ్లి ఘనంగా జరిగింది.



# తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం మండల అధ్యక్షుడిగా సదయ్య

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం పెద్దపల్లి మండల అధ్యక్షులుగా అందుగులపల్లి గ్రామానికి చెందిన దామ సదయ్యను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు డా. చీమ శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో దామ సదయ్య పోరాడిన తీరు, జైలు జీవితం అనుభవించారాని శ్రీనివాస్ పేర్కొన్నారు. కాగా తన నియామకానికి కృషి చేసిన పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్య యాదవ్, తదితరులకు సదయ్య కృతజ్ఞతలు తెలిపారు.



# సింగరేణి డైరెక్టర్‌కు "ఇఫ్టు" కృతజ్ఞతలు



**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) నాయకులు బుధవారం సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ (పా) డైరెక్టర్ జి. వెంకటేశ్వర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కంపెనీ స్థాయి రెస్క్యూ పోటీలు ప్రారంభించేందుకు రెస్క్యూ స్టేషన్ కు వచ్చిన డైరెక్టర్ ను యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి. బ్రహ్మానందం, ప్రధానకార్యదర్శి ఏ. వెంకన్న, ఉపాధ్యక్షులు బి. అశోక్ లు కలిసి, కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పూల మొక్కను అందజేశారు. ఇక డైరెక్టర్ వెంట రామగుండం డివిజన్.2, జీఎం ఎల్.వి. సూర్యనారాయణ, రామగుండం డివిజన్.3 జీఎం ఎన్. సుధాకర్ రావు, ఓసీపీ.3 ప్రాజక్ట్ అధికారి ఎస్. మధుసూదన్ ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సింగరేణిలో పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా కోసం కార్మికుల, కార్మిక సంఘాల పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా నేడు కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్ సాధ్యమైందన్నారు.

# పేదలకు పోషకాఆహార భద్రత కల్పించాలి

**- ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ బి రమేష్**



**జమ్మికుంట అక్టోబర్ 16 (ది క్రైమ్ న్యూస్):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఒక రోజు కార్యాశాలను (వర్క్ షాప్) "ప్రభుత్వ ఆహార విధానాలు విమర్శనాత్మక మూల్యాంకనం" సూచనలు సలహాలు" అనే అంశంపై ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ పేదరికం పూర్తి పోషకాహార భద్రత కల్పించాలని తద్వారా పేదరికాన్ని నిర్మూలించాలని అన్నారు. అనంతరం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం రిసోర్స్ పర్సన్ ఏ ప్రశాంతి మాట్లాడుతూ విటమిన్లు, ప్రోటీన్లు కలిగిన పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని తద్వారా దృఢత్వ భారతాన్ని సాధించవచ్చునని తెలిపారు. మరో రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎల్ మహేష్ మాట్లాడుతూ హరిత విప్లవం ద్వారా ఆహార ధాన్యాలు ఉత్పత్తులో స్వయం సమృద్ధి సాధించామని తెలిపారు. వర్క్ షాప్ సమన్వయకర్త డాక్టర్ కే రాజేంద్ర మాట్లాడుతూ పేదరికాన్ని పూర్తిగా తొలగించే వరకు పిడిఎస్ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సేంద్రియ వ్యవసాయ రైతు జి శ్రీకాంత్ సేంద్రియ ఆహార ధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి సమన్వయకర్త డాక్టర్ ఎస్ ఉదయ్ కుమార్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ కే గణేష్, అధ్యాపకులు డాక్టర్ ఈ రవి, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ కుమార్, మాధవి, రవి ప్రకాష్, ఎల్ రవి సుష్మా సాయి, ప్రశాంతి, రాజకుమార్ కెవికె విద్యార్థులు కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## గుదిబండగా ఎన్నికల హామీలు!

ఎన్నికల్లో వాగ్దానాలు చేయడం ఎంత సులువో..వాటిని అమలు చేయడం అంత కష్టం అని సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పుడిప్పుడే తెలిసొస్తోంది. రైతురుణమాఫీపై ఎంతగా విమర్శలు వస్తున్నాయో చెప్పలేం. దానిని సమర్థంగా తిప్పి కొట్టలేక పోతున్నారు. ఇకపోతే దుబారా ఖర్చులు తగ్గించుకుని అభివృద్దికి బాటలు వేయాలి. పేదల జోలికి వెళ్లకుండా చూసుకోవాలి. హైడ్రాను కేవలం ఉన్నతవర్గాల ఆక్రమణలకే పరిమితం చేయాలి. పేదలకు ప్రత్యామ్నాయం చూపి ముందుకు సాగాలి. అలాగే తొలుత అభివృద్ధి పనులకు పెద్దపీట వేయాలి. రుణాల జోలికి వెళ్లకుండా, ప్రజలపై భారం మోపకుండా, గుదిబండ గా ఉన్న పథకాలను ముందు పక్కన పెట్టే ప్రయత్నం చేయాలి. విద్యా, వైద్య రంగాల్లో చర్యలను ఆహ్వానించాల్సిందే. అయితే నేటికీ వైద్యరంగం వెక్కిరిస్తోంది. ప్రైవేట్ వైద్యానికే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. అందువల్ల క్షేత్రస్థాయిలో దీనిని ప్రథమంగా సంస్కరించాలి. ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలి. ఆస్పత్రులను బలోపేతం చేయాలి. ఇలా చేయడం వల్ల ఆరోగ్య రంగం బలోపేతం అవుతుంది. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లేలా చేయాలి.అప్పుడే ప్రభుత్వంపై భారం తగ్గగలదు. కానీ అలా చేసే దమ్ము కనిపించడం లేదు. అందులోనూ కాంగ్రెస్‌లో కుమ్ములాటలు, వర్గాలు ఎప్పుడూ మేల్కొని ఉంటాయి. నాయకుడిని సులువుగా పనిచేయ కుండా చేస్తారు. అలా కాకుండా నాయకత్వ లక్షణాలతో కాంగ్రెస్‌లో పులిలా నిలబడ్డది ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక్కరే. ఎంతో బలమైన నేతగా ఉన్న చెన్నారెడ్డిని సైతం అప్పట్లో ముప్పుతిప్పలు పెట్టారు. ఇప్పుడు రేవంత్ రెడ్డికి కూడా అలాంటి ముప్పే పొంచి ఉంది. ఆయన చుట్టూ ముళ్ల కంచెలే ఉన్నాయి. ఓ వైపు కేబినేట్‌లో ప్రతి ఒక్కరూ తమకుతాము సిఎంగా ఊహించుకుంటూ పోతున్నారు. అందుకే బలమైన నిర్ణయాలతోనే ప్రజల్లో నేతగా నిలబడే ప్రయత్నం చేయాలి. ధరణి,రేషన్ కార్డులు, ఇళ్లు వంటివన్నీ త్వరగా పూర్తి చేసే ప్రయత్నం చేయాలి.వాటిని అమలు చేసేందుకే సత్తా కావాలి. అందునా తెలంగాణలో ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దారుణం గా ఉంది. గత ప్రభుత్వం 14లక్షల కోట్లు అప్పుల్లో ఉంచిందని ప్రభుత్వమే ఆరోపిస్తోంది. ఈ క్రమంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన సిఎం రేవంత్ రెడ్డికి ఎన్నికల హామీలను అమలు చేయడం అంత సులభం కాదు. ఎందుకంటే ఖజానా నిండుకుని ఉంటే ఇది పెద్ద సమస్య అయ్యేది కాదు. కొన్ని గ్యారెంటీ లను అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందున్నది ముసళ్ల పండగే అని చెప్పుకోవాలి. ముళ్లకంచెల ను దాటాలి. ప్రధానంగా రైతులకు 2లక్షల రుణమాఫీ, రైతుబంధు పంపిణీని పూర్తి చేయాల్సిన కార్యక్రమాల్లో విమర్శలు రాకుండా చూడాలి.. ఈ హామీలను ప్రభుత్వంలోకి రాగానే నెరవేరుస్తామని మాట ఇచ్చారు. ఈ క్రమంలో రైతుబంధు ఎప్పుడు జమ చేస్తారో చెప్పాలని అప్పులు చేసిన నేతలు విమర్శిస్తున్నారు. పదేళ్ల దరిద్రపు వారసత్వాన్ని అందించిన బిఆర్‌ఎస్ ఇప్పుడు తమ హయాంలో ఉన్న సమస్యలపైనే నిలదీయడం సిగ్గుచేటు. స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లు, ఆస్పత్రులల్లో సమస్యలు ఈనాటివి కాదు. ఇవన్నీ మరని బిఆర్‌ఎస్ నేతలు అప్పుడే డిమాండ్లు మొదలు పెట్టారు. ప్రధానంగా రైతుబంధుతో పాటు ధాన్యం కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఇచ్చిన మాట ప్రకారం రైతుబంధు ఎప్పట్నుంచి ఇస్తారో అసలుసిసలు రైతులకు స్పష్టత ఇవ్వాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతుబంధును ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పారు. చిన్న,సన్నకారు రైతుల వివరాలను సేకరించి వారికే పట్టం కట్టాలి. అలాగే ఇలాంటి ఉదార పథకాలకు పాతర వేయాలి. రూపాయి కిలో బియ్యం పక్కన పెట్టాలి. హైడ్రా కారణంగా వస్తున్న విమర్శలను సమర్థంగా ఎదుర్కోవాలి. ఇదంతా ఒక ఎత్తయితే.. కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆర్థిక స్థితిని చక్కదిద్దుకుంటూనే.. పార్టీని సమన్వయం చేసుకుంటూ సాగాల్సిన అవసరం సిఎం రేవంత్ ముందుంది. ఎన్నికలకు ముందునుంచే అనేక సందర్భాల్లో ప్రభుత్వం వస్తే ఎలా చేస్తామో..ఎలా ముందుకు వెళతామో అన్న స్పష్టమైన విధానాలను రేవంత్ రెడ్డి ప్రకటించారు. బహుశా ఆయన మదిలో ఇవన్నీ అమలు చేయడమెలా అన్న ప్రణాళిక ఉండివుంటుంది. ప్రభుత్వపరంగా ఇవన్నీ చేయడం ఒక ఎత్తయితే పార్టీలో అందరినీ కూడగట్టుకుని పోవాల్సి ఉంటుంది. పదవుల మీద ఆశతో చాలామంది ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కొద్దిపాటి మెజారిటీ మాత్రమే లభించడంతో పాటు, పార్టీ కోసం శ్రమించిన వారు అనేకులు బయట ఉన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్లడం కత్తిమీద సాములాంటిది. కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ రెడ్డికి పూర్తి అండగా ఉన్నప్పటికీ శాసనసభ్యులను విశ్వాసంలోకి తీసుకుని కదలాల్సి ఉంటుంది. సుస్థిర, సమర్థ ప్రభుత్వాన్ని అందించడం ద్వారా ముందుకు సాగడం ప్రస్తుతం రేవంత్ రెడ్డికి కత్తి మీద సాము లాంటిదే. సొంత పార్టీ నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడం ఒక ఎత్తయితే..విపక్ష బీఆర్‌ఎస్ విసిరే సవాళ్లను కూడా పసిగట్టి ముందుకు సాగాల్సిన ఉంటుంది. గెలిచినా అధికారం కోల్పోయామన్న విపక్షంలో ఉన్న ఎమ్మెల్యేల బాధ మరో వైపు ఉన్న ప్రస్తుత తరుణంలో ఇప్పుడంతా ఎవరు ఎటువైపు దూకుతారన్న చర్చ తెలంగాణలో ప్రధాన అంశంగా ఉంది. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన పలువురు బిఆర్‌ఎస్‌లో చేరారు. వారంతా ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్యేలుగా గెలిచి విపక్షంలో ఉన్నారు. ఎందుకంటే పార్టీ మారడం ఎంత సులువో గతంలో బిఆర్‌ఎస్ దారిచూపింది. అందుకే కాంగ్రెస్ ముందు జాగ్రత్తగా కొందరు ఎమ్మెల్యేలను చేర్చుకునే ప్రయత్నాలు చేసింది. అయితే మిగతా వారు అంతా కట్టగట్టుకుని వస్తారని భావించారు. కానీ అలాంటి అవకాశం లేకుండా బిఆర్‌ఎస్ జాగ్రత్తలు తీసుకుంది. ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసింది. కాంగ్రెస్ పార్టీలో అధిష్ఠానం మాటే శిరోధార్యం. అటు వారిని మెప్పించాలి. అధిష్టానానికి అందే ఫిర్యాదులకు సమాధానం ఇవ్వాలి. అలాగే ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఇవన్నీ కనిపెట్టుకుని రేవంత్ రెడ్డి ముందుకు సాగాలి. అప్పుడే సమర్థుడైన నేతగా సాగుతారు. ప్రజాదర్బార్ నిర్వహించడం, విద్యుత్ శాఖ పనితీరును సమీక్షించడం, చకచకా నిర్ణయాలు తీసుకోవడం వంటి చర్యల ద్వారా రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డికి తన పదవిని సుస్థిరం చేసుకోవడంతో పాటు హామీలు అమలు చేయడం ద్వారా ఎదురులేని నేతగా ఎదగడానికి కృషి చేయాలి. తక్కువ సమయంలో ఇచ్చిన హామీలను చకచకా అమలు చేయగలగాలి. తానేమిటో నిరూపించుకుని ప్రజలతో మంచి అనిపించుకోవాలి. కేసీఆర్‌ను మించిన నేతగా పేరు తెచ్చుకుంటేనే రాజకీయంగా రేవంత్ నిలదొక్కు కోగలడు. అందుకే కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూనే.. తాను మరింత బలపడాల్సిన పరిస్థితి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉంది.

# కుల గణన కాదు.. ప్రజలను ఏకం చేయాలి



### దేశమంతా ఒక్కటే అన్న భావన రావాలి

### ఉమ్మడి పౌరస్మృతితోనే అది సాధ్యం

న్యూఢిల్లీ : కులాల కుంపట్లు రగిలించడమే లక్ష్యంగా రాజకీయాలు నడుస్తున్నాయి. బిసి కులగణనే ఇందుకు నిదర్శనం.దేశంలో పౌరులంతా ఒక్కటే అన్న భావన రాకుండా రాజకీయ పార్టీలు చాలా తెలివిగా తమ చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ప్రజల్లో కులమతాలు, వర్గ విభేదాలు లేకుండా అంతా భారతీయులమే అన్న భావన లేకుండా చేస్తున్న వారిలో విపక్షాలు ముందు వరసలో నిలుచున్నాయి. అందుకే వారు తమ ఓటు బ్యాంక్ రాజకీయాలను ప్రయోగిస్తున్నారు. ప్రజలు ఎప్పటికీ ఒక్కటి కాకుండా చూసుకోవడం వాటి లక్ష్యంగా కనిపిస్తోంది. ఉమ్మడి పౌరస్మృతి విషయంలో రాజకీయపార్టీలు అనుసరిస్తున్న తీరు దేశద్రోహ చర్యగానే భావించాలి. ఎందుకంటే ఏ దేశంలో అయినా ప్రజలందరికీ ఒకేరకమైన హక్కులు ఉంటాయి. ఒకే రకమైన చట్టాలు ఉంటాయి. కానీ ఏం దౌర్భాగ్యమో భారత్‌లో మాత్రమే ఇలా వేర్వేరుగా చట్టాలు ఉంటాయి. ఉండాలని కమ్యూనిస్ట, కాంగ్రెస్ పార్టీలు కోరుకుంటున్నాయి కూడా. చట్టాలు ఒకేరకంగా ఉండడానికి వీలులేదన్న కుత్సిత భావనలో రాజకీయపార్టీల నేతలు ఆలోచిస్తున్నారు. ఈ విషయంలో కమ్యూనిస్టులంత గోడవాటం గాళ్లు ..దేశంలో మరొకరు ఉండరు. చైనా, రష్యా, క్యూబా గురించి మాట్లాడుతున్న ఎర్ర జెండా వాళ్లకు భారత్‌లో మాత్రం ప్రజలందరి రక్తం ఒక్కటే అన్న సోయి ఉండదు.ఎవరి రక్తం వారిదే అన్న వాదన లో ఉంటారు. ఉపన్యాసాలు ఇచ్చే సమయంలో మాత్రం మనమంతా ఒక్కటే.. మనందరిలోని రక్తమంతా ఒక్కటే అంటారు. కులమతాల అడ్డుగోడలు తొలగాలనేది వారే.. కులమాతాలకు అనుగుణంగా చట్టాలు ఉండాల్సింది అని పట్టుబడేది వారే.ఇలా అయితే దేశం మరో వందేళ్లయినా అభివృద్ధి చెందదని గుర్తించాలి. కమ్యూనిస్టులు.. వారిని అనుసరిస్తున్న వారు తమ ఆలోచనా ధోరణి బూజుపట్టిందన విషయం తెలుసుకోవడం లేదు. ఉమ్మడి పౌరస్మృతి విషయంలో వారు ఆడుతున్ననాటకాలు దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి తప్ప మరోటి కాదు. మతపరమైన ఆచారాలు, సంప్రదాయాలకు అతీతంగా దేశంలోని పౌరులందరికీ ఒకే చట్టం వర్తించాలన్నది బిల్లు లక్ష్యం. నిజానికి మతాచారాలు ఎవరికి వారు నిర్వహించుకోవచ్చు. మర్డర్లు, రేపులు, దొంగతనాలు, పెళ్లిల్లు చేసుకునే సమయంలో చట్టం అందిరికీ ఒకేలా ఉండాలి. అంటే.. పెండ్లిళ్లు, విడాకులు, వారసత్వం, దత్తత, జీవన భృతి అంటే..భరణం, మనోవర్తి, ఇతరత్రా మొదలైన అన్ని అంశాల్లో కుల, మత, వర్గాలకు అతీతంగా పౌరులందరికీ ఒకే చట్టం ఉండాలన్న విశాల దృక్పథాన్ని విపక్షాలు అడ్డుకుంటున్నాయని గుర్తించాలి. నిజానికి దేశంలో ఇప్పటి వరకు మతపరమైన చట్టాలే ఉన్నాయి. హిందూ వివాహ, వారసత్వ చట్టాలు, షరియా లాంటి ముస్లిం పర్సనల్ చట్టాలు అమలవుతున్నాయి. వీటివల్ల ఎన్ని గందరగోళాలు వస్తున్నాయో చూస్తూనే ఉన్నాం. అందరిదీ ఒకే రక్తం అంటున్న వారు అందరికీ ఒకే రకమైన న్యాయం,చట్టం ఉండాలన్న సోయిని మరచి వ్యవహరిస్తున్నారు. మన దేశం ఒక లౌకిక రాజ్యంగా ఉండాలని, సర్వమత సమానత్వాన్ని పాటించాలని, అన్ని భాషలను గుర్తించి గౌరవించాలని రాజ్యాంగంలో అనేక అంశాలను చేర్చారు. కానీ ఇన్నేళ్లయినా కుల మతాల కారణంగా ప్రజలందరూ భయం భయంగా బతికే వాతావరణం దేశంలో చూస్తున్నాం. కులమతాలు వారి ఆచార వ్యవహారాలు ఇంటికే పరిమితం కావాలి. చట్టం ముందు అంతా ఒక్కటే అన్న భావనరావాలి. అంటే ఉమ్మడి పౌరస్మృతి ద్వారానే ఇది సాధ్యం అవుతుంది. భారత దేశ సమగ్రతను, సమ భావాన్ని గౌరవించే వాళ్ళందరూ ఏకోన్ముఖంగా పౌరస్మృతిని కోరాల్సిందే. నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత భారత దేశాన్ని ఐక్యంగా ఉంచాలని చేస్తున్నప్రయత్నాలకు అడుగడున్నా అడ్డుకుంటున్నారు. రాజ్యాంగానికి ప్రమాదం వచ్చిందని గగ్గోలు పెడుతున్నారు. వీరి మాటలు పట్టించుకుని ఉంటే కాశ్మీర్‌లో 370 రద్దయ్యేది కాదు. ఎందుకంటే వారికి ఓట్లు తప్ప దేశం గురించి పట్టదు. దేశాన్ని ఎందుకు విడదీశారో..మతప్రాతిపదిక ఎందుకు ఆ పనిచేశారో చర్చ చేయరు. భారత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా అమలు కావాలంటే ఏకభావన రావాలి. సమాన హక్కులు ఉండాలి. ప్రజలంతా ఒక్కటే అన్న భావన పాదుకొల్పాలి. ఇంకా పేదలను పేదలుగా, మైనార్టీలను ఇంకోరకంగా చూసే సంస్మృతి పోవాలి. దానిని వదిలి కులగణన చేయాలన్న తీరు సరికాదాఉ. ప్రతి ఒక్కరూ మనమంతా ఒక్కటే అన్న భావన కోసం చేసే ఎలాంటి ప్రయత్నాన్ని అయినా స్వాగతించాల్సిందే. ప్రజా వ్యతిరేక చర్యలను రెచ్చగొడుతూ.. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య మతాల పేర్లతో వైషమ్యాలను సృష్టిస్తూ భౌతికంగా దాడులు చేసుకునే వాతావరణాన్ని దూరం చేయాలి. అనేక భాషల ప్రజలు, అనేక మత విశ్వాసాలతో ఉన్నవారంతా కలసి మెలసి ఒకే రాజ్యంలో సహజీవనం చేసే సత్ సాంప్రదాయం భారత ప్రజల మధ్య ఉన్నది. అది ఇక నిరంతరంగా సాగాలి. జాతీయోద్యమంలో చీలిక తెచ్చేందుకు బ్రిటిష్ పాలకులు విభజించి పాలించు సూత్రంలో భాగంగా భారతీయ ప్రజల మధ్య హిందూ, ముస్లిం మతాల పేరుతో ప్రజల్ని విభజించే కార్యక్రమం చేసింది. రాజకీయ నాయకుల పుణ్యమా అని నేటికీ అదే కొనసాగు తోంది. అది పోవాలంటే ప్రజలంతా ఒక్కటే అన్న భావన రావాలి. ప్రజల్లో చట్టాల పట్ల గౌరవం ఉండాలి. నీకో చట్టం..నాకో చట్టం అన్న భావన ఉండరాదు. ప్రజల మధ్య ఐక్యత, దేశ సమగ్రత కాపాడుకోవడానికై అన్ని మతాలను సమభావనతో చూసేలా చట్టాలు ఉండాలి. మతాల ఆధారంగా చట్టాలు ఉండరాదు. ప్రజల ఆధారంగా చట్టాలు ఉండాలి. రాజకీయ పార్టీలు కళ్లు తెరవకుంటే నష్టపోయేది ప్రజలే. ప్రజలు ఈ విషయం లో రాజకీయ పార్టీలను నిలదీయాలి.

# గ్రామాల పరిశుభ్రతకు పెద్దపీట

### తడిపొడి చెత్తను వేరు చేయండి

నిజామాబాద్ : స్వచ్ఛసర్వేక్షణ కోసం ఇంటింటికి తడి, పొడి చెత్తను విడివిడిగా ప్రతి రోజు సేకరించాలని ఇందుకు మండల పరిషత్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అధికారులు సూచించారు. ప్రతి గ్రామంలో స్మృతి వనం ఏర్పాటు చేయాలని, డంపింగ్ యార్డు, శ్మశాన వాటికలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. అటవీ సమీప గ్రామాల్లో మంకీ ఫుడ్ కోర్ట్ కోసం మొక్కలు నాటి సంరక్షించాలనిఅన్నారు. గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాన్ని మెరుగు పరిచే దిశగా ఎంపీడీవోలు, విద్యుత్ ఏఈలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమాల తనిఖీకి విజిలెన్స్ బృందాలు రానున్నాయని, తనిఖీ బృందాలకు ఎలాంటి లోటు పాట్లు కనపడకుండా ప్రతిపాదించిన అన్ని పనులు పూర్తి చేయాలని అన్నారు. అందమైన ఆదిలాబాద్ జిల్లాగా మార్పునకు అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ దివ్యదేవరాజన్ అన్నారు. గ్రామాల్లో మిగిలి ఉన్న పనులు సరిదిద్దుకోవాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీకి జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించడం జరుగుతుందని, స్థానిక పన్నుల వసూళ్లు, ఇతరాత్ర నిధులతో పనులు చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేయాలని, వచ్చే సంవత్సరానికి నర్సరీల్లో పెంచాల్సిన మొక్కలు, కావాల్సిన వాటిని ప్రణాళికలతో సమకూర్చుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ నిధుల నుంచి నర్సరీలకు పెన్సింగ్ ఏర్పాటు, వాటరింగ్ కోసం వ్యక్తులను నియమించుకోవాలని సూచించారు.

ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలి

# భారత దౌత్యవేత్తలపై ఆంక్షలు విధించాలి

### కెనడా సిక్కు నేత, ఖలిస్తాన్ అనుకూల వాది జగ్మీత్ సింగ్ 1


న్యూఢిల్లీ,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)పై నిషేధం విధించాలని కెనడా సిక్కు నేత, ఖలిస్తాన్ అనుకూల వాది జగ్మీత్ సింగ్ డిమాండ్ చేశారు. భారత దౌత్యవేత్తలపై కూడా ఆంక్షలు విధించాలని మంగళవారం ఒట్టావాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భారత్‌కు చెందిన హింసాత్మక, తీవ్రవాద, ఉగ్రవాద సంస్థ అని, అది కెనడాతో పాటు ఇతర దేశాలలో కూడా కార్యకలాపాలు నిర్వహిస్తుందని, ఆ సంస్థపై నిషేధం విధించాలని అన్నారు. భారత ప్రభుత్వం, ముఖ్యంగా మోడీ ప్రభుత్వం కెనడాలో దౌత్యవేత్తల ద్వారా క్రిమినల్ చర్యలకు పాల్పడుతోందని అన్నారు. కెనడియన్ నివాసాలపై, వ్యాపారాలపై కాల్పులు జరపడం, కెనడియన్లను చంపడం వంటి నేరపూరిత చర్యలు చేపడుతోందని, ఇది చాలా తీవ్రమైన అంశమని అన్నారు. కెనడియన్ల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్త చేస్తూ%ఀ% తమ దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. తాను దేశాన్ని ప్రేమిస్తున్నానని, తమ దేశ ప్రజాస్వామ్యం, ప్రజలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. భారత్‌పై ఒత్తిడి పెంచేందుకు అమెరికా, బ్రిటన్ అన్ని మిత్రదేశాల సాయం తీసుకోవాలని అన్నారు. కెనడియన్‌లను రక్షించడానికి తీసుకోవాల్సిన ఇతర చర్యలను చర్చించేందుకు పబ్లిక్ సెక్యూరిటీ కమిటీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించాలని అభ్యర్థించారు.

# తిరుమలలో ఎడతెరిపి లేని వర్షం

తిరుమల : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. వాయవ్య దిశగా గంటకు 10 కిలో మీటర్ల వేగంతో కదులుతున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. గురువారం తెల్లవారు జామున చెన్నై, నెల్లూరు మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో దక్షిణి కోస్తా, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని తీర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. శ్రీకాళహస్తి %-% తడ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ఎగువ ప్రాంతాల వరదతో స్వర్ణముఖి నదిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. తిరుమల కనుమ రహదారుల్లో టీటీడీ అప్రమత్తమైంది. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శ్రీవారి పాదాలు, ఆకాశగంగకు భక్తులు వెళ్లకుండా నిలిపివేశారు. వర్షాల కారణంగా తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు టీటీడీ ప్రకటించింది. బుధవారం ఉదయం తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. స్వల్పంగా రోడ్డుపైకి బండరాళ్లు వచ్చిపడ్డాయి. జేసీబీల ద్వారా బండరాళ్లను సిబ్బంది తొలగించారు. ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా టీటీ ముందస్తు చర్యలు చేపట్టింది. మరోవైపు ఏపీలోని ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయి. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. జలదంకిలో అత్యధికంగా 40 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కావలిలో 33.9 సెంటీమీటర్లు, ఇందుకూరు పేటలో 23 సెంటీ మీటర్లు, గుడ్లూరులో 20.5 సెంటీ మీటర్లు వర్షపాతం నమోదైంది. వరికుంటపాడు మండలం కనియంపాడులో పిల్లపేరువాగు ఉద్ధృతి పెరిగింది. కొండాపురం మండలం సత్యవోలు అగ్రహారం వద్ద మిడతవాగులో వరద ఉధృతి పెరుగుతోంది.

# తిరుమలలో నేడు పున్నమి గరుడ సేవ

తిరుమల : తిరుమలలో ఇటీవల శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం అక్టోబర్17న పౌర్ణమి సందర్భంగా నెలవారీ గరుడసేవ జరగనుంది. ప్రతినెలా పౌర్ణమి పర్వదినాన టీటీడీ గరుడ సేవ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి గరుడ వాహనంపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇక, దసరా పండగ సెలవులు ముగిసినప్పటికీ తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి దర్శనానికి కంపార్టుమెంట్లనీ నిండి వెలుపల క్యూలైన్లలో భక్తులు వేచిఉన్నారు. దీంతో టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు శ్రీవారి దర్శనానికి 6 గంటల సమయం పడుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో స్వామివారి దర్శనం లభిస్తున్నది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్న భక్తులకు 5 గంటల సమయం పడుతుంది.ఇక సోమవారం అర్ధరాత్రి వరకు 75,361 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,850 మంది భక్తులు తలనీలాలు సర్పించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.61 కోట్ల ఆదాయం సమకూరినట్టుగా టీటీడీ వెల్లడించింది. కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు ప్రపంచ వ్యాప్తంగా భక్తులు తరలివస్తుంటారు. నిత్యం వేలాది మంది భక్తులు తిరుమల చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. శ్రీవారిని దర్శించుకుంటే సకల పాపాలు హరించిపోతాయని భక్తుల నమ్మకం.



ఆధ్యాత్మికం

# నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**- వారం రోజులల్లో పెండింగ్ పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేసి బిల్లులు సమర్పించాలి**

**- అంగన్ వాడి మరమ్మత్తు పనులలో వేగం పెంచాలి**

**- సబ్ సెంటర్ల టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి**

**- గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**






**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పై స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీతో కలిసి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన పనులు చివరి దశకు చేరు కున్నాయని, పెండింగ్ ఉన్న చిన్న చిన్న పనులను వారం రోజుల వ్యవధిలో పూర్తి చేసి సంబంధిత బిల్లులు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తు , టాయిలెట్ల నిర్మాణానికి మంజూరు చేసిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్ విభాగం ద్వారా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్ల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.ధర్మారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించామని, వీటిని నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. అదేవిధంగా టెండర్ దశలో ఉన్న 18 సబ్ సెంటర్ల పనులు త్వరగా ప్రారంభించే దిశగా టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని , మంజూరు చేసిన పనులను త్వరగా గ్రౌండ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి జి రవీందర్, ఈఈ పంచాయతీ రాజ్ గిరీష్ బాబు, సంబంధిత అధికారులు, ఏ. ఈ .లు, తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో రైస్ డెలివరీ ప్రక్రియ పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ శ్యామ్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వం విధించిన గడువు లోగా సకాలంలో ఖరీఫ్ 2023-24 , రబీ 2023-24 సీజన్ లకు సంబంధించి పెండింగ రైస్ డెలివరీని తప్పని సరిగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ మిల్లర్లను ఆదేశించారు.బుధవారం అదనపు కలెక్టర్ శ్యామ్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో జిల్లాలోని రైస్ మిల్లర్లు, సంభందిత అధికారులతో పెండింగ్ లో ఉన్న రైస్ డెలివరీపై సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ 2023-24, రబీ సీజన్ 2023-24 కు సంబంధించి బాకీ ఉన్న రైస్ డెలివరీ నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలని అన్నారు.జిల్లాలో ఉన్న రా రైస్ మిల్లులు వారికి కేటాయించిన ధాన్యాన్ని ప్రాసెస్ చేసి ప్రతి రోజు వాటి సామర్థ్యం మేరకు అత్యధిక ఏసికే లు డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. రైస్ డెలివరీ ఆలస్యం చేస్తున్న రైస్ మిల్లులను అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని, రైస్ మిల్లులు పూర్తి స్థాయిలో నడుస్తూ నిర్దేశించిన గడువు లోగా రైస్ డెలివరీ పూర్తి చేయాలని పేర్కొన్నారు. రైస్ డెలివరీ గడువు పెంపు ఉండదని, నిర్దేశిత సమయంలోగా మిల్లుల వారీగా తమకు కేటాయించిన లక్ష్యం పూర్తి చేయాలని అన్నారు. బాకీ ఉన్న రైస్ మిల్లర్లు సకాలంలో మిల్లింగ్ చేసి రైస్ అప్పగించకపోతే మిల్లర్ల పై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ డే

**- లక్ష్యంతో చదివితే విజయం వరిస్తుంది**

**- అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్లో బుధవారం ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సహా కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్ హాజరై విద్యార్థులను వారి భవిష్యత్తు గురించి వివరించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు ఎంబీఏ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ వైపు అడిగేయడం శు భసూచికమని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలను ఎంచుకోవడం ఒక తెలివైన నిర్ణయమని, తమ యొక్క కళాశాలలో 100% అడ్మిషన్స్ పూర్తి చేసుకోవడం జరిగిందని, తమ యొక్క కళాశాల ప్రతిష్టాత్మకమైన నాట్ అక్రిడేషన్ పొందడం జరిగిందని అన్నారు. రానున్న కాలంలో అటానమస్ కాలేజ్ దిశగా ప్రయత్నిస్తున్నామని, తమ యొక్క కళాశాల ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించడం కొరకు వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ స్థాపించి గత 40 సంవత్సరాలుగా మారుమూల ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు సేవలందిస్తూ ఎందరో మంది విద్యార్థుల జీవితాలను స్థిర పడే విధంగా చేస్తున్నారని అన్నారు.ఎంబీఏ మొదటి సంవత్సరం జాయిన్ అయిన విద్యార్థులు మొదటి రోజు నుండే ఒక లక్ష్యం ఏర్పరచుకొని ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను నేర్చుకుంటూ క్రమశిక్షణతో చదివి ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా ముందుకు వెళ్లాలని విద్యార్థులు ప్రస్తుత ఇండస్ట్రీకి అవసరమయ్యే జ్ఞానాన్ని పొంది దాన్ని ఆచరించే విధంగా ముందుకు వెళ్లాలని ఇప్పుడున్న తరుణంలో ఉద్యోగ అవకాశాలు పొందడం అనేది సులువుగా పొందవచ్చని తమ యొక్క కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి కార్యాచరణలో విద్యార్థులను తీర్చిదిద్దడం కొరకు అన్ని వసతులు కల్పిస్తూ తమ యొక్క కళాశాల లో 15 సంవత్సరాల పైగా అనుభవం కలిగిన అధ్యాపకులచే విద్యార్థులకు బోధన అందిస్తూ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా కార్యక్రమాల రూపొందిస్తూ ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించే విధంగా సెమినార్స్, ఇండస్ట్రియల్ విజిట్స్, క్యాంపస్ ప్లేస్మెంట్స్ కాన్ఫెన్సెస్ ఇలాంటివి విద్యార్థులు అందిస్తామని అన్నారు తమ యొక్క కళాశాల పై నమ్మకం ఉంచి ఈ యొక్క కళాశాలలో సీట్ పొందున విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేషన్, విభాగ అధిపతి డాక్టర్ ఆరిఫ్ , సీనియర్ ఉపాధ్యాయులు డాక్టర్ కౌశల్య , రామ్మోహన్ మరియు ఆధ్యాపకులు రమేష్, శ్రీలత, సాయి శ్రావణి, సన విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ సర్పంచ్ జన్మదిన వేడుకలు

**- పేదలకు అన్నదానం చేసిన పొనగంటి మల్లయ్య**



**జమ్మికుంట అక్టోబర్ 16 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మాజీ సర్పంచ్, కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జన్మదినానికి పురస్కరించుకొని ఆయన అనుచరులు జమ్మికుంట పట్టణంలోని బొమ్మల గుడి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి,అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ప్రజలకు సేవ చేస్తూ అనేక పదవులను ఆరాధించిన పొనగంటి మల్లయ్య మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మల్లయ్య కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు బోగోని వీరన్న, దిండి రాము, పొనగంటి సారంగం, కాంగ్రెస్ నాయకులు, పొనగంటి సురేష్ (జెమిని) దేశీని సదానందం, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

## విధులలో చేరిన విద్యుత్ ఉద్యోగులు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** రామగిరి, కమాన్ పూర్ మండలంలో బుధవారం పలువురు ఎన్.పి.డి.సీ.ఎల్ విద్యుత్ ఉద్యోగులు విధులలో చేరారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో భాగంగా వీరందరూ బదిలీపై వచ్చారు. బేగంపేట సెక్షన్ పరిధిలో సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ (రామగిరి), లైన్ ఇన్స్పెక్టర్ లు ఏ.నాగరాజు (ముస్త్యాల), జి నవీన్ కుమార్ (బేగంపేట్), లైన్ మెన్ లు బి.శివకుమార్ (రామగిరి), సిహెచ్ రాజేందర్ (ముస్త్యాల), ఏ శ్రీనివాస్ (కల్వచర్ల), వి.రమేష్ (బేగంపేట), అసిస్టెంట్ లైన్ మెన్ లు ఏం.నాగరాజు (సుందిల్ల), జే.రాజేష్ ( ముస్త్యాల) లు రత్నాపూర్ సబ్ స్టేషన్ లో సబ్ ఇంజినీర్ కమ్మరికుంట సతీష్‌ను కలిసి విధులలో చేరారు.కమాన్ పూర్ సెక్షన్ పరిధిలో అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్.అశోక, సబ్ ఇంజనీర్ బీ.శ్రవణ్ కుమార్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ వి.అశోక్, లైన్ ఇన్స్పెక్టర్ ఓ.సత్యనారాయణ రావు, లైన్ మెన్ లు కలవేన. ఓదేలు (టౌన్) , బి.నాగరాజు (జులపల్లి), ఎల్.ఏం. ఓ లు పి.రఘుపతి రెడ్డి, జే.శ్రీధర్ బాబు, అడిషనల్ లైన్ మెన్ ఏం.శ్రీనివాస్ (టౌన్), సి జూనియర్ లైన్ మెన్ పి.వెంకట స్వామి (పెంచికల్ పేట)లు విధులలో చేరారు.

## అబ్దుల్ కలాం జయంతి వేడుకలు...





**కరీంనగర్ టౌన్,అక్టోబర్16(ది క్రైమ్ న్యూస్):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందుర్తి లో ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలలో భాగంగా విద్యార్థులు తయారుచేసిన కొన్ని ప్రయోగాలను ప్రదర్శించడం జరిగినది. అబ్దుల్ కలాం యొక్క జీవిత చరిత్రను, ఒక శాసనవేత్తగా ఎలా ఎదిగాడు ,అలాగే భారతదేశానికి చేసిన సేవలను ప్రధానోపాధ్యాయురాలు జయప్రద కొనియాడారు. పాఠశాలలోని సైన్స్ గదిని ప్రధానోపాధ్యాయురాలు ప్రారంభించడం జరిగినది. తదుపరి చిరుమామిడి మండల ఎస్సై బి రాజేష్ సైబర్ క్రైమ్, గంజాయి పైన విద్యార్థులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగినది. సమాజంలో ఎలా ఉండాలి, ఎలా ఎదగాలి, ఏ విధంగా అభివృద్ధి చెందాలి వివరించడం జరిగినది. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తిరుపతి, మంజుల, ప్రతాపరెడ్డి, ఓదెలు కుమార్, చారి, వేణు, పవన్ కుమార్, రఘుపతి రెడ్డి, సవిత శ్రీదేవి, మాధవి, నిహారిక లు పాల్గొనడం జరిగినది.

# బ్రాహ్మణపల్లిలో త్రాగునీటి పైప్ లైన్‌లో లీకేజీలు

**- కలుషితమవుతున్న త్రాగునీరు**

**- బురదమయంగా మారుతున్న రోడ్లు**



**వీణవంక అక్టోబర్ 16 (ది క్రైమ్ న్యూస్):** వీణవంక మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో వాడవాడనా త్రాగునీటి పైపులైన లీకేజీలతో పలుచోట్ల రోడ్లు బురదయంగా మారి, నీటి కాలువలు తలపిస్తున్నాయి. గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా, వాడవాడనా పైప్ లైన్ల లీకేజీలు వల్ల, నీరు నిల్వ ఉండడం వల్ల ఈగలు, దోమలు త్వరగా అభివృద్ధి చెంది, రోగాలకు కారణమవుతున్నాయని, అంతేకాక ఆగి ఉన్న మురికి నీరు పైప్ లైన్ లోకి చేరి, త్రాగునీరు కలుషితమవుతుందని , ఒక వైపు తెలంగాణ ప్రభుత్వం గ్రామ గ్రామాన ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛమైన నీటిని, ప్రతి ఇంటికి అందించాలని ఉద్దేశంతో మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టిన, బ్రాహ్మణపల్లి జిపి అధికారుల నిర్లక్ష్యంతో, కలుషితమైన త్రాగునీటిని త్రాగాల్సి వస్తుందని, గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం వస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా, మండల మిషన్ భగీరథ అధికారులు, నీటి సరఫరాధికారులు మేల్కొని, సత్వరమే పైప్ లైన్లను ఆధునికరించాలని, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## గోదాల శ్రీనివాస్ రెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే విజయరమణ రావు





**పెద్దపల్లి, అక్టోబర్ 16 ( ది క్రైమ్ న్యూస్ ):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎలిగేడు మాజీ కే.డి.సి సింగిల్ విండో చైర్మన్, గోదాల శ్రీనివాస్ మంగళవారం రోజున రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారి మరణ వార్త తెలుసుకొని స్థానిక ఎమ్మెల్యే బుధవారం రోజున ఎలిగేడు మండలం,బురహన్మియపేట గ్రామంలోని వారి నివాసానికి చేరుకొని స్వర్గీయ గోదాల శ్రీనివాస్ రెడ్డి భౌతిక కాయానికి పూల మాల వేసి నివాళులు అర్పించి అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపి తదుపరి వారి అంతిమ యాత్రలో పాల్గొని వారి పాడెను మోశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కంపెని మైన్స్ రెస్క్యూ పోటీలు ప్రారంభం








**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** రామగుండం రెండవ డివిజన్ మైన్స్ రెస్క్యూ స్టేషన్ లో బుధవారం సింగరేణి 53వ కంపెనీ స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీలు ప్రారంభమయ్యాయి. బుధవారం, గురువారం రెండు రోజులపాటు జరిగే పోటీలకు మొదటి రోజు సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ ప్రాజెక్ట్స్ (పా) జి.వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన వహించగా, ముఖ్య అతిథి, చీఫ్ జెడ్జ్ గా ఉమేష్ ఏం. సావర్కర్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ రీజియన్-1 సౌత్ సెంట్రల్ జోన్, హైదరాబాద్ హాజరయ్యారు. వారు ముందుగా మైన్స్ రెస్క్యూ జండా ను ఆవిష్కరించి, రెస్క్యూ సభ్యులచే గౌరవ వందనాన్ని స్వీకరించి, డ్రా తీసి, పోటీలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం చీఫ్ జడ్జ్ డిఎంఎస్ సావర్కర్ మాట్లాడుతూ.. పోటీల ను పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన సభ్యులను ఎంపిక చేసి త్వరలో ధన్ బాద్ పట్టణంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని, ఎలాంటి ఒత్తిడికి లోనూ కాకుండా టిమ్ సభ్యులు తమ యొక్క ప్రతిభను కనబరచాలని కోరారు. ఇక ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డిఎంఎస్ హెచ్ఆర్.2, ఎన్. నాగేశ్వర్.రావు, ఏడిఏంఎస్ (ఓహెచ్) డా. జార్జ్ జాన్, డీడీఏంఎస్ హెచ్ఆర్.3 జ్ఞానేశ్వర్, డీడీఏంఎస్ హెచ్ఆర్.2 బానోతు వెంకన్న, డీడీఏంఎస్ నెల్లూర్ కే. అప్పలనాయుడు, డీడీఏంఎస్ మెకానికల్ దిలీప్ కుమార్, డీడీఏంఎస్ ఎలక్ట్రికల్ రాజీవ్ వర్మ, శ్రీ సనత్ కుమార్ పి. డీడీఏంఎస్ హెచ్ఆర్.1 పి. సనత్ కుమార్, డీడీఏంఎస్ హెచ్ఆర్.1 కమలేష్ కుమార్ వర్మ, డీడీఏంఎస్ హెచ్ఆర్.2 ప్రేమ్ కుమార్, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. ఇంకా ఈ ప్రారంభం కార్యక్రమంలో చింతల శ్రీనివాస్ జిఎం సేఫ్టీ కార్పోరేట్, రామగుండం రెండవ ఏరియా జనరల్ మేనేజర్ ఎల్.వి. సూర్యనారాయణ, కె.శ్రీనివాస్ రెడ్డి జిఎం రెస్క్యూ, లలిత్ కుమార్ జీఎం రామగుండం ఏరియా.1, వెంకటేశ్వర్లు జీఎం ఏఎల్పీ, కెహెచ్ఎన్ గుప్తా జిఎం సేఫ్టీ రామగుండం రీజియన్, జీఎం ఎక్స్ప్లోసివ్స్ డి.బైద్య, కార్మిక నాయకులు వైవి. రావు, ధర్మపురి, జి. రవీందర్, కె. రాజరత్నం, కే. సత్యనారాయణ రెడ్డి, వాసంశెట్టి మార్కండేయ, ఎస్ఓ టు జిఎం ఎస్. సంతోష్ కుమార్, డిజిఎం పర్సనల్ అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవ రావ్, మెడికల్ ఆఫీసర్ మహిపాల్, ఇతర ముఖ్య అధికారులు, రెస్క్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## - ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న7500 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్స్ విడుదల చేయాలని ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్స్ విడుదల చేయని కారణంగా దాదాపు 7,500 కోట్లకు పైగా పెండింగ్ లో ఉన్నాయని, నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావొస్తున్న పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారారని మండిపడ్డారు. పేద విద్యార్థులకు సంజీవని వంటి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ పథకానికి తూట్లు పొడుస్తూ విద్యార్థుల హక్కు అయినటువంటి రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను విడుదల చేయకపోవడం అనేది పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తుందని అన్నారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తిచేసిన వేలమంది విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ రాని కారణంగా యాజమాన్యాలు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లిస్తే కానీ సర్టిఫికెట్స్ ఇవ్వమంటూ. విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని, ఒకవైపు రియంబర్స్మెంటు బకాయిలు చెల్లిస్తే తప్ప మేము కళాశాలలో నడపలేని స్థితిలో ఉన్నామని ప్రైవేటు యాజమాన్యాలు మొర పెట్టుకుంటున్నారని, ఫీజు రియంబర్స్మెంట్ పైన ఆధారపడి నడిపిస్తున్న కళాశాలలు వందల సంఖ్యలో ఉన్నాయని, మధ్యలోనే కళాశాల యాజమాన్యాలు చేతులెత్తే పరిస్థితి కనిపిస్తుందని, ఇటు యాజమాన్యానికి అటు ప్రభుత్వానికి మధ్యలో బలవుతున్నది విద్యార్థులే. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి అయిన తర్వాత కూడా సర్టిఫికెట్స్ రాక ఒకవైపు ఉన్నత విద్యకు మరొకవైపు ఉద్యోగ అవకాశాలు వచ్చినా కూడా సర్టిఫికెట్స్ లేని కారణంగా విద్యార్థుల జీవితాలు అంధకారంలోకి నెట్టి వేయబడుతున్నాయని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్న విద్య వ్యవస్థ తీరు మారడం లేదని విద్యార్థుల జీవితాలు బాగుపడటం లేదని, ఉన్న విద్యాలయాలను విద్యావ్యవస్థను పటిష్ఠ పర్చాల్సిన ప్రభుత్వమే విద్యను అంధకారంలోకి నెట్టి వేస్తూ నూతనంగా ఇంటర్నేషనల్ స్కూల్స్ అంటూ యూనివర్సిటీలు అంటూ కొత్త హామీలతో చేతులు దులుపుకుంటుంది తప్ప ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వానికి విద్యారంగం పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ లోనే అవగతం అవుతుంది. సంవత్సరాల తరబడి అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్న, అనేక కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదు. ప్రభుత్వం ఇచ్చేటటువంటి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విద్యార్థుల యొక్క హక్కు అని జ్ఞప్తికి తెచ్చుకొని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందని అన్నారు. లేనియెడల విద్యార్థులందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఏబీవీపీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తుందని అన్నారు.

# తీన్మార్ తల్వార్ టివి యూట్యూబ్ ఛానల్ పై సుమోటోగా కేసు నమోదు చేయాలి




**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** తొర్రూర్ మున్నూరు కాపు పట్టణ అధ్యక్షుడు కొమ్ము దేవేందర్ తీన్మార్ తల్వార్ టీవీ యూట్యూబ్ చానెల్ పై సుమోటో గా కేసు నమోదు చేయాలని తొర్రూరు మున్నూరు కాపు పట్టణ అధ్యక్షుడు కొమ్ము దేవేందర్ బుధవారం తొర్రూర్ ఎస్సై ఉపేందర్ కు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మున్నూరుకాపులు ఈ సందర్భంగా కొమ్ము దేవేందర్ మాట్లాడుతూ మున్నూరుకాపుల అస్థిత్వంపై తీన్మార్ తల్వార్ టివి అనే పేరుతో ఉన్న యూట్యూబ్ ఛానల్ లో కొప్పు రాములు తాత వేషంలో ఉండి పరుష పదజాలంతో, మనోభావాలు దెబ్బతినేలా వాఖ్యలు చేసిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మున్నూరుకాపులు వలసవాదులని, మోసగాళ్లని దూషిస్తూ యూట్యూబ్ లో అప్ లోడ్ చేసిన వీడియో ద్వారా మాట్లాడిన నిర్వాహకునిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మున్నూరుకాపుల ఐకమత్యాన్ని చూసి ఓర్వలేక ఇలాంటి చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. జనాభా దామాష పద్ధతిలో తమ రిజర్వేషన్లను సాధించే దిశలో ఇలాంటి చిల్లర రాజకీయాలు చేసే వారికి మేమంతా ఏకమై తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గరలో ఉందని అన్నారు. బిసిలపై ఎన్ని కుట్రలు చేసినా రాబోయే బిసి రాజ్యాన్ని ఎవరూ ఆపలేరని తెలిపారు. ఇట్టి సంఘటన వెనుక ఎవరున్నా వారిని వదిలే ప్రసక్తే లేదని, వారిని కఠినంగా శిక్షించకుంటే బిసిలంతా ఒకే గొంతుకై నినదిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు. భాస్కర్ శ్రీకాంత్. జలగం శివ. సునీల్. శేఖర్. గోపి. సంతోష్. సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



**లక్షెట్టిపేట, (క్రైమ్ న్యూస్):** పట్టణానికి చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారి, మెకానిక్ రుద్ర రవి ఇటీవల మరణించిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పరామర్శించారు. రవిమంచివాడని,అందరితోకలిసిమెలిసిఉండే వారని అకస్మాత్తుగా మరణించడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే అన్నారు. రవి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలుపుతున్నామన్నారు. పరామర్శించిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, బీ ఆర్ ఎస్ పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మైనారిటీ నాయకులు షేక్ చాంద్ తదితరులు ఉన్నారు.

# పాత్రికేయునికి మాతృ వియోగం



**పెద్దపల్లి, అక్టోబర్ 16 ( ది క్రైమ్ న్యూస్ ):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి గ్రామంలో ఈనాడు విలేఖరి దాసరి రమేష్ తల్లి రాధమ్మ ఇటీవల మరణించగా వారి దశదినకర్మకు స్థానిక పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ హాజరై చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల సుమన్ రెడ్డి చికెట్ల మొండయ్య చొప్పరి రాజయ్య రమేష్, బైరి రవి అల్లం సతీష్ గడ్డం బన్నీ బోడకుంటా చిన్న స్వామి రంజిత్ వేల్పులసదయ్య తాళ్లపెల్లి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అసత్య ప్రచారాలకు ఓటుతో బుద్ధిచెప్పిన ప్రజలు

- హర్యాణా, జమ్ము ఎన్నికల్లో కాంగ్రెసుకు పరాభవం
- మోదీ చతురతకు తిరుగులేదని నిరూపించిన ఎన్నికలు
- బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అంతర్జాతీయంగా దేశంపై విషం చిమ్ముతున్న కాంగ్రెస్ పార్టీకి ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి హర్యాణా, జమ్ముకాశ్మీర్ ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్పారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుదవారం జిల్లా కార్యాలయంలో ఇంచార్జీలతో సమీక్షా సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ చతురతకు తిరుగులేదని రెండు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలు మరోసారి నిరూపించాయని ఆనందం వ్యక్తం చేశారు. దేశభద్రతను సైతం ఉగ్రవాదులకు ఫణంగా పెట్టడానికి కూడా కాంగ్రెస్ పార్టీ వెనకాడబోదని, అలాంటి పార్టీని ప్రజలు తరిమికొడుతున్నారని అభిప్రాయపడ్డారు. ఆలయాలపై దాడులు అమానవీయం కాంగ్రెస్ పార్టీ పాలనలో ఉన్న తెలంగాణా రాష్ట్రంలో నిత్యం ఏదో ఒకచోట హిందూ దేవాలయలపై దాడులు పరిపాటి అయ్యాయని దుగ్యాల మండిపడ్డారు. దేవీదేవతల విగ్రహాలను ధ్వంసం చేసే వారిపై చర్యలు తీసుకోవడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలం అయ్యారని ఆగ్రహించారు. ప్రతీబూతులో 2వందల సభ్యత్వాలు అతిత్వరలో స్థానిక సంస్థల ఎలక్షన్లకు నగారా మోగే అవకాశముందన్న ప్రదీప్, అందుకు తగ్గట్టు ప్రతీబూతులో కమిటీ బలోపేతంపై దృష్టి సారించాలని కార్యకర్తలకు సూచించారు. 2వందలకు తగ్గకుండా సభ్యత్వాలు చేయించాలని దిశానిర్దేశనం చేశారు. జిల్లాలోని నాలుగు నగరపాలికలను గెలుచుకునేలా ప్రణాళికలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ అసెంబ్లీ సభ్యత్వ ప్రముఖ్ పొల్సాని సంపత్ రావు మరియు నాయకులు సభ్యత్వ నమోదు ఇంచార్జీలు, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# స్వాగత తోరణం ప్రారంభం చేసిన ముకుందానంద స్వామీజీ





**ధర్మపురి అక్టోబర్ 16, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీరామాలయ స్వాగత తోరణాన్ని బుధవారం శాంత ఆనంద ఆశ్రమ ముకుందానంద స్వామీజీ కరకములచే ప్రారంభించారు. దాతల విరాళాల చే సుమారు 6,50,000 రూపాయల ఖర్చుతో స్వాగత తోరణం నిర్మాణం గావించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తెమ్మ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు గుర్రాల సుధాకర్, వేముల నాగలక్ష్మి , వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గీతాంజలి, స్వాగతం తోరణం కమిటీ గౌరవ అధ్యక్షులు వెలుగందుల నాగభూషణం, అధ్యక్షులు ముత్తినేని నారాయణ, ప్రధాన కార్యదర్శి రాపర్తి శంకర్, ఉపాధ్యక్షులు ఎన్నిగందుల రవి కోశాధికారి కొత్తపల్లి కిషన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపకులను కించపరిస్తే ఊరుకోం


## - సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్



**లక్షెట్టిపేట, (క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులను కించపరిస్తే చూస్తూ ఊరుకోమని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు జిల్లాలోని పలు కళాశాలల అతిథి అధ్యాపకులు నల్ల బ్యాడ్జ్ లు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.... గత రెండు రోజుల క్రితం లక్షెట్టిపేట లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎకానమిక్స్ రెగ్యులర్ అధ్యాపకుడు, ఎగ్జామినేషన్ బ్రాంచ్ ఇంచార్జ్ తిరుపతి తనను అకారణంగా దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తిరుపతి బాధ్యతయుతమైన ఉద్యోగంలో ఉండి తోటి అధ్యాపకులను చులకనగా మాట్లాడటం మంచిది కాదన్నారు. గెస్ట్ లెక్చరర్స్ కూడా రెగ్యులర్ లెక్చరర్స్ తో పాటు సమానంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇకపై కించపరిచేలా మాట్లాడితే తమ పద్ధతిలో అర్ధమయ్యేలా చెబుతామన్నారు. అంతేకాకుండా తిరుపతి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని అతిథి అధ్యాపకులు డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్ మహాత్మకు అధ్యాపకుడు తిరుపతి పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ సంఘం అధ్యక్షులు పోరెడ్డి సత్యనారాయణ, మహేష్, రాజేశం, భవాని, అరుణ, ఇందు తో పాటు సుమారు 10 మంది గెస్ట్ లెక్చరర్స్ పాల్గొన్నారు.

# గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

## - సీసీ చార్జీల తగ్గింపుకు అవసరమైన చర్యలు చేపట్టాలి
## - మేజర్ గ్రామ పంచాయతీల పై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గ్రామ పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, వారం రోజుల వ్యవధిలో మన గ్రామాలు పరిశుభ్రంగా తయారు కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో 3 వేల జనాభా ఉన్న గ్రామ పంచాయతీల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఉన్న నిధుల ఆధారంగా క్యాపిటల్ పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీలో సీసీ చార్జీలు, మల్టీ పర్పస్ వర్కర్ల జీతాల చెల్లింపు, కచ్చితంగా చెల్లించాల్సిన సొమ్ము మినహాయించి మిగిలిన నిధులతో ప్రత్యేక అధికారి ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. అధికంగా సీసీ చార్జీలు వచ్చే గ్రామాలు వాటిని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకోవాలని, అధికంగా కరెంటు వాడ వద్దని అన్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలలో వారం రోజులలో ఎక్కడ ప్లాస్టిక్ కనపడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం పట్ల స్పష్టమైన మార్పు కనిపించాలని, రోడ్ల పై చెత్తా చెదారం, ప్లాస్టిక్, రాళ్ళు, పెంట కుప్పలు ఏవి కనపడకుండా పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు మల్టీ పర్పస్ వర్కర్ల ద్వారా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ప్రతిరోజు ట్రాక్టర్ ద్వారా డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ చేసుకుంటూ కాంపోస్టు షెడ్లకు తరలించాలని మరియు వర్మీ కంపోస్టు తయారు చేయాలని తెలిపి ఉన్నారు.అంగన్వాడి కేంద్రాలలో ఏవైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. శ్రీరాంపూర్ గ్రామంలో ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించాలని అన్నారు.గ్రామంలో నిర్మాణం పూర్తి చేసిన ఇండ్లకు పన్ను వసూలు ప్రారంభించాలని తెలిపారు. అక్టోబర్ నెలలో అన్ని గ్రామాలలో 80 % శాతం పన్నులు వసూలు చేయాలని కలెక్టర్ గారు ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి వేణు గోపాల్, ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కనీస మద్దతు ధర పై పత్తి కొనుగోలు సిద్ధంగా ఉండాలి

## - రైతులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ జిన్నింగ్ మిల్లులకు పత్తి తీసుకుని రావాలి
## - పత్తి కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన
## - పత్తి కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో వచ్చే పత్తి పంటను కనీసం మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో పత్తి కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్లో పత్తి కొనుగోలు యాక్షన్ ప్లాన్ ను అధికారులు అదనపు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా లిఅదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్లి మాట్లాడుతూ, మార్కెట్ లో నాణ్యమైన పత్తి పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువగా రేట్ పలికితే వెంటనే సిసిఐ కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు.పత్తి 8 శాతం తేమ ఉన్నట్టయితే కనీస మద్దతు ధర రూ.7521/- ఉన్నదని. పత్తి రైతులు తమ పత్తిని తక్కువ ధరకు దళారులకు కానీ, మధ్యవర్తులకు కానీ, ఇతరులకు కానీ అమ్ముకోకుండా పత్తి ధర కనీస మద్దతు ధర కన్నా తక్కువగా ఉన్నప్పుడు సీసీఐ వారిచే ఏర్పాటు చేయబడిన జిల్లాలోని నాలుగు కొనుగోలు కేంద్రాలలో మాత్రమే అమ్ముకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో పెద్దపెల్లి మార్కెట్ యార్డ్ పరిధిలో రెండు జిన్నింగ్ మిల్లులు, సుల్తానాబాద్ మార్కెట్ యార్డ్ పరిధిలో ఒక్క జిన్నింగ్ మిల్లు, కమాన్ పూర్ మార్కెట్ యార్డ్ పరిధిలో ఒక్క జిన్నింగ్ మిల్లు మొత్తం నాలుగు జిమ్మింగ్ మిల్లులలో అక్టోబర్ 16 నుండే పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని అన్నారు.పత్తి రైతులు తమ పత్తిని తీసుకొని వచ్చేటప్పుడు నాణ్యత ప్రమాణాలను పరిగణలోకి తీసుకొవాలని , నాణ్యమైన పత్తి పంటను వెంటనే కనీస మద్దతు ధర పై కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పత్తి పంట కొనుగోలు నిమిత్తం జిన్నింగ్ మిల్లులో నీరు , టాయిలెట్ అవసరమైన పరికరాలు మొదలగు సౌకర్యాలు సమకూర్చాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాలకు పత్తి పంట తీసుకొని వచ్చే రైతులు తమ బ్యాంకు ఖాతాలు ఆధార్ కార్డుతో లీంక్ చేయాలని, దీనిపై రైతులలో అవసరమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు మొదలగు సామాగ్రి అందుబాటులో ఉంచాలని అన్నారు.రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ధర కంటే తక్కువకు పత్తి పంట అమ్మవద్దని, మధ్య వర్తులను నమ్మి మోసపోవద్దని, ప్రైవేట్ వ్యాపారుల వద్ద మద్దతు ధర లభించని పక్షంలో నేరుగా జన్మింగ్ మిల్లులకు వచ్చి పత్తి పంట అమ్ముకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న పత్తి పంటను క్రాప్ బుకింగ్ ప్రకారం సమీపంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు మ్యాప్ చేయాలని అన్నారు. ఒకే రోజు అధిక సంఖ్యలో రైతులు పత్తి తీసుకుని రాకుండా జాగ్రత్త వహించాలని రైతులకు జిన్నింగ్ మిల్లుల సామర్థ్యం ప్రకారం టోకెన్లు జారీ చేయాలని అన్నారు. పత్తి తరలింపు కోసం అవసరమైన వాహనాలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. పత్తి పంట తేమ శాతం పై కర పత్రాలను విస్తృతంగా ప్రచారం చేయాలని అదనపు కలెక్టర్ అన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలని అన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద అగ్ని ప్రమాద నివారణ చర్యలు పటిష్టంగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఆది రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి రంగారావు, జిల్లా తూనికల కొలతల అధికారి విశ్వేశ్వర్ , మార్కెట్ కార్యదర్శులు, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు ఓనర్లు, అడ్తి దారులు, ఖరీదు దారులు సిబ్బంది పాల్గొన్నారు.

# విమానాల్లో స్కై మార్షల్స్ సంఖ్య పెంపు..

## నకిలీ బాంబు బెదిరింపులపై కీలక నిర్ణయం..!

**న్యూఢిల్లీ,అక్టోబర్16, (ది క్రైమ్ న్యూస్):** గత మూడు రోజులుగా భారతీయ విమానసంస్థలు నకిలీ బాంబు బెదిరింపుల్ని ఎదుర్కొంటున్నాయి. సోమవారం నుంచి ఈ రోజు బుధవారం వరకు మొత్తం 12 విమానాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. ఈ రోజు ముంబై నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానానికి, ఢిల్లీ నుంచి బెంగళూర్ వెళ్తున్న ఆకాస విమానానికి బాంబు ఉందంటూ బెదిరింపు సందేశాలు వచ్చాయి. మంగళవారం ఢిల్లీ-చికాగో ఎయిరిండియా విమానానికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. దీంతో విమానాన్ని కెనడాలోని ఓ మారుమూల విమానాశ్రయంలో ల్యాండ్ చేసి, తనిఖీలు నిర్వహించాల్సి వచ్చింది.ఈ నేపథ్యంలో ఈ రోజు కేంద్ర పౌరవిమానయాన అధికారులు అత్యున్న సమావేశం నిర్వహించారు. మంత్రిత్వ శాఖ, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ, హెూం మంత్రిత్వ శాఖ అధికారులు భేటీలో పాల్గొన్నారు. సమాచారం ప్రకారం.. సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీ ఈ బూటకపు కాలర్లను గుర్తించి వీరిని 'నో ఫ్లై' జాబితాలో చేర్చేందుకు సమాయత్తమవుతోంది. ఇదే విధంగా విమానాల్లో ఎయిర్ మార్షల్స్ సంఖ్యను రెట్టింపు చేయడంపై కూడా చర్చ జరుగుతోంది. ఎన్ఎస్జీ కమాండో యూనిట్ ఎయిర్ మార్షల్స్ని ప్రధానంగా అంతర్జాతీయ మార్గాలు, దేశీయంగా సున్నితమైన మార్గాల్లో మోహరించనున్నారు. స్కై మార్షల్స్ సాధారణ ప్రయాణికుల వలే విమానంలో ప్రయాణించే సాయుధ భద్రతా అధికారులు. బాంబు బెదిరింపులపై నివేదిక సమర్పించాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్), బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ), ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి)లను కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఆదేశించినట్లు తెలుస్తోంది. భారతదేశ విమానరంగానికి చెడ్డపేరు తెచ్చేందుకు కొందరు ఇలాంటి పనులు చేస్తున్నారని తెలుస్తోంది.

## జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో ప్రసవాలు

**జగిత్యాల,అక్టోబర్16, (ది క్రైమ్ న్యూస్):** క్షేత్ర స్థాయిలో కీలక సేవలందిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పీహెచ్సీల వైద్యులు, ఆశాలు, ఏఎన్ఎంలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వ్యాధిని గుర్తించి, చికిత్స అందించడం ద్వారా ప్రజలు దీర్ఘకాలిక రోగాల బారిన పడకుండా కాపాడుతున్నారు. గత సంవత్సరం రికార్డు ప్రకారం.. మొత్తం ప్రసవాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే 76.3% డెలివరీలు జరగడం సరికొత్త రికార్డు. అయితే.. గర్భిణులను కంటికి రెప్పలా కాపాడుతూ, వారిపై రూపాయి భారం పడకుండా ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగేందుకు ఆశాలు, ఏఎన్ఎంలు చేస్తున్న కృషి గొప్పది. అయితే తాజాగా జగిత్యాల ప్రభుత్వాసుపత్రిలో ఒక్క రోజులోనే రికార్డు స్థాయిలో ప్రసవాలు చేశారు వైద్యులు. జగిత్యాల జిల్లా ప్రభుత్వ మాత శిశు సంరక్షణ కేంద్రం ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో 24 గంటల్లో 25 ప్రసవాలు చేశారు. ఈ నెల 15న జగిత్యాల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 25 ప్రసవాలు చేశారు డాక్టర్లు. వీటిలో.. 13 సాధారణ ప్రసవాలు, 12 సిజేరియన్ ప్రసవాలు చేశారు. అయితే.. దీనిపై వైద్యులకు ప్రశంసల వెల్లువెత్తాయి. జగిత్యాల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఏకకాలంలో జరిగిన ప్రసవాల్లో వైద్యులు, నర్సులు రికార్డు సృష్టించారు. జరిగిన ప్రసవాల్లో తల్లి బిడ్డల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సాధారణ ప్రసవాలు చేయడంలో నర్సుల తోడ్పాటు ఎంతో ఉందని బాలింతల కుటుంబ సభ్యులు కొనియాడారు. ప్రసవాలు చేసిన వైద్యులు, ఆసుపత్రి సిబ్బందికి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు ప్రశంసలు జల్లు కురిపించారు.

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి భీకరదాడులు

## అర్ధరాత్రి ఇజ్రాయెల్ వైమానిక దాడులు

## మేయర్ సహా 15 మంది మృతి

**లెబనాన్,అక్టోబర్16(ది క్రైమ్ న్యూస్):** లెబనాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి భీకరదాడులు కొనసాగించింది. దక్షిణ లెబనాన్‌లోని నబాటీహ్‌లోని మునిసిపాలిటీ భవనాలపై మంగళవారం అర్ధరాత్రి ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో మేయర్ అహ్మద్ కహిల్ మరణించినట్లుగా నబాతియే ప్రావిన్స్ గవర్నర్ హువైదా టర్క్ ప్రకటించారు. మేయర్‌తో సహా 15మంది ప్రాణాలు కోల్పోయినట్లుగా అధికారిక వర్గాలు వెల్లడించాయి. దాడిలో కూలిన భవనాల శిథిలాల నుంచి 15మృతదేహాలను వెలికి తీశామని.. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని లెబనాన్ సివిల్ డిఫెన్స్ పేర్కొంది.ఆదివారం దక్షిణ లెబనాన్‌లోని ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళాలపై ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో 15 మంది ఐరాస సైనికులు గాయపడ్డారు. హిజ్బుల్లాకు పట్టున్న ప్రాంతాల నుంచి తక్షణమే ఐరాస దళాలు వైదొలగాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు డిమాండ్ చేశారు. దక్షిణ లెబనాన్‌పై భూతల దాడులు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 250 మందికి పైగా హెజ్బుల్లా ఫైటర్లు మరణించినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది.

# ఉత్తర నైజీరియాలో ఘోర విషాదం

## పెట్రోల్ ట్యాంకర్ పేలి 100 మంది మృతి

**జిగావా,అక్టోబర్16(ది క్రైమ్ న్యూస్):** ఉత్తర నైజీరియాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఇంధన ట్యాంకర్ పేలి 100 మంది మృతిచెందగా.. 50 మందికి పైగా గాయపడినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. ఉత్తర జిగావా రాష్ట్రంలో రహదారిపై పెట్రోల్ ట్యాంకర్ బోల్తా పడింది. అయితే సమీపంలో ఉన్న స్థానికులకు ఈ సమాచారం తెలిసింది. రోడ్డుపై పడిన ఇంధనాన్ని సేకరించే పనిలో ఉండగా హఠాత్తుగా మంటలు అంటుకుని ట్యాంకర్ పేలిపోయింది. దీంతో భారీగా మంటలు చెలరేగి పెద్ద ఎత్తున ప్రజలు ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు. మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ట్యాంకర్ ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో హైవేపై బోల్తా పడింది. ప్రజలు పెట్రోల్ తీసుకుంటుండగా ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ట్యాంకర్ ఒక్కసారిగా పేలిపోయింది. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. ట్యాంకర్‌కు దూరంగా ఉండమని ప్రజలను హెచ్చరించినప్పటికీ ఎవరూ వినిపించుకోలేదని, ఒక్కసారిగా మంటలు ఎగబడటంతో భారీగా ప్రాణనష్టం జరిగిందని అధికారులు చెప్పారు.

# జస్టిన్ ట్రూడో కారణంగా భారత్ - కెనడా మధ్య ఉద్రిక్తతలు

## రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు తదుపరి చర్యలు తీసుకోవడానికి స్వేచ్ఛ ఉంది భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడి



**న్యూఢిల్లీ,అక్టోబర్16, (ది క్రైమ్ న్యూస్):** కెనడా-భారత్ మధ్య ఇటీవలి పరిణామాల తర్వాత, రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు త్వరలో ముగిసేలా కనిపించడం లేదు. ఈ అంశంపై తదుపరి చర్యలు తీసుకోవడానికి స్వేచ్ఛ ఉందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. మరోవైపు, కెనడా నుంచి ప్రస్తుతం సంబంధాలు ఏ దిశలోనైనా ముందుకు సాగవచ్చనే సంకేతాలు అందాయి. కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో తండ్రి పిరె ఇలియట్ ట్రూడో కూడా గతంలో కెనడా ప్రధానిగా ఖలిస్థాన్ ఉగ్రవాదులకు ఊతమిచ్చారు. 300కుపైగా భారతీయ ప్రయాణికులతో కూడిన కనిష్క విమానాన్ని పేల్చటానికి ఉగ్రవాదులకు పరోక్షంగా దోహదం చేశారు. భారత్‌తో ఘర్షణాత్మక వైఖరి ప్రదర్శించారు. ఇప్పుడు ట్రూడో కూడా అదే బాటలో నడుస్తున్నారు. భారత్‌పై ఆర్థిక ఆంక్షలకు సంబంధించి కెనడా విదేశాంగ మంత్రి మిలోనీ జోలీ మాట్లాడుతూ.. అంతా టేబుల్‌పైనే ఉందని.. అంటే కెనడా తన వైఖరిని భారత్ ముందు తెరిచి పెట్టిందని అన్నారు. మరోవైపు విదేశీ వ్యవహారాల నిపుణుడు రాజీవ్ డోగ్రా స్పందిస్తూ.. "కెనడాతో మా వాణిజ్య సంబంధాలు చాలా పెద్ద భూభాగంలో లేవని, కెనడా ఆర్థిక ఆంక్షలు విధించినప్పటికీ, కెనడా ఎగుమతిదారులకు భారతదేశం కంటే ఎక్కువ నష్టం కలిగిస్తుంది." అని సమాధానమిచ్చారు. ట్రూడో ప్రభుత్వం భారత్‌పై ఎలాంటి ఆర్థిక ఆంక్షలు విధించాలని ప్రయత్నిస్తే, దాని పరిధి జీ7కి చేరుతుందని విదేశీ వ్యవహారాల నిపుణుడు ప్రొఫెసర్ స్వరణ్ సింగ్ చెబుతున్నప్పటికీ, ప్రధాని మోడీని ఈ బృందంలో చేర్చిన విధానం వల్ల అది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. సమ్మిట్‌లతో పాటు ఆహ్వానించడం వల్ల కెనడాకు ఏ భాగస్వామ్య దేశం మద్దతు ఉన్నట్లు అనిపించడం లేదు. ఆంక్షలు విధిస్తే అది కెనడా-భారత్ వాణిజ్య సంబంధాలకే పరిమితం అవుతుందని దీన్ని బట్టి స్పష్టమవుతోంది. తదుపరి వ్యూహంలో భాగంగా కెనడా అక్కడ విద్యనభ్యసించే విద్యార్థుల సంఖ్యను తగ్గించుకోవచ్చని, అయితే ఇప్పటికే సగానికి సగం తగ్గి ఇతర గమ్యస్థానాల వైపు వెళ్తున్నారని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా దౌత్య అధికారుల సంఖ్యను తగ్గించినందున, కెనడాకు పరిమిత సంఖ్యలో వీసాలు జారీ చేయబడతాయనే భయం ఉంది. దీని వల్ల కెనడాలో చదువుకునేందుకు వెళ్లే విద్యార్థుల విషయంలో భారత్‌కు నష్టం వాటిల్లవచ్చు. కెనడా మంగళవారం వియన్నా సమావేశాన్ని ప్రస్తావించింది. అటువంటి పరిస్థితిలో అంతర్జాతీయ స్థాయిలో సమస్యను లేవనెత్తడానికి ప్రయత్నించవచ్చా అనేది ప్రశ్న. దీనికి సంబంధించి రాజీవ్ డోగ్రా మాట్లాడుతూ.. కెనడా స్వయంగా వియన్నా కన్వెన్షన్ నిబంధనలన్నింటినీ పక్కన పెట్టిందని చెప్పారు. ఎందుకంటే కన్వెన్షన్ ప్రకా.., దౌత్యవేత్తలకు రోగనిరోధక శక్తి ఉంటుంది. వారిని చట్టపరమైన ప్రక్రియలోకి లాగలేరు. అటువంటి పరిస్థితిలో ఈ విషయాన్ని ఏ ప్రాతిపదికన లేవనెత్తవచ్చు? అదే సమయంలో కెనడా ఇప్పటి వరకు ఎలాంటి బాధ్యతారాహిత్యాన్ని ప్రదర్శిస్తోందని, కెనడా కూడా అలాంటి విషయాలను ఆ స్థాయిలో లేవనెత్తే ఆలోచనలో ఉన్నట్లు కనిపించడం లేదని ప్రొఫెసర్ స్వరణ్ సింగ్ అంటున్నారు. కెనడా ప్రభుత్వం ఈ విషయాన్ని ఫైవ్ ఐస్, జీ-7కి తీసుకువెళుతుందని తెలిపింది. ఈ దిశగా సోమవారం నాడు బ్రిటన్ ప్రధానితో కూడా పీఎం ట్రూడో చర్చించారు. గత ఏడాది కూడా ట్రూడో ఇదే వ్యూహంతో పనిచేసినప్పటికీ ప్రయోజనం లేదని నిపుణులు విశ్వసిస్తున్నప్పటికీ.. వచ్చే ఏడాది కెనడాలో జి-సెవెన్ సమ్మిట్ జరగనుందని, అక్కడికి ప్రత్యేక ఆహ్వానితుడిగా వెళ్లాలని భారత్ నిర్ణయించుకుంటే కెనడా ప్రతిష్టకు మేలు జరుగుతుందని స్వరణ్ సింగ్ అంటున్నారు. ఒక సమూహంగా బ్రిక్స్ (%దీ=×జూ%) యొక్క ప్రతిష్ట నిరంతరం పెరుగుతోందని.. అటువంటి పరిస్థితిలో, సవాళ్లతో చుట్టుముట్టబడిన జీ-7 భారతదేశం వంటి ఆర్థిక శక్తిని అసంతృప్తికి గురిచేయకూడదని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు కెనడా నుంచి అసంబద్ధ ప్రకటనలు వెలువడ్డాయని ప్రత్యేకించి స్వయంగా ప్రధాని నుంచి లాజిక్ లేని ఆరోపణలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. కానీ భారత్ మాత్రం నిదానంగా నిశ్శబ్ద యుద్ధం చేస్తోంది. భారత్ గత ఏడాది 41 మంది కెనడా దౌత్యవేత్తలను దేశం విడిచి వెళ్లాలని కోరగా, ఇప్పుడు ఆరుగురిని బహిష్కరించింది. అటువంటి పరిస్థితిలో భారతదేశం యొక్క విధానం చర్యకు ప్రతి చర్య అనే చందంగా సాగుతోంది. కెనడా దూకుడు భాషపై భారత్ మర్యాదపూర్వకంగా స్పందించింది. ఇలాంటి పరిస్థితుల్లో కెనడాకు అంతర్జాతీయ సమాజం మద్దతుగా నిలిచే పరిస్థితి కనిపించడం లేదు. గతసారి కూడా ఈ విషయంలో అమెరికా కెనడాతో కొంతమేరకు చర్చలు జరపగా, ఇతర దేశాలు ఓటు బ్యాంకు రాజకీయాలపై ఏమీ మాట్లాడకుండా దూరంగా ఉన్నాయి.

# ఏఐ ద్వారా సీవీని రూపొందించిన నిరుద్యోగి

**న్యూఢిల్లీ,అక్టోబర్16, (ది క్రైమ్ న్యూస్):** చాట్-జీపీటీ అనేక విధాలుగా ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే దీనిని జాగ్రత్తగా ఉపయోగించాలి లేకపోతే చెడు పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఢిల్లీకి చెందిన ఒక సీఈవో తన పోస్ట్‌లలో.. చాట్‌జీపీటీ సహాయంతో వ్రాసిన తర్వాత కూడా ప్రూఫ్ రీడింగ్ ఎందుకు అంత ముఖ్యమైనదో ఉదాహరణతో ప్రజలకు వివరించారు. ఎంట్రేజ్ సంస్థ సీఈఓ అనన్య నారంగ్ ఉద్యోగ దరఖాస్తుదారుకి చెందిన కవర్ లెటర్ స్క్రీన్‌షాట్‌ను పోస్ట్ చేసి, అందులోని ఓ తప్పుడు హైలైట్ చేశారు. ఇది వినియోగదారులను షాక్‌కు గురి చేసింది. స్క్రీన్ షాట్ చూస్తుంటే బహుశా అప్లికేషన్ పంపే వ్యక్తి తొందరపడి కవర్ లెటర్ ను సరిగ్గా చదవకుండా కాపీ పేస్ట్ చేసి ఉంటాడని తెలుస్తోంది. స్క్రీన్‌షాట్‌లో కవర్ లెటర్‌లో వ్యక్తిగత సమాచారం స్థానంలో టెంప్లేట్ ప్లేస్‌హోల్డర్‌లు ఉన్నాయి. ఈ లేఖ కంటెంట్ సంబంధిత స్థానం కోసం పంపబడింది. చాలా చోట్ల, వ్యక్తిగత సమాచారానికి బదులుగా, టెంప్లేట్‌లు మాత్రమే కనిపిస్తున్నాయి.అభ్యర్థి చాట్‌జీపీటీ సాయంతో తన సీవీని ఆసక్తికరంగా రూపొందించి కంపెనీకి పంపించాడు. ఈ దరఖాస్తును చూసిన ఎంట్రేజ్ సంస్థ సీఈఓ అనన్య నారంగ్‌కు కంగుతిన్నారు. సాధారణంగా, "చాట్‌జీపీటీకి ఫలానా ఉద్యోగం కోసం దరఖాస్తు రూపొందించు" అని చెబితే, ఆ ఏఐ ప్లాట్‌ఫామ్ సంబంధిత టెంప్లేట్‌ను చిటికెలో తయారుచేస్తుంది. అయితే, అభ్యర్థి చాట్‌జీపీటీ రూపొందించిన అప్లికేషన్‌ను కంపెనీకి పంపించాడని ఆమె గమనించారు. అందులో నైపుణ్యాలు, అనుభవం వంటి విషయాలను చూసి ఆమె ఆశ్చర్యపోయారు. దరఖాస్తు కోసం అభ్యర్థి చాట్‌జీపీటీని ఉపయోగించాడనే విషయం స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ విషయానికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను ఆమె 'ఎక్స్' వేదికపై పోస్ట్ చేశారు. నిరుద్యోగం ఉందని చెప్పడంలో ఆశ్చర్యం లేదు" అంటూ ఆమె తన వ్యాఖ్యలు జోడించారు. "ఇలాంటి ఉద్యోగ దరఖాస్తులపై ఎలా స్పందించాలి?" అని ఎక్స్ వేదికలో సలహాలు అడిగారు. "చాలామంది అభ్యర్థుల మాదిరిగా ఈ వ్యక్తి కూడా చాట్‌జీపీటీ సాయంతో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే, పంపేముందు మరోసారి దాన్ని చదవలేదు" అని ఆమె అసహనం వ్యక్తం చేశారు. అంతే కాకుండా.. ఆమె పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. చాట్‌జీపీటీ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇలాంటి దరఖాస్తులు సాధారణమైపోయాయని కొందరు రిక్రూటర్లు వెల్లడించారు.

# పిల్లలు మాల్ న్యూట్రిషన్ తగ్గించేందుకు పక్కా చర్యలు

- అంగన్వాడి సహాయకుల పదోన్నతుల జాబితా శనివారం నాటికి సమర్పించాలి
- ప్రీ స్కూల్ పాఠ్యాంశ సిలబస్‌ను కట్టుదిట్టంగా అమలు
- అంగన్వాడి కేంద్రాలలో పారిశుధ్యం తప్పనిసరిగా నిర్వహించాలి
- మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పై సంబంధిత అధికారులతో

## సమీక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, అక్టోబర్-16: ( ది క్రైమ్ న్యూస్ ) జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లలు మాల్ న్యూట్రిషన్ తగ్గించేందుకు పక్కా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అంగన్ వాడి కేంద్రాల పనితీరు, అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు లబ్ధిదారుల వివరాలు, పూర్వ విద్యా కేంద్రాల ఏర్పాటుకు అంగన్వాడీ టీచర్లకు అందించిన శిక్షణ మొదలగు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,జిల్లాలో పదోన్నతలు రావాల్సిన అంగన్వాడి సహాయకుల జాబితా వివరాలను శనివారం నాటికి అందజేయాలని కలెక్టర్ జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లల మాల్ న్యూట్రిషన్ తగ్గించేందుకు పక్కా చర్యలు తీసుకోవాలని, పిల్లల ఎదుగుదలను పూర్తి స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అంగన్వాడి కేంద్రాలలో సామ్ (బరువు తక్కువ) , స్టంట్ (ఎత్తు తక్కువ) పిల్లలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలామృతం ప్లస్ పోషకాహారం అందజేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందించిన కరదీపిక ,ప్రియదర్శిని ప్రకారం పిల్లలకు పాఠ్యాంశాల సిలబస్ బోధన జరగాలన్నారు.ప్రీ స్కూల్ నిర్వహణ ను సూపర్వైజర్లు నిరంతర తనిఖీలతో పర్యవేక్షించాలని, అంగన్వాడి టీచర్లకు అవసరమైన శిక్షణ, సలహాలు ఎప్పటికప్పుడు అందించాలని, పిల్లలకు వినూత్న పద్ధతులలో పాఠ్యాంశాలు బోధించే అంశం లో అంగన్వాడీ టీచర్లచే అవసరమైన యాక్టివిటీస్ చేయించాలని కలెక్టర్ తెలిపారు.ఎస్.ఎస్.ఎఫ్.పి ప్రోగ్రాం మైక్రో ప్లానింగ్ ఇంప్లిమెంటేషన్ చేసి హెల్త్ డిపార్ట్మెంట్ పోర్టల్ లో అందరి పిల్లల వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్.బీ.ఎస్.కే బృందం సందర్శన చేసిన సమయంలో ఏ పిల్లవాడు మెడికల్ అసెస్మెంట్ కు దూరం కాకుండా చూడాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, సిడిపిఓ కవిత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# బదలీల అనంతరం విధుల్లో చేరిన విద్యుత్ ఉద్యోగులు

**జమ్మికుంట అక్టోబర్ 16 (ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ 327 డివిజన్ అధ్యక్షులు విజ్జిగిరి .అంజయ్య కనగర్తి లైన్మెన్ నుండి రిలీవ్ అయ్యి బిజిగిరి షరీఫ్ లైన్మెన్ గా తనుగుల ఏఈ సారయ్య జాయిన్ చేసుకున్నారు. అలాగే ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం హుజురాబాద్ డివిజన్ అధ్యక్షులు మారపెల్లి.సంజీవరావు జమ్మికుంట టౌన్ ఫోర్ మెన్ గా రిలీవ్ అయ్యి హుజురాబాద్ రూరల్ ఫోర్ మెన్ గా ఏఈ సంపత్ రెడ్డి జాయిన్ చేసుకున్నారు. బీసీ సంఘం హుజురాబాద్ డివిజన్ సెక్రెటరీ కోడెపాక ఐలేష్ జమ్మికుంట టౌన్ లైన్మెన్ గా రిలీవ్ అయ్యి చేల్పూర్ లైన్మెన్ గా ఏ ఈ సంపత్ రెడ్డి జాయిన్ చేసుకున్నారు. దెబ్బేట సంపత్ సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ గా జమ్మికుంట టౌన్ లో రిలీవ్ అయ్యి ఆముదాలపల్లి సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ గా జూనియర్ అకౌంట్ ఆఫీసర్ నవీన్ హుజురాబాద్ ఈ ఆర్ ఓ నుండి రిలీవ్ అయ్యి జమ్మికుంట ఈ ఆర్ ఓ లో జాయిన్ కావడం జరిగింది. కెడం. రజినీకాంత్ సైదాపూర్ లైన్మెన్ గా రిలీవ్ అయ్యి హుజురాబాద్ రూరల్ సబ్స్టేషన్ లైన్మెన్ ఆపరేటర్ గా సంపత్ రెడ్డి జాయినింగ్ చేసుకున్నారు.ఆఫీస్ సబార్డినేటర్ స్వరూప హుజురాబాద్ ఈ ఆర్ ఓ నుండి జమ్మికుంట ఈ ఆర్ ఓ లో జైనింగ్ కావడం జరిగింది జరిగింది. ఆఫీస్ రికార్డు అసిస్టెంట్ విజయ హుజురాబాద్ ఈ ఆర్ ఓ నుండి హుజురాబాద్ డివిజన్ ఆఫీస్ లో జాయినింగ్ కావడం జరిగింది. వీరిని ఉత్తర విద్యుత్ 327 యూనియన్ కంపెనీ సెక్రెటరీ కొండూరి శ్రీనివాస్ కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీమతి తులసి 327 యూనియన్ సర్కిల్ ప్రెసిడెంట్ యుగేందర్ సర్కిల్ సెక్రెటరీ కే శ్రీనివాస్ కరీంనగర్ డివిజన్ సెక్రెటరీ రహిమతల్లి ఉత్తర విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కంపెనీ ఉపాధ్యక్షులు అంబాల. వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం హుజురాబాద్ డివిజన్ సెక్రెటరీ సొల్లు. లక్ష్మణ్ 327 హుజురాబాద్ డివిజన్ సెక్రెటరీ శ్రీపతి సుధాకర్ ఎండి కాలిక్, దొడ్డే. భాస్కర్, మచ్చ గిరి.సుదర్శన్, మంద. కుమారస్వామి, గంగారపు. రాజయ్య, బాకీ సతీష్.వాజే. కొమురయ్య , తాళ్లపల్లి .రాజేశం, రాచపల్లి .రాజయ్య, బత్తుల. రాజు, రజనీకాంత్, పవన్ పుల్లూరి. శ్రావణ్ కుమార్, భాగ్యలక్ష్మి, రాజు, రమేష్ బాబు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



# వందలాది మంది యువతకు శిక్షణకు అవకాశం

- టెక్నాలజీ రంగంలో పెట్టుబడుల ఆకర్శణెలి లక్ష్యం
- స్టెరిలైట్ కంపెనీతో టీ ఫైబర్ ఎంవోయు
- మొబైల్ కాంగ్రెస్‌కు హాజరైన మంత్రి శ్రీధర్ బాబు

**న్యూఢిల్లీ,అక్టోబర్16(ది క్రైమ్ న్యూస్):**స్టెరిలైట్ కంపెనీతో టీ ఫైబర్ ఎంవోయు కుదుర్చుకుందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. దీని వల్ల వందలాది మంది యువత శిక్షణ పొందబోతున్నారని తెలిపారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు.. టెలికాం రంగంలో ఉపాధి లభిస్తుందని చెప్పారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆసియాలోనే బిగ్గెస్ట్ టెక్ ఇవెంట్ ఇండియా మొబైల్ కాంగ్రెస్ -2024 సదస్సును మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సదస్సుకు 10 మంది ప్రతినిధుల బృందంతో తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. అలాగే ఈ సదస్సుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్యాపిటల్ పార్ట్నర్‌గా తెలంగాణ రాష్ట్రం వ్యవహరిస్తుంది. ఈ సదస్సుకు హాజరైన ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు బుధవారం మాట్లాడుతూ... టెక్నాలజీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. ఆ క్రమంలో అనేక టెలికాం సంస్థల ప్రతినిధులతో తాము సమావేశమై చర్చించామన్నారు. కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా.. ప్రత్యేకంగా టెలికామ్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీని రాష్ట్రాలు నిర్ణయం చేయవచ్చంటూ తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ టెలికాం మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ తెలియ జేయడం జరిగిందని చెప్పారు.మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రో యాక్టివ్‌గా తీసుకొని.. విధానపర నిర్ణయం తీసుకొని పాలసీని ఇనిషియేట్ చేస్తామన్నారు. దీనివల్ల అనేక టెలికాం మ్యానుఫ్యాక్చరర్స్ తెలంగాణకు వచ్చే అవకాశం ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అతి త్వరలో దీనిని తీసుకొచ్చే కార్యక్రమం తీసుకుంటామన్నారు. ఐటీ శాఖల మంత్రి జ్యోతిరాధిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఐటీ మినిస్టర్ల కాన్ఫరెన్స్‌లో తాము పాల్గొన్నట్లు తెలిపారు. ప్రభుత్వం తరఫున టీ్గ ÷బైర్, ఆప్టికల్్గ ÷బైర్ నెట్‌వర్క్‌కు సంబంధించి గ్రామంలోని ప్రతి ఇంటికి నెట్‌వర్క్ సదుపాయం కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ఈ సందర్భంగా వారికి వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. 2014 అనంతరం భారత నెట్ అని ఫేస్ టు ఫేస్ వన్ అని కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని వివరించారు. రూ. 3 వేల కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయింపు చేసుకొని అండర్ గ్రౌండ్‌లో్గ ÷బైర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ండర్ గ్రౌండ్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడం తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకత అని ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు వివరించారు. ఈ నెట్‌వర్క్ పూర్తి స్థాయిలో పూర్తి కావాలంటే నిధులు అవసరమన్నారు. ఆ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ఇబ్బందులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్ళామని చెప్పారు. దాదాపు రూ. 1600 కోట్లకు పైగా నిధులు అవసరమని.. వాటిని తెలంగాణాకు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. తంలో కేంద్ర ప్రభుత్వ దృష్టికి సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని తీసుకు వెళ్లారని గుర్తు చేశారు. అటవీ ప్రాంతాలకు సంబంధించ్గి ÷బైర్ నెట్‌వర్క్ కోసం అటవీ శాఖా అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఈ అనుమతుల అంశాన్ని కేంద్రం పరిష్కారం చేయాలని తాము కేంద్రాన్ని కోరామన్నారు. దీనిపై కేంద్రం సైతం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ సదస్సుకు 190 దేశాల ప్రతినిధులు, 3 వేల మంది పారిశ్రామికవేత్తలు, 400 మందికి పైగా ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. అలాగే తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు దాదాపు 900 స్టార్టప్ కంపెనీలు 120 దేశాల నుంచి తరలి వచ్చాయి. ఈ సదస్సులో తెలంగాణ ప్రభుత్వం భాగస్వామిగా వ్యవహరిస్తుంది.





# గత పదేళ్లలో మీరేం చేశారో గుర్తుకు తెచ్చుకోండి

**బీఆర్ఎస్ పనికట్టుకుని బురద జల్లే ప్రయత్నం**

**ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ**



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. బీఆర్ఎస్ పనికట్టుకుని బురద జల్లే పనిలో పడ్డారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆరోపించారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పార్టీకి కొంత సమయం ఇచ్చే వాళ్ళమని, కానీ కేటీఆర్.. హరీష్ లు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ కనిపించడం లేదు.. ప్రతిపక్ష నాయకుడు ఎవరు అనేది అర్థం అవ్వడం లేదని ఆయన అన్నారు. గత పదేళ్ల లో మీరేం చేశారో గుర్తుకు తెచ్చుకోండని, నేను ప్రతిపక్ష నేతగా ఉంటే.. నా వెంట ఉన్న ఆరుగురు ఎమ్మెల్సీలు లాక్కున్నారన్నారు. గంట సమయం ఇవ్వకుండా నా సెక్యూరిటీ.. బుల్లెట్ ప్రూఫ్ తీసేశారని, మళ్ళీ ఇప్పుడు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు షబ్బీర్ అలీ. 48 మంది ఎమ్మెల్యేలను పార్టీ ఫిరాయింపులు చేసింది మీరు అని, తలసాని టీడీపీ ఎమ్మెల్యేగా ఉండి మంత్రిగా ప్రమాణం చేయించారన్నారు. అప్పుడు గుర్తు లేదా.. సిగ్గులేకుండా ఇప్పుడు మాట్లాడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. మా పార్టీ ఇప్పటి వరకు ఎప్పుడు అలా చేయలేదని ఆయన అన్నారు. బీఆర్ఎస్ హయంలో మైనార్టీలకు ఏం చేశారు, మైనార్టీలకు మెడికల్ కాలేజి ఇచ్చారా..? అని ఆయన ప్రశ్నించారు. ఇందిరమ్మ కమిటీలతో ఇండ్లు ఇచ్చేందుకు జీఓ ఇచ్చారని, సోషల్ మీడియా లో ఇందిరమ్మ కమిటీల పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారం చేసే వాళ్లకు సిగ్గు శరం ఉండాలని, పిచ్చి మాటలు మాట్లాడకండన్నారు. మైనార్టీల కోసం183 సీట్ల లా కాలేజి ఇచ్చామని, 2 ఫార్మసీ కాలేజీలు ఇచ్చామన్నారు. కేసీఆర్ కాలేజీలు మూసేశారు.. మేము తెరిపించే పనిలో ఉన్నామన్నారు. కేటీఆర్.. హరీష్ లకు డీఎస్సీ ఎలా వేయాలి..? తెలుసా మీకు.. గ్రూప్ పరీక్షలు ఎలా పెట్టాలి అనేది తెలుసా..? మేము డీఎస్సీ..గ్రూప్స్ ఎలాంటి వివాదం లేకుండా వేస్తున్నాం..మీ కంటికి కనిపించడం లేదా..? అని షబ్బీర్ అలీ అన్నారు. అంతేకాకుండా..'తెలంగాణ నీ లూటీ చేసిన దొంగలు బీఆర్ఎస్ వాళ్ళు, దొంగల గురించి ఏం మాట్లాడాలి. గురుకులాల కి లాక్ లు వేయడం కరెక్ట్ కాదు. మూడేళ్లు కేసీఆర్ ఇవ్వలేదు బకాయిలు. బీఆర్ఎస్ నేతలు.. వెంటపెట్టుకుని తాళాలు వేయించారు. కాంగ్రెస్ నీ బదానం చేసే పనిలో బీఆర్ఎస్ ఉంది. మోడీకి రేవంత్.. నేను భయపడము, ఈడీ విచారణకు ఇద్దరం వెళ్లినం.. మమ్మల్ని వదిలేయలేదు. మీరు వెళ్ళారా ఈడీకి, కోడి గుడ్డుకు ఇచ్చే పైసలు కూడా కేసీఆర్ పెండింగ్ పెట్టిండు, మూడేళ్లు గా బిల్లులు ఇవ్వకుండా ఆపింది కేసీఆర్. మూసీపై ఇంకా డీపీఆర్ కాలేదు, మీలాగా డీపీఆర్ లేకుండా ప్రాజెక్టులు కట్టం. డీపీఆర్ కాకుండా పని చేస్తే.. మేమే మా ప్రభుత్వాన్ని అడుగుతాం' అని షబ్బీర్ అలీ అన్నారు.

# గుండెపోటుతో చిన్నారి మృతి

## కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

**కరీంనగర్,అక్టోబర్16(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. కళ్లేదుటే ఐదేళ్ల చిన్నారి గుండెపోటుకు గురై విగతజీవిలా పడిపోయింది. ఈ దృశ్యం చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీర య్యారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన రాజు, జమున దంపతులకు ఉక్కులు(5) అనే కుమార్తె ఉంది. ఏకైక సంతానం కావడంతో బాలికను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. అయితే ఎప్పటిలాగానే మంగళవారం ఉదయం నిద్రలేచిన బాలిక కాసేపు ఆడుకుంది. కాసేపటి తర్వాత తనకు కళ్లు తిరుతున్నాయనే విషయాన్ని తల్లికి తెలియజేసింది. అయితే బాలికను తల్లి జమున స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడి వైద్యులు పరీక్షించి వెంటనే హన్మకొండ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందిగా సూచించారు. దీంతో హుటాహుటిన తల్లిదండ్రులు చిన్నారిని తీసుకుని హన్మకొండ ఆస్పత్రికి చేరుకున్నారు. అయితే వైద్యులు పరీక్షిస్తుండగానే ఉక్కులు మృతి చెందింది. బాలిక గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉక్కులుకు పుట్టినప్పటి నుంచే గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని, ఆ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించలేకపోయాని డాక్టర్లు తెలిపారు. ఆ సమస్యల వల్ల చిన్నారికి గుండెపోటు వచ్చి ఉంటుందని వెల్లడించారు. మ కుమార్తె ఉక్కులు మృతిచెందిందని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. అల్లారుముద్దుగా పెంచుకుంటున్నామని, కుమార్తె ఇక లేదనే విషయాన్ని ఎలా తట్టుకోవాలంటూ గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. ఉక్కులు మరణవార్తతో జమ్మికుంటలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# హైకోర్టు ఆదేశాలతో ఎపికి ఐఎఎస్ అధికారులు

**ఇన్‌చార్జులను నియమించిన తెలంగాన ప్రభుత్వం**

**జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబరిదికి అదనపు బాధ్యతలు**

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్‌ల స్థానాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌ఛార్జిలను నియమించింది. డీవోపీటీ ఆదేశాల మేరకు తెలంగాణ నుంచి వాణిప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రాస్, ఆమ్రపాలి రిలీవ్ అయ్యారు. టూరిజంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్, విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా, మహిళా సంక్షేమశాఖ కార్యదర్శిగా టి.కె.శ్రీదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవోగా ఆర్.వి.కర్ణన్, ఆయుష్ డైరెక్టర్‌గా క్రిస్టినాకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్‌గా ఇలంబరిది, పురావస్తు శాఖ డైరెక్టర్‌గా ఎన్. శ్రీధర్, విద్యుత్ శాఖ కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా, ఆయుష్ డైరెక్టర్‌గా క్రిస్టియానా, ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా శ్రీదేవి ఇన్ ఛార్జ్‌లుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారులు కాటా ఆమ్రపాలి, రోనాల్డ్ రాస్, వాకాటి కరుణ, వాణి ప్రసాద్ తెలంగాణలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే వారు ఏపీకి వెళ్లాలంటూ డీవోపీ ఆదేశాలు జారీ చేసింది. అయితే తమను తెలంగాణలోనే కొనసాగించాలంటూ వారంతా సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. డీవోపీ ఆదేశాలు తప్పక పాటించాలంటూ సదరు ఐఏఎస్ అధికారులకు క్యాట్ స్పష్టం చేసింది. దీంతో వారంతా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా క్యాట్ ఆదేశాలను పాటించాల్సిందేనంటూ హైకోర్టు క్లియర్ చేస్తూ ఆదేశించింది. ఈ నేపథ్యంలో సదరు ఐఏఎస్ అధికారులంతా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు. దీంతో తెలంగాణలో సదరు ఐఏఎస్ అధికారులు నిర్వహిస్తున్న కీలక శాఖలకు ఇన్ ఛార్జ్‌లుగా ప్రభుత్వం నియమించింది.

# గర్భధారణ సమయంలో బొప్పాయి తినడం వల్ల అబార్షన్ అవుతుందా? వైద్యులు ఏం చెబుతున్నారు?



గర్భధారణ సమయంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. తల్లి, బిడ్డ ఇద్దరి భద్రత ముఖ్యం. చిన్న పొరపాటు కూడా తల్లి, బిడ్డపై ప్రభావం చూపుతుంది. ఈ సమయంలో ఆహారం, పానీయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడానికి ఇది కారణం. ప్రెగ్నెన్సీ సమయంలో బొప్పాయి తినకూడదని మీరు తరచుగా వినే ఉంటారు. ఇంటి పెద్దలు కూడా అలానే చెబుతుంటారు. వైద్యులు కూడా వివిధ సలహాలు ఇస్తారు. గర్భిణీ స్త్రీలు బొప్పాయి తింటే గర్భస్రావం అవుతుందని కూడా కొందరు అంటున్నారు. ఇందులో ఎంత నిజం ఉందో చెబుతారా? ఒక అధ్యయనం ప్రకారం, గర్భధారణ సమయంలో పచ్చి బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం లేదా అకాల డెలివరీ ప్రమాదాన్ని పెంచుతుందని, పండిన బొప్పాయి తినడం గర్భస్రావం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎలుకలపై చేసిన ప్రయోగం తర్వాత 2002లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో పండిన బొప్పాయిని తిన్న గర్భిణీ ఎలుకలకు గర్భస్రావం అయ్యే ప్రమాదం తక్కువగా ఉందని, అయితే పచ్చి బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం, నెలలు నిండకుండానే డెలివరీ అయ్యే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బొప్పాయిలో ఉండే ఎంజైమ్‌ల వల్ల గర్భస్థ శిశువుకు నష్టం పెరుగుతుంది. అయితే, ఇప్పటి వరకు మనుషులపై అలాంటి అధ్యయనం లేదా పరిశోధన జరగలేదు. కానీ బొప్పాయి వినియోగం పూర్తిగా ప్రయోజనకరం లేదా హానికరం అని చెప్పలేము. పచ్చి లేదా పండిన బొప్పాయిలో లేటెక్స్, పాపైన్ ఉంటాయి. ఇవి అభివృద్ధి చెందుతున్న పిండానికి హానికరం. బొప్పాయిలోని రబ్బరు పాలు గర్భాశయం సంకోచించటానికి కారణమవుతుంది. ఇది పిండానికి చాలా హానికరం. గర్భధారణ సమయంలో పండిన బొప్పాయి తినడం ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, ప్రజలు పండిన, సగం పండిన బొప్పాయి మధ్య గందరగోళానికి గురవుతారు. అటువంటి పరిస్థితిలో పిల్లకి ఎటువంటి హాని జరగకుండా ఉండటానికి ప్రజలు బొప్పాయి తినకుండా ఉంటారు. బొప్పాయిని ప్రెగ్నెన్సీ సమయంలో తినవచ్చని, పూర్తిగా పక్వానికి వచ్చి తక్కువ పరిమాణంలో తీసుకుంటేనే తినవచ్చని కొందరు ఆరోగ్య నిపుణులు అంటున్నారు. పూర్తిగా పండిన బొప్పాయి విటమిన్ సి, విటమిన్ ఇ మూలం. అలాగే ఫోలిక్ యాసిడ్‌తో పాటు ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.(గమనిక: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది.



# 6 నెలల వయస్సు వరకు పిల్లలకు నీరు తాగించకూడదు..

ఇంట్లోకి చిన్న అతిథి రాగానే.. తాతయ్యలే కాదు, ఇంట్లోని ప్రతి పెద్దాయన కూడా బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులకు సలహాలు ఇవ్వడం మొదలుపెడతారు. తల్లిదండ్రులకు వైద్యులు ఇచ్చే సలహాల్లో ఆరు నెలల శిశువులకు నీరు తాగించకూడదనేది ఒకటి. నవజాత శిశువులకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇస్తారు. వైద్యులు వారికి ఆహారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. అంతే కాదు తాగేందుకు నీళ్లు కూడా ఇవ్వడానికి వైద్యులు నిరాకరిస్తున్నారు. వేసవిలో విపరీతమైన వేడిలో, కొన్నిసార్లు తల్లులు, కుటుంబ సభ్యుల మనస్సులో ఒక ప్రశ్న ఉంటుంది. పిల్లవాడు నీరు తాగకపోతే అతనికి ఏ డీహైడ్రేషన్ సమస్య వస్తుందని. అయితే, వైద్యుల తెలిపిన వివరాల ప్రకారం, తల్లి పాలలో 80 శాతం నీరు ఉంటుంది. ఇది అవసరమైన అన్ని పోషణ, డీహైడ్రేషన్ సమస్యను తీరుస్తుంది. 6 నెలల వరకు నవజాత శిశువుకు తల్లి పాలు తప్ప మరేమీ ఇవ్వకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పేర్కొంది. నవజాత శిశువులకు నీరు ఇస్తే, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత ప్రమాదం ఉంది. ఈ స్థితిలో శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఎలక్ట్రోలైట్స్ శరీరంలోని ఖనిజాలు, రక్తం, మూత్రం, ఇతర శరీర ద్రవాలలో ఉంటాయి. సోడియం, క్లోరిన్, ఫాస్ఫేట్, పొటాషియం అన్నీ ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సరైన సమతుల్యతను నిర్వహించడం చాలా ముఖ్యం. ఇది కాకుండా, ఫార్ములా పాలు తాగే పిల్లల శరీరం కూడా నీరు లేకుండా హైడ్రేట్ గా ఉంటుంది. అందుకే కనీసం 6 నెలల తర్వాత మాత్రమే పిల్లలకు నీరు ఇవ్వాలని సూచిస్తున్నారు వైద్యులు. డైల్యూటెడ్ ఫార్ములా పాలను తినిపించడం లేదా ఎక్కువ నీరు ఇవ్వడం శిశువు ఆరోగ్యాన్ని మరింత దిగజార్చుతుందని గుర్తుంచుకోండి. సాధారణ నీటిని తాగడం వల్ల బిడ్డకు ఎలాంటి శక్తి అందదని నిపుణులు చెబుతున్నారు. ఇది



కాకుండా ఇది ఖాళీ కేలరీలను కూడా కలిగి ఉంటుంది. కనుక ఇది 6 నెలల ముందు శిశువుకు ప్రయోజనకరం కాదు. బదులుగా ఇది పిల్లల అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది.


## బాడీ మసాజ్ ఎందుకు, ఎవరికి అవసరం..? తప్పక తెలుసుకోవాలి.



వయసు యాభై దాటితే మీ దినచర్యలో బాడీ మసాజ్ కూడ చేర్చుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. 45 నుంచి 50 దాటితే శరీరం లోపల ఉండే భాగాల ఎదుగుదల ఆగిపోయి అరుగుదల క్రమంగా మొదలవుతుంది. ఫలితంగా పని సామర్థ్యం తగ్గి కాళ్ళ నొప్పులు, కీళ్ళ నొప్పులు, మోకాళ్ళ నొప్పులు, మెడ నొప్పులు, బ్యాక్ పెయిన్ వంటి రుగ్మతలు వేధిస్తుంటాయి. వీటికి చెక్ పెట్టాలంటే రెగ్యులర్ బాడీ మసాజ్ చాలా అవసరం. ఇందుకోసం మన ఇంట్లోనే రోజూ ఉదయం స్నానం చేయడానికి ఓ అరగంట ముందు 10-15 నిమిషాల పాటు మనకు మనంగా బాడీ మసాజ్ చేసుకుంటే సరిపోతుంది. బాడీ పెయిన్స్ మరీ ఎక్కువగా ఉంటే ఫిజియోథెరపీ వంటివి తప్పవు. బాడీ మసాజ్‌తో ఒళ్లు నొప్పులు రాకుండా ఉంటాయి. ముందే ఒంటి నొప్పులతో ఇబ్బంది పడుతున్నట్టయితే అవి తగ్గిపోతాయంటున్నారు. ఇంట్లోనే బాడీ మసాజ్ ఎలా చేసుకోవాలి.. ఆరోగ్య ప్రయోజనాలేంటో కూడా తెలుసుకుందాం.. ఇంట్లోనే బాడీ మసాజ్ చేసుకోడానికి కొబ్బరి నూనె లేదా బాదం నూనెను ఉదయం స్నానానికి వెళ్ళేముందు ఓ పది పదిహేను నిమిషాల పాటు ఆయిల్‌తో బాడీ మసాజ్ క్రమం తప్పకుండా చేసుకుంటే..చక్కటి ఫలితం ఉంటుంది. ఇందుకోసం కావాలంటే మంచి ఆయుర్వేద పెయిన్ రిలీఫ్ ఆయిల్ వాడినా మంచి ఫలితాలే వస్తాయి. మసాజ్ కోసం కావాల్సిన ఆయిల్ తీసుకుని మన చేతి వేళ్ళతోనే రాపిడి ప్రెషర్ తో ఒళ్ళంతా పట్టించాలి. ఓ పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. రోజూ క్రమం తప్పకుండా ఇలా చేస్తూ ఉంటే ఒళ్లు నొప్పులు మన దరి చేరవంటున్నారు. బాడీ పెయిన్స్ విషయంలో ముందే జాగ్రత్త పడటం చాలా అవసరం అంటున్నారు నిపుణులు. లేదంటే ఆ తర్వాత వైద్యం కోసం, ఫిజియోథెరపీ మెడిసిన్లు అంటూ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇలాంటి జాయింట్ పెయిన్స్, బాడీ పెయిన్స్ మరింత తీవ్రమైతే వేలకు వేలు పెట్టి ఖరీదైన సర్జరీలు, టెన్షన్లు తప్పవని నిపుణులు సూచిస్తున్నారు. ఒళ్లు నొప్పుల సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు అనేక మంది ఉన్నారు. కాబట్టి రోజూ మనం బాడీ మసాజ్ అలవాటు చేసుకుంటే.. ఎన్నో అనారోగ్య సమస్యలను రాకుండా ముందే అడ్డుకోగలం అంటున్నారు. ప్రతిరోజూ మార్నింగ్ వాక్ తరువాత రెగ్యులర్‌గా బాడీ మసాజ్ చేసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిదంటున్నారు. బాడీ మసాజ్ వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఒకటి, రెండు కాదు.. ఏకంగా 25 రకాల లాభాలు ఉన్నాయని వైద్యులు, నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బాడీ మసాజ్ వలన రక్తప్రసరణ బాగా మెరుగవుతుంది. లో బ్లడ్ ప్రెషర్ ను నియంత్రిస్తుంది. ఒత్తిడిని బాగా తగ్గిస్తుంది. మజిల్స్ టెన్షన్ ని తగ్గిస్తాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బాడీ పెయిన్స్ రాకుండా ఉంటాయి. ఆల్రెడీ బాడీ పెయిన్స్ ఉంటే తగ్గుతాయి.

## ఆ దేశంలో కొన్ని రకాల కాస్మెటిక్ ఉత్పత్తులతో తీవ్ర అనారోగ్యం.. వాటి అమ్మకం, వినియోగంపై నిషేధం..

ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కొన్ని రకాల మెడిసిన్స్ అమ్మకాలపై నిషేధం విధించింది. ముఖ్యంగా మైక్రోడెర్మాబ్రేషన్ వంటి కొన్ని కాస్మెటిక్ విధానాలకు ఉపయోగించే ముందులు లేదా కాస్మెటిక్ సర్జరీ తర్వాత నొప్పిని తగ్గించడానికి అమ్మే ఓవర్-ది-కౌంటర్ అనాల్జెసిక్ ఉత్పత్తులను ఉపయోగించవద్దని వినియోగదారులను హెచ్చరిస్తోంది. లేజర్ హెయిర్ రిమూవల్, టాటూయింగ్, చెవులు లేదా శరీరం మీద ఎక్కడైనా పియర్సింగ్ చేసినప్పుడు ఉపయోగిస్తున్న కొన్ని రకాల మందులపై నిషేధం విధించింది. అంతేకాదు ఫెడరల్ చట్టాన్ని ఉల్లంఘించి ఈ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసినందుకు ఆరు కంపెనీలకు, ఏజెన్సీలకు హెచ్చరిక లేఖలు జారీ చేసింది ప్రకారం ఈ ఉత్పత్తుల్లో కొన్ని లిడోకాయిన్ వంటి పదార్థాలను కలిగి ఉన్నాయని లేబుల్ చేయబడ్డాయి. ఇవి ఓవర్-ది-కౌంటర్ అంటే నొప్పి నివారణ ఉత్పత్తుల కోసం అనుమతించిన దానికంటే ఎక్కువ సాంద్రతలలో లిడోకాయిన్ వంటి పదార్థాలు ఉన్నట్లు తాము గుర్తించినట్లు చెప్పారు. డ్రగ్స్ కోసం కొత్త మార్కెటింగ్ కోడ్ “కొన్ని కాస్మెటిక్ చికిత్స చేసే సమయంలో ఈ ఉత్పత్తుల్లో క్రమరహిత హృదయ స్పందన, మూర్ఛ వంటి వ్యాధులకు కారకులుగా మారవచ్చు అని పేర్కొన్నారు. అంతేకాదు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కూడా కలుగుతున్నాయని తాము గుర్తించినట్లు.. ఈ ఉత్పత్తులు తీసుకుంటున్న వినియోగదారుడు తీసుకునే ఆహార పదార్థాలతో కూడా సంకర్షణ చెందుతాయి, “అని పేర్కొంది. “ఈ ఉత్పత్తులు వినియోగదారులకు ఆమోదయోగ్యంకాని నష్టాలను కలిగిస్తున్నాయని.. కనుక మార్కెట్లో వీటి అమ్మకాలపై నిషేధం విధించినట్లు జిల్ ఫర్మాన్, సెంటర్‌లో కంప్లైయన్స్ ఆఫీసర్స్ డైరెక్టర్ అన్నారు. గత దశాబ్దంలో ఇలాంటి ఉత్పత్తుల గురించి వినియోగదారులకు హెచ్చరికలు చేసినప్పటికీ, ఏజెన్సీ ఆన్‌లైన్ , రిటైల్ స్టోర్‌ల్లో అందుబాటులో ఉంచుతూ ప్రమాదకరమైన ఉత్పత్తులను అమ్మకాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. డుచెన్ మస్కులర్ డిస్ట్రోఫీకి స్టెరాయిడ్ ఉపయోగించని చికిత్సకు ఆమోదం తెలిపింది. అంతేకాదు ఈ సమస్యలను ఎలా పరిష్కరిస్తారో లేదా ఉత్పత్తులు చట్టాన్ని ఉల్లంఘించలేదని తాము భావిస్తున్నట్లు వివరిస్తూ అందుకు తగిన సమాచారాన్ని అందించాలని.. తాము ఇచ్చిన నోటీసు అందుకున్న 15 రోజులలోపు ఈ కంపెనీ యాజమాన్యం ప్రతిస్పందించాలని కంపెనీలను కోరింది. ఇప్పటికే ఉత్పత్తి చేసిన మెడిసిన్స్ ను స్వాధీనం చేసుకోవడం లేదా ఉల్లంఘించే ఉత్పత్తుల తయారీని, పంపిణీని నిలిపివేయాలని సదరు కంపెనీలను కోరుతోంది. అంతేకాదు ఇందుకు సంబంధించిన కోర్టు ఆర్డర్‌తో సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మైక్రోడెర్మాబ్రేషన్ ఉత్పత్తులనులోకి ప్రవేశించకుండా, వినియోగదారుల వద్దకు చేరకుండా ఆపడానికి ఈ కంపెనీలలో కొన్నింటిని హిట్ లిస్ట్ లో ఉంచినట్లు పేర్కొంది.



## ఉదయాన్నే పరగడుపున ఈ డ్రింక్ తాగితే అనేక వ్యాధులు పరార్.. అద్భుతమైన హోమ్ రెమిడీస్



ప్రస్తుతం చాలా మందిని అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. కొన్ని హోమ్ రెమీడిస్ పాటించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. అయితే ఉదయాన్నే కొన్ని డ్రింక్స్ తాగినట్లయితే శరీరంలోని కొన్ని సమస్యలు తొలగిపోతాయి. అల్లం వల్ల కలిగే ప్రయోజనాల గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. అన్ని వేళలా మందులు తీసుకునే బదులు, మీరు వంటగదిలోని కొన్ని వస్తువులపై ఆధారపడవచ్చు. అటువంటి పదార్థాలలో ఒకటి అల్లం. అల్లం అనేక పోషకాలతో నిండి ఉంటుంది. ఇందులో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, జింక్, కాపర్, మాంగనీస్ పుష్కలంగా ఉన్నాయి. ఇందులో క్రోమియం, విటమిన్ సి, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్ కూడా ఉన్నాయి. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడగలదు. మీరు టాన్సిల్ సమస్యలతో బాధపడుతుంటే మీకు అల్లం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. గొంతు నొప్పి నుండి టాన్సిలైటిస్ వరకు అన్నింటి నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. అల్లంలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ క్యాన్సర్ గుణాలు ఉన్నాయి. అలాగే ఇవన్నీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అల్లం రసం కూడా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో అల్లం రసం తాగడం వల్ల కూడా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అల్లం రసం మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మేలు చేస్తుంది.ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక చెంచా అల్లం రసం కలపండి. క్రమం తప్పకుండా తాగాలి. అప్పుడు తేడా మీకే అర్థమవుతుంది. మీరు రోజంతా చాలా ఉల్లాసంగా ఉండగలరు. అయితే మీరు నిద్రలేచి, ఖాళీ కడుపుతో ఈ అల్లం నీటిని తాగితే, మీరు కేవలం కొన్నింటితో బరువు తగ్గవచ్చు. అందుకే ఈరోజు నుండే అలవాటు చేసుకోండి. (నోట్: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది. వీటిని అనుసరించే ముందు వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నాము.

## డయాబెటిస్ ఎన్ని రకాలు..

### ఎలా సంభవిస్తుంది? నివారణ చర్యలు ఏమిటి?



డయాబెటిస్ చాలా సాధారణ సమస్యగా మారుతోంది. నేడు ప్రతి ఇంట్లో ఒకరు మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. భారతదేశంలో ఈ సంఖ్య చాలా వేగంగా పెరుగుతోంది. ఇప్పుడు యువత చిన్న వయస్సులోనే ఈ వ్యాధికి గురవుతున్నారు. డయాబెటిస్ అనేది చాలా తీవ్రమైన సమస్య. ఇది శరీరంలో రక్తంలో చక్కెర స్థాయి పెరుగుదల కారణంగా సంభవిస్తుంది. దానిని నియంత్రించకపోతే అది క్రమంగా శరీరంలోని ప్రతి అవయవాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రకారం, 2030 నాటికి భారతదేశంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రెట్టింపు అవుతుంది. మధుమేహం రావడానికి గల కారణాలను, దానిని నివారించే మార్గాలను తెలుసుకుందాం. మధుమేహం అంటే ఏమిటి? శరీరంలో రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరిగినప్పుడు ఈ సమస్యను డయాబెటిస్ అంటారు. వాస్తవానికి, శరీరంలోని రక్తంలో గ్లూకోజ్‌ను నియంత్రించే పని ఇన్సులిన్ ద్వారా జరుగుతుంది. ఇది ప్యాంక్రియాస్‌లో ఉత్పత్తి అవుతుంది. ప్యాంక్రియాస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి అయిన తర్వాత రక్తంలో ఉండే గ్లూకోజ్‌ను నియంత్రిస్తుంది. కానీ కొన్ని కారణాల వల్ల క్లోమం తగినంత పరిమాణంలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేకపోయినప్పుడు, శరీరంలో గ్లూకోజ్ స్థాయి పెరిగి మధుమేహం సమస్య ప్రారంభమవుతుంది. మధుమేహం రకాలు మధుమేహం ప్రధానంగా రెండు రకాలుగా విభజించబడింది: టైప్-1, టైప్-2 మధుమేహం. ప్యాంక్రియాస్‌లో ఏదైనా లోపం కారణంగా చిన్నతనం నుండి ఇన్సులిన్ ఉత్పత్తి కానప్పుడు, పిల్లవాడు టైప్-1 డయాబెటిస్‌కు గురవుతాడు. అతని శరీరం ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేకపోవటం వలన అతని జీవితాంతం ఇన్సులిన్ ఇవ్వబడుతుంది. టైప్-2 మధుమేహం మన అనారోగ్య జీవనశైలి కారణంగా వయస్సు పెరిగేకొద్దీ వస్తుంది. కానీ ఈ రోజుల్లో యువత అనారోగ్య జీవనశైలి చిన్న వయస్సులోనే టైప్-2 డయాబెటిస్‌కు కారణం అవుతోంది. టైప్ 2 డయాబెటిస్‌కు కారణాలు అనారోగ్య జీవనశైలి ఒత్తిడి బయట జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం క్రమరహిత జీవనశైలి తక్కువ శారీరక శ్రమ ఊబకాయం మధుమేహం నివారణ జీవనశైలి మెరుగుదల ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారాన్ని తీసుకోవడం ఆహారంలో ఆకుపచ్చని కూరగాయలు, సీజనల్ పండ్లను తీసుకోవడం తగినంత నీరు తాగడం ఒత్తిడిని తగ్గించండి శారీరకంగా చురుకుగా ఉండటం రోజూ అరగంట పాటు వ్యాయామం లేదా వాకింగ్ చేయడం స్థూలకాయాన్ని నియంత్రిస్తుంది కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు వంటి వ్యాధులను నివారించడం బయట జంక్, ఫాస్ట్ ఫుడ్ తక్కువగా తినండి

## బీర్ తాగితే ఒంటికి చలువ చేస్తుందా..? కిడ్నీలో రాళ్లు కరుగుతాయా?




ఎండాకాలం వస్తే మద్యం ప్రియులు బీర్లు తెగ సేవిస్తారు. అదెంటి అంటే.. బీర్ తాగితే ఒంటికి చలవు చేస్తుందని చెబుతారు. కానీ ఇది ఎంతమాత్రం కరెక్ట్ కాదంటున్నారు డాక్టర్లు. అందుకు ఎలాంటి శాస్త్రీయమైన ఆధారాలు లేవంటున్నారు. అంతేకాదు బీర్ తాగితే గుండెకు మంచిదనే ప్రచారాన్ని కూడా కొట్టి పారేస్తున్నారు. ఇక కొందరు బీర్ తాగడం వల్ల కిడ్నీల్లో రాళ్లు తగ్గుతాయని చాలామంది నమ్ముతారు. ఇది నిజం కాదని నెఫ్రోలాజిస్టులు నొక్కి చెబుతున్నారు. అయితే బీర్ తాగేవారు లావు అవుతారు అనడంలో కొంతమేర వాస్తవం ఉంది. అయితే బరువు పెరిగేందుకు ఇది మంచి పద్ధతి కాదు. ఒక గ్రాము ఆల్కాహాల్ సేవిస్తే 7 కేలరీలు శరీరానికి అందుతాయి. ఈ క్రమంలో బీర్ అధికంగా సేవిస్తే బరువు పెరుగుతారు. ఇక బీర్‌ను తలకు పట్టిస్తే.. షాంపులా వాడితే జుట్టు పెరుగుతుందన్నది మరికొందరి వాదన. జుట్టు కుదుళ్ల నుంచే బలంగా ఉండాలి. జుట్టుకు ఏదైనా రాసుకుంటే పెరుగుతుందనే దాన్ని సైన్స్ విశ్వసించదు అంటున్నారు డాక్టర్లు. ఆల్కాహాల్ కొద్ది మొత్తంలో తీసుకుంటే మంచిదని గతంలో పరిశోధనల్లో తేలింది. అయితే వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్.. జనవరిలో విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఎంత మొత్తంలో ఆల్కాహాల్ తీసుకున్నా కూడా అది ఆరోగ్యానికి చేటే అని వెల్లడించింది. ఆల్కాహాల్ సేవనం పలు రకాల క్యాన్సర్లకు కారణం అవుతుంది. అయితే బీర్ కాకుండా ఇతర రకాల ఆల్కాహాల్ తీసుకునే వారికి లివర్ 5 ఏళ్లలో దెబ్బతింటే, బీర్ తాగే వారికి 10 సంవత్సరాల్లో దెబ్బతింటుందని కొందరు డాక్టర్స్ చెబుతున్నారు.

# ఇంటి దొంగల చేతివాటం...



- పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మాయమవుతున్న విలువైన వస్తువులు
- జిల్లాలు దాటిన సామాన్లు,ట్రాక్టర్ ట్రాలీ, ఫాగింగ్ యంత్రాలు మాయం
- దొంగలకు వెన్ను దన్నుగా నిలుస్తున్న అధికార పార్టీ నాయకులు
- బాద్యులు ఎవరో తెలిసినా చర్యలుకు జంకుతున్న అధికారులు
- మరెందుకు చర్యలు తీసుకోవడం లేదు
- అడ్డుకుంటున్న నాయకులు ఎవరు...?
- అధికార పార్టీ ప్రజాప్రతినిధులా...?
- అసలు పాలక వర్గం, అధికారులు ఎంచేస్తున్నట్లు...?
- అడ్మినిస్ట్రేషన్‌పై అవగాహన లేక ఎక్కడి సమస్యలు అక్కడే వదిలేయడంతో పనుల్లో జాప్యం వల్ల ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు






**బోడుప్పల్ (ది క్రైమ్ న్యూస్):** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో వింత పరిస్థితి నెలకొంది.విలువైన వస్తువులు మాయమవుతున్నా మాకెందుకు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు ఇక్కడి అధికారులు ఫలితంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలువైన వస్తువులు ఒక్కొక్కటిగా మాయమవు తున్నాయి. ట్రాక్టర్ ఇంజన్లు కనబడకుండా పోవడంతో పాటు ట్రాలీలయితే ఏకంగా వేరే జిల్లాలో దర్శనమవడం పెద్ద చర్చనీయంశంగా మారింది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది చేతి వాటంతో ఏకంగా ట్రాక్టర్ ట్రాలీ మాయమై జిల్లాలు దాటించి అమ్ముకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుధ్య విభాగంలో దోమల ఫాగింగ్ యంత్రాల లెక్కలలో కూడా తేడా ఉందని విశ్వాసనీయమైన సమాచారం!..సిబ్బందికి అందించే సబ్బులు, నూనెలు వంటి చిన్న వస్తువులలో చేతివాటం ఎంతో...? పెద్ద స్థాయిలో అధికారి అండ లేనిదే ఇది సాధ్యమ అని ప్రజల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరు చేసారో తెలిసినా రికవరీ చేయని వైనం...చర్యలు తీసుకోవ టానికి జంకుతున్న కార్పొరేషన్ అధికారులు,కారణం అధికార పార్టీ ప్రజాప్రతినిధులా...? మరెందుకు చర్యలు తీసుకోవడం లేదు... అడ్డుకుంటున్న నాయకులు ఎవరు...? అసలు పాలక వర్గం, అధికారులు ఎంచేస్తున్నట్లు...? అడ్మినిస్ట్రేషన్ పై అవగాహన లేక ఎక్కడి సమస్యలు అక్కడే వదిలేయడంతో... పనుల్లో జాప్యం వల్ల ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ పాలక వర్గం పనుల, విధుల నిర్వహణపై దృష్టి పెట్టాలని, గతంలో ఇక్కడ పనిచేసిన సానిటేషన్ ఇన్స్పెక్టర్ బిల్లుల చెల్లింపులో లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారుల అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే అది పునరావృత్తం కాకుండా ప్రస్తుతం కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని బాద్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్‌ని కలసి డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు, బాలరాజు, వెంకట్, యసారం శ్రీనివాస్, జగన్ రెడ్డి, మల్లం వెంకటేష్, శివరాజు, నాయకులు అక్కల శ్రీను, నాగరాజు, తిరుమలేష్, సోమేశ్, మురళి, కిరణ్ నాయక్, రాధాకృష్ణ, సురేష్, బాలరెడ్డి, రమేష్, పాషా, నర్సయ్య, రామకృష్ణ, సురేందర్ రెడ్డి, అశోక్, సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ శివాంజనేయ ఆలయ నూతన

# మహిళా కమిటీ ఎన్నిక

## నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన సింగిరెడ్డి, పద్మారెడ్డి, కొత్త కిషోర్ గౌడ్



**బోడుప్పల్ (ది క్రైమ్ న్యూస్):** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్ఐఎన్ కాలనీ శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయ నూతన మహిళా కమిటీ నియామకం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి,మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్‌లు నూతన మహిళా కమిటీ సభ్యులను ఘనంగా



సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఆలయ అభివృద్ధిలో మహిళలు ప్రధాన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయ మహిళా కమిటీ చైర్మన్ దొంతిరి రాధిక,వైస్ చైర్మన్ దుగ్యాల లక్ష్మి,ప్రధాన కార్యదర్శి కావడపు మాధవి, కోశాధికారి గుణ గంటి మంజుల,సహ కోశాధికారి పల్లె స్వప్న,సలహాదారులు గడ్డం చంద్రకళ,గంటోజు అమృత, సింగిరెడ్డి గీత, సింగిరెడ్డి హారిక,పామనుగుల్ల శ్వేత,ఇతర మహిళలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# బోడుప్పల్ మేయర్ కు దసర శుభాకాంక్షలు తెలిపిన గౌతమ్ నగర్ కాలనీ నూతన కమిటీ

## అద్యక్ష, ప్రదాన కార్యదర్శులతో పాటు కార్యవర్గాన్ని శాలవాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్

**బోడుప్పల్ (ది క్రైమ్ న్యూస్):** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని గౌతమ్ నగర్ కాలనీకి ఇటీవల నూతన కమిటీని ఎన్నుకున్నారు.దసర పండగ పురస్కరించుకుని బుధవారం నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్,కార్పొరేటర్,కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు పోగుల నర్సింహ్మారెడ్డి,నాయకులు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్,దానగళ్ల యాదగిరిని కలిసి దసర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన అద్యక్ష,ప్రదాన కార్యదర్శులతో పాటు కార్యవర్గాన్ని మేయర్ శాలవాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ కాలనీ అద్యక్షులు బి.సారయ్య,ప్రదాన కార్యదర్శి ఇ.ముత్యాలు, సహాయ కార్యదర్శి పి.బిక్షపతి, పి.మహేష్, కోశాదికారి బి.వెంకటేష్,ముఖ్య సలహాదారులు ఎం.డి గఫూర్, యూత్ అద్యక్షులు ఎం.శివకుమార్,ప్రదాన కార్యదర్శి కిరణ్ కుమార్, నాయకులు రహీం కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఓసిపి-టు ఉపరితల గనిని సందర్శించిన డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్, పా వెంకటేశ్వర రెడ్డి



**రామగిరి(ది క్రైమ్ న్యూస్):** రామగుండం-త్రీ ఏరియా లోని ఓసిపి-టు ఉపరితల గనిని బుధవారం డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ పా .వెంకటేశ్వర రెడ్డి సందర్శించారు. వారు వ్యూ పాయింట్ నుండి క్వారీలో నడుస్తున్న పనులను పరిశీలించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించుటకు తీసుకుంటున్న భద్రత చర్యలు, ప్రణాళికల వివరాలను ఆర్.జి-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు డైరెక్టర్ కి వివరించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఓ.బి (మట్టి వెలికితీత) కాంట్రాక్టు కంపెనీవారు రోజువారి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని, నీరు నిలవకుండా తగు చర్యలు చేపట్టాలని,బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని, భద్రతతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా సాధించడానికి ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు.వారితో పాటు ఇంచార్జ్ ప్రాజెక్ట్ అధికారి జె.రాజశేఖర్,ఎస్టేట్స్ అధికారి కె.ఐలయ్య, డిప్యూటీ మేనేజర్ కోల శ్రీనివాస్, సర్వే అధికారులు తోపాటు ఇతర అధికారులు ఉన్నారు.

# మార్కెట్

## ముంబై 'రియల్' కింగ్‌లు!

దేశంలోనే అత్యంత ఖరీదైన నగరమేది అంటే ముంబై అని టక్కున చెప్పేస్తారు. దేశ ఆర్థిక రాజధానిగా పిలిచే ఈ నగరంలో భూమి కొరత ఎక్కువగా ఉండటమే ధరలు ఆ స్థాయిలో ఉండటానికి కారణమని చెబుతారు. ఇంత ఖరీదైన నగరంలో స్లమ్ రిహాబిలిటేషన్ అథారిటీ (%ూ=ూ%) నిర్వహించిన ఒక సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. మహారాష్ట్రలోని మురికివాడల పునరాభివృద్ధి ప్రాజెక్టులను నియంత్రించే స్లమ్ రిహాబిలిటేషన్ అథారిటీ 2015 సర్వే ప్రకారం.. ముంబై రియల్ ఎస్టేట్ మార్కెట్ లక్ష ఎకరాలకుపైగా విస్తీర్ణంలో విస్తరించింది. ఇందులో నివాసయోగ్యమైన భూమి భాగం సుమారు 34 వేల ఎకరాలు.ఇందులో దాదాపు 20 శాతం భూమి తొమ్మిది మంది ల్యాండ్‌లార్డ్‌ల చేతిలోనే ఉంది. వీరిలో ప్రయివేటు సంస్థలు, వ్యాపార కుటుంబాలు, ట్రస్టులు ఉన్నాయి.

**అతిపెద్ద ల్యాండ్‌లార్డ్ గోద్రెజ్...** స్లమ్ రిహాబిలిటేషన్ అథారిటీ సర్వే ప్రకారం.. ముంబైలోని విఖ్రోలి ప్రాంతంలో గోద్రెజ్ కుటుంబానికి 3,400 ఎకరాలకు పైగా భూమి ఉంది. విఖ్రోలిలోని ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే పక్కనే ఈ భూమి ఉంది. అయితే ఈ భూమిపై కొన్ని పరిమితులు ఉన్నాయి. ఈ పరిమితులతో కూడిన భూమి విలువను పరిగణనలోకి తీసుకుంటే, అది దాదాపు రూ.30,000 కోట్లు ఉండవచ్చు. పరిమితులను లేకుండా అయితే రూ.50,000 కోట్లకు పైగా ఉంటుందని రియల్ ఎస్టేట్ ఎక్స్‌పర్ట్‌లు చెబుతున్నారు. గోద్రెజ్ తర్వాత ఎఫ్ఈ దిన్షా ట్రస్ట్ రెండవ స్థానంలో ఉంది. మలాడ్, పరిసర ప్రాంతాల్లో ఇది దాదాపు 683 ఎకరాల భూమిని కలిగి ఉంది. ఎఫ్ఈ దిన్షా ఒక పార్సీ న్యాయవాది, ఫైనాన్సర్. 1936లో మరణించారు. ఈ భూమిని క్రమంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటూ వస్తోంది. ఇక మూడవ స్థానంలో ప్రతాప్‌సింగ్ వల్లభదాస్ సూర్జీ కుటుంబం ఉంది. ఈ కుటుంబానికి ముంబైలోని భాండూప్, దాని పరిసరాల్లో సుమారు 647 ఎకరాల భూమి ఉంది. నాల్గవ స్థానంలో ఉన్న జీజీబోయ్ అర్దేషిర్ ట్రస్ట్‌కు ముంబైలోని చెంబూర్‌లో 508 ఎకరాల భూమి ఉంది. ఆ తర్వాత ఏహెచ్ వాడియా ట్రస్ట్‌కు కుర్లాలో 361 ఎకరాలు ఉంది. ఇందులో చాలామటుకు ఆక్రమణకు గురైంది. సర్వే ప్రకారం ముంబైలోని వివిధ ప్రాంతాల్లో బైరామ్జీ జీజీబోయ్ ట్రస్ట్ 269 ఎకరాల భూమిని కలిగి ఉంది. ఇవే కాకుండా, సర్ ముహమ్మద్ యూసుఫ్ ఖోట్ ట్రస్ట్, వీకే లాల్ కుటుంబం వంటి ఇతర ప్రైవేట్ భూస్వాములకు కూడా ముంబైలోని కంజుర్‌మార్గ్, కండివాలి ప్రాంతంలో భారీగా భూములు ఉన్నాయి.



# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుక..



దీపావళి సందర్భంగా ఉద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పబోతున్నట్లు తెలిసింది. డీఏను (కరవు భత్యం) 3 శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. బుధవారం ఉదయం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు ఆమోదించినట్లు తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ మధ్యాహ్నం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేంద్ర కేబినెట్ నిర్ణయంతో కోటి మందికిపైగా ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. కాగా కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. కేంద్రం డీఏను సరవించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది. పెరుగుతున్న ధరలకు పరిహారంగా ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ అందజేస్తారు. ఈ ఏడాది మార్చిలో కూడా ఉద్యోగుల డీఏను, పెన్షనర్ల డీఆర్‌ను కేంద్రం 4 శాతం పెంచిన విషయం తెలిసిందే.

# ఫ్లిప్‌కార్టులో ఎలక్ట్రిక్ స్కూటర్..

## ధర కేవలం రూ.43,749కే – ఒక్కసారి ఛార్జ్‌తో 100 కి.మీ

ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ లెక్ట్రిక్స్ ఈవీ తన ఎలక్ట్రిక్ స్కూటర్‌పై భారీ తగ్గింపులను అందిస్తోంది. కంపెనీకి చెందిన ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ఇప్పటి వరకు అతి తక్కువ ధరకే అందుబాటులో ఉంది. కంపెనీ ఒక పండుగ ఆఫర్‌ను విడుదల చేసింది. దాని హై స్పీడ్ లెక్ట్రిక్స్ ఈవీని రూ. 50,000 కంటే తక్కువ ధరకు అందించడానికి ఆఫర్ చేసింది. అయితే, వినియోగదారులు ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్‌లో ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను పొందవచ్చు. మీరు ఈ-కామర్స్ వెబ్‌సైట్ ఫ్లిప్‌కార్ట్‌లో కేవలం రూ. 43,749కి లెక్ట్రిక్స్ ఎలక్ట్రిక్ హై స్పీడ్‌ను కొనుగోలు చేయవచ్చు. దీని కోసం కస్టమర్ బ్యాటరీని సేవగా చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్‌లో కేవలం రూ.43749కే అందుబాటులో ఉంది.

**ఒక్కసారి ఛార్జ్ చేస్తే 100 కి.మీ...** ఈ ఆఫర్ పరిమిత కాలం మాత్రమేనని, ఫ్లిప్‌కార్ట్‌లో మాత్రమే అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. మీరు మొత్తం పరిశ్రమలో దీని కంటే తక్కువ ధరలో ఎలక్ట్రిక్ స్కూటర్‌ని పొందలేరు. బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ ద్వారా కస్టమర్లకు ఉపయోగకరంగా ఉంటుందని కంపెనీ తెలిపింది. లెక్ట్రిక్స్ ఈవీ హై స్పీడ్ స్కూటర్ స్పెసిఫికేషన్ల గురించి మాట్లాడితే, ఈ స్కూటర్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే 100 కిమీల రేంజ్‌ను అందిస్తుంది. దీని గరిష్ట వేగం 50 కిమీ. ఇది కాకుండా ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ కూడా 3-4 గంటల్లో పూర్తిగా ఛార్జ్ అవుతుంది. అదే సమయంలో దానిపై జీవితకాల బ్యాటరీ వారంటీ అందుబాటులో ఉంది.



**ఫ్లిప్‌కార్ట్‌లో ఎలక్ట్రిక్ స్కూటర్లు అందుబాటులో...** కంపెనీకి చెందిన అనేక ఎలక్ట్రిక్ స్కూటర్లు ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉన్నాయి. వాటి ధర రూ. 49,999 అయినప్పటికీ, వాటిని కొనుగోలు చేయడానికి అనేక బ్యాంక్ ఆఫర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. ఆ తర్వాత కస్టమర్లు ఈ స్కూటర్‌ను రూ. 43749కి కూడా పొందవచ్చు. వినియోగదారులు బ్యాటరీతో కూడిన ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను కొనుగోలు చేయాలనుకుంటే, వారు దాని అసలు ధరను చెల్లించాలి. మీరు బ్యాటరీ లేకుండా స్కూటర్ కొనాలనుకుంటే, బ్యాటరీని వేరుగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత దాని ధర 50,000 కి దగ్గరగా ఉంటుంది.

# ఐటీ, ఆటో షేర్ల అమ్మకాలు..

## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు మరో సారి నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లోని ప్రతికూల పవనాలు.. ఐటీ, ఆటో షేర్లలో అమ్మకాల కారణంగా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81,646.60 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలయ్యాయి. మళ్లీ ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 81,932.15 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. 81,358.26 కనిష్ఠానికి చేరుకున్నది. చివరకు 318.76 పాయింట్ల నష్టంతో 81,501.36 వద్ద ముగిసింది. నిఫ్టీ 86.05 పాయింట్ల నష్టంతో 24,971.30 వద్ద ముగిసింది. 30 షేర్ల సెన్సెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, ఐటీసీ, టైటాన్ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఏషియన్ పెయింట్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాభపడ్డాయి. సెక్టార్లలో, ఆయిల్, గ్యాస్, రియల్టీ, టెలికాం సూచీలు లాభాల్లో ముగియగా.. ఆటో, ఐటీ, ఫార్మా, మీడియా 0.5శాతం నుంచి ఒకశాతం వరకు పతనమయ్యాయి.

## రీగల్ ఎడిషన్‌గా బాలెనో..



దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ..ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని నూతన ఫీచర్లతో రూపొందించిన బాలెనోను మార్కెట్‌కు పరిచయం చేసింది. ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో ఇప్పటికే కీలకపాత్ర పోషిస్తున్న బాలెనోను లిమిటెడ్ ఎడిషన్‌గా అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు రూ.6.66 లక్షల నుంచి రూ.9.83 లక్షల ధరల శ్రేణిలో లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ ప్రత్యేక ఎడిషన్‌లో నూతన గ్రిల్ అప్పర్ గార్నిష్, ఫాగ్ ల్యాంప్, నూతన సీట్ కవర్లు, తొమ్మిది ఇంచుల స్మార్ట్‌ప్లే ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రాం వంటి 40 అడ్వాన్స్‌డ్ స్మార్ట్ ఫీచర్స్‌తో తయారు చేసింది.

# వరల్డ్ రికార్డ్‌పై కన్నేసిన రోహిత్ శర్మ

సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన టీమిండియా.. మరో ఆసక్తికర పోరుకు సన్నదమైంది. న్యూజిలాండ్‌తో బుధవారం(అక్టోబర్) నుంచి ప్రారంభం కానున్న మూడు టెస్ట్‌ల సిరీస్‌లో అమీతుమీ తేల్చుకోనుంది. బెంగళూరు వేదికగా జరిగే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షంతో ఇంకా మ్యాచ్ ప్రారంభం కాలేదు. మరోవైపు ఈ సిరీస్ గెలిచి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకోవడంతో పాటు సొంతగడ్డపై తమ జైత్రయాత్రను కొనసాగించాలని టీమిండియా భావిస్తోంది. సొంతగడ్డపై భారత్ ఇప్పటి వరకు వరుసగా 17 టెస్ట్ సిరీస్‌లు గెలిచింది. 18వ సిరీస్ విజయంపై కన్నేసింది. ఇక ఈ సిరీస్ ప్రారంభానికి ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను ఓ అరుదైన ఘనత ఊరిస్తోంది. ఈ మూడు టెస్ట్‌ల సిరీస్‌లో రోహిత్.. 258 పరుగులు చేస్తే.. డబ్ల్యూటీసీ 2023-25 సైకిల్‌లో 1000 పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్‌గా హిట్ మ్యాన్ నిలుస్తాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 742 పరుగులతో ఉన్నాడు. డబ్ల్యూటీసీలో రెండు సార్లు 1000కిపైగా పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్‌గా కూడా రికార్డ్ అందుకుంటాడు. డబ్ల్యూటీసీ 2019-2021 ఎడిషన్‌లో రోహిత్ శర్మ 1094 పరుగులు చేశాడు. ప్రస్తుతం టెస్ట్‌ల్లో 87 సిక్స్‌లతో కొనసాగుతున్న రోహిత్ శర్మ.. న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో మరో



13 సిక్స్‌లు బాదితే.. 100 సిక్స్‌లు కొట్టిన ఆటగాడిగా నిలుస్తాడు. ఓవరాల్‌గా ఈ ఘనతను అందుకున్న నాలుగో ప్లేయర్‌గా చరిత్రకెక్కుతాడు. బెన్ స్టోక్స్, బ్రెండన్ మెక్‌కల్లమ్, ఆడమ్ గిల్‌క్రిస్ట్ టెస్ట్‌ల్లో 100 ప్లస్ సిక్స్‌లు బాదారు. మరో ఐదు సిక్స్‌లు బాదితే భారత్ తరఫున టెస్ట్‌ల్లో అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గా నిలుస్తాడు. తద్వారా వీరేంద్ర సెహ్వాగ్ రికార్డ్‌ను బద్దలు కొడుతాడు. సెహ్వాగ్ 91 సిక్స్‌లతో టెస్ట్ ఫార్మాట్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. డబ్ల్యూటీసీ చరిత్రలో రోహిత్ శర్మ కెప్టెన్‌గా 12 విజయాలు అందించాడు. విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా డబ్ల్యూటీసీలో 14 విజయాలు అందించాడు. న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌ను టీమిండియా వైట్ వాష్ చేస్తే.. రోహిత్ శర్మ.. కోహ్లీ రికార్డ్‌ను అధిగమిస్తాడు.

# భారత్‌తో సిరీస్‌కు కొత్త అస్త్రాలతో సిద్ధమవుతున్న ఆస్ట్రేలియా!

ఎనిమిదేళ్లుగా దూరమవుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని ఈసారి దక్కించుకోవాలని ఆస్ట్రేలియా పట్టుదలతో సిద్ధమవుతోంది. సొంతగడ్డపై భారత్‌ను ఎదుర్కోవడానికి తమ అస్త్రాలను సిద్ధం చేస్తోంది. కంగారూల గడ్డపై గత రెండు బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లను కైవసం చేసుకున్న భారత్ ఈ సారి కూడా ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. 2016 నుంచి ఈ ట్రోఫీని టీమిండియానే వరుసగా గెలుస్తున్న విషయం తెలిసిందే. 2016/17, 2022/23లో భారత్, 2018/19, 2020/21లో ఆస్ట్రేలియా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ఆతిథ్యం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈసారి సిరీస్ గెలిచి పరువు కాపాడుకోవాలని ఆస్ట్రేలియా భావిస్తోంది. అయితే అనూహ్యంగా ఆసీస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ సిరీస్‌కు దూరమయ్యాడు. వెన్ను గాయానికి శస్త్రచికిత్స చేయించుకోనుండటంతో కనీసం 6 నెలల పాటు గ్రీన్ ఆటకు దూరంకానున్నాడు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా కొత్త అస్త్రాలను సిద్ధం చేస్తోంది. ప్రధాన ఆల్‌రౌండర్ పాత్రను మిచెల్ మార్ష్‌కు అందివ్వనుంది. ఓపెనర్ స్థానం నుంచి స్టీవ్ స్మిత్‌ను తిరిగి నాలుగో స్థానానికి తీసుకువస్తుంది. కామెరూన్ గ్రీన్ స్థానంలో స్పెషలిస్ట్ ఓపెనర్‌ను ఎంపిక చేయాలని నిర్ణయించుకుంది. హామ్‌స్ట్రింగ్ సమస్యతో మిచెల్ మార్ష్ గత ఐపీఎల్‌లో నుంచి పెద్దగా బౌలింగ్ చేయట్లేదు. అప్పటినుంచి కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే మిచెల్ మార్ష్ బౌలింగ్ చేశాడు. కానీ గ్రీన్ దూరమవ్వడంతో తిరిగి బౌలింగ్ చేయనున్నాడు. షెఫీల్డ్ షీల్డ్‌లో వెస్ట్రన్ ఆస్ట్రేలియా తరఫున మార్ష్ ఇటీవల స్పెషలిస్ట్ బ్యాటర్‌గానే బరిలోకి దిగాడు. కానీ జట్టు కోసం శారీరకంగా సిద్ధమవుతున్నాడు.



మరోవైపు డేవిడ్ వార్నర్ రిటైర్మెంట్ ఇవ్వడంతో స్టీవ్ స్మిత్ ఓపెనర్‌గా అవతారమెత్తిన సంగతి తెలిసిందే.అయితే ఓపెనర్‌గా స్మిత్ అంచనాలను అందుకోలేకపోయాడు. అంతేగాక మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేసే గ్రీన్ దూరమవ్వడంతో, అతని స్థానాన్ని భర్తీ చేయడానికి స్మిత్ తిరిగి నాలుగో స్థానానికి వస్తున్నాడు. కాగా, నవంబర్ 22 నుంచి భారత్-ఆస్ట్రేలియా అయిదు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. పెర్త్ వేదికగా తొలి టెస్టు జరగనుంది. అలాగే అడిలైడ్ వేదికగా పింక్ బాల్ టెస్టు డిసెంబర్ 6-10 వరకు, బ్రిస్బేన్ వేదికగా మూడో టెస్టు డిసెంబర్ 14-18 వరకు, మెల్‌బోర్న్ వేదికగా బాక్సింగ్ డే టెస్టు డిసెంబర్ 26-30 వరకు, సిడ్నీ వేదికగా జనవరి 3 నుంచి 7 వరకు ఆఖరి టెస్టు జరగనుంది.

# గంభీర్-రోహిత్ బంపరాఫర్ ఇచ్చారు: సంజు శాంసన్

బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో టీమిండియా వికెట్ కీపర్ సంజు శాంసన్ సెంచరీ సాధించాడు. యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతి ఇవ్వడంతో ఓపెనర్‌గా బరిలోకి దిగిన శాంసన్ అదరగొట్టాడు. అయితే వైట్ బాల్ క్రికెట్ వరకే తాను పరిమితం కానని, టెస్టు క్రికెట్‌లోనూ భారత్ తరఫున సత్తాచాటాలని భావిస్తున్నట్లు సంజు శాంసన్ తెలిపాడు. కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ గౌతమ్ గంభీర్ తనని భారత టెస్టు జట్టులోకి పరిగణిస్తున్నారని శాంసన్ చెప్పాడు.ఈ విషయాన్ని దులీప్ ట్రోఫీకి ముందే తనకి తెలియజేశారని, రంజీ ట్రోఫీ మ్యాచ్‌లను ఎక్కువగా ఆడమని సూచించారని తెలిపాడు. టీ20 వరల్డ్ కప్‌కు ఎంపికైన సంజు శాంసన్ ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాలేదు. అనంతరం జింబాబ్వే సిరీస్ ఆడిన శాంసన్ అర్ధశతకంతో మెరిశాడు. అయితే ఆ తర్వాత శ్రీలంక పర్యటనలో టీ20 సిరీస్‌లో రెండు మ్యాచ్‌ల్లో తుదిజట్టులో శాంసన్ అవకాశం దక్కించకున్నాడు. కానీ రెండు మ్యాచ్‌ల్లోనూ డకౌటయ్యాడు. అనంతరం దులీప్ ట్రోఫీకి ఎంపికైన శాంసన్ సెంచరీతో మెరిశాడు. అదే జోరును బంగ్లాదేశ్ టీ20 సిరీస్‌లోనూ ప్రదర్శించాడు. " నాకు రెడ్ బాల్ క్రికెట్‌లో సత్తాచాటే నైపుణ్యం ఉంది. భారత్ తరఫున టెస్టుల ఆడటం నా కోరిక. టెస్టు క్రికెట్‌కు నన్ను పరిగణిస్తున్నట్లు టీమిండియా మేనేజ్మెంట్ దులీప్ ట్రోఫీకి ముందే తెలియజేసింది. రంజీ ట్రోఫీ మ్యాచ్‌లను సీరియస్‌గా ఆడమని సూచించింది" "ప్రస్తుతం నా సన్నద్ధత బాగుంది. శ్రీలంక సిరీస్ అనంతరం రాజస్థాన్ రాయల్స్ అకాడమీలో రాహుల్ ద్రవిడ్ సర్, జుబిన్ భారుచా సర్‌లతో నా ఆటపై శ్రమించాను. దులీప్ ట్రోఫీలో సాధించిన సెంచరీతో నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది" అని సంజు శాంసన్ పేర్కొన్నాడు. కాగా, 29 ఏళ్ల సంజు శాంసన్ రంజీ ట్రోఫీలో కేరళ జట్టు తరఫున బరిలోకి దిగనున్నాడు. శుక్రవారం నుంచి కర్ణాటకతో ప్రారంభం కానున్న రెండో మ్యాచ్‌కు శాంసన్ అందుబాటులోకి వచ్చాడు.



# స్పోర్ట్స్

## ఇషాన్ కిషన్ రీఎంట్రీ..



బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన టీమిండియా.. వచ్చే నెలలో సౌతాఫ్రికాతో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. నవంబర్ 8 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుండగా.. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని ద్వితీయ శ్రేణి జట్టుతో టీమిండియా బరిలోకి దిగనుంది. ఛాంపియన్స్ ట్రోఫీ 2025, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్స్ షిప్ టోర్నీల నేపథ్యంలో ప్రధాన ఆటగాళ్లంతా టీ20 ఫార్మాట్‌కు దూరంగా ఉండనున్నారు. ఈ క్రమంలోనే సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌కు వెటరన్ ప్లేయర్లు పునరాగమనం చేసే అవకాశం ఉంది. స్టార్ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్‌తో పాటు ఇషాన్ కిషన్ తిరిగి భారత జట్టులో చోటు దక్కించుకోనున్నారు. ఇషాన్ కిషన్‌ను స్పెషలిస్ట్ ఓపెనర్‌గా ఎంచుకునే ఛాన్స్ ఉంది. వికెట్ కీపర్లుగా సంజూ శాంసన్, జితేశ్ శర్మలు ఎంపికవ్వచ్చు. జితేశ్ శర్మను పక్కన పెడితే తిలక్ వర్మకు చోటు దక్కుతుంది. బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో సత్తా చాటిన నితీష్ కుమార్ రెడ్డి తన స్థానాన్ని నిలబెట్టుకోనున్నాడు. రియాన్ పరాగ్, రింకూ సింగ్‌లు కూడా జట్టులో కొనసాగనున్నారు. స్పిన్నర్లుగా వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అక్షర్ పటేల్ ఎంపికయ్యే ఛాన్స్ ఉంది. అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్‌లు పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైతే అతను ఈ సిరీస్‌కు దూరంగా ఉండనున్నాడు. బౌలింగ్ ఆప్షన్స్ ఎక్కువగా ఉండేలా ప్రణాళికలు రచిస్తున్న టీమిండియా మేనేజ్‌మెంట్.. బౌలింగ్ సామర్థ్యం కలిగిన బ్యాటర్లకే ప్రాధాన్యత ఇస్తోంది. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే కూడా ఈ సిరీస్‌కు ఎంపికయ్యే ఛాన్స్ ఉంది. సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌కు ఎంపికయ్యే భారత జట్టు(అంచనా): సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(కీపర్), రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, ఇషాన్ కిషన్, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, రుతురాజ్ గైక్వాడ్/తిలక్ వర్మ, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, జితేశ్ శర్మ(కీపర్), అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్ తుది జట్టు(అంచనా): ఇషాన్ కిషన్(కీపర్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, సూర్యకుమార్ యాదవ్, రియాన్ పరాగ్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్/హర్షిత్ రాణా

## హర్మన్‌ప్రీత్‌పై వేటు.. స్పందించిన బీసీసీఐ వర్గాలు!




మహిళల టీ20 ప్రపంచకప్ 2024లో భారత్ పేలవ ప్రదర్శన చేసింది. లీగ్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌లలో రెండు మాత్రమే గెలిచి.. ఇంటిదారి పట్టింది. ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ హాఫ్ సెంచరీ చేసినా.. ఆమె నిదానంగా ఆడటం వల్లే ఓటమి ఎదురైందని సోషల్ మీడియాలో ట్రోల్స్ వచ్చాయి. భారత్ లీగ్ దశ నుంచే నిష్క్రమించడంతో.. ఇప్పుడు ఆమె కెప్టెన్సీకే ప్రమాదం పొంచి ఉందనే వార్తలు వస్తున్నాయి. ఈ రూమర్లపై బీసీసీఐ వర్గాలు స్పందించాయి. 'టీ20 ప్రపంచకప్ 2024లో భారత్ ప్రదర్శన అస్సలు బాలేదు. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీపై మాజీల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త కెప్టెన్‌ను నియమించాలా? లేదా హర్మన్‌ను కొనసాగించాలా? అనేది ఇప్పుడే చెప్పలేం. జట్టుకు కొత్త నాయకత్వం అవసరమైతే.. అందుకు తగ్గట్టు నిర్ణయం తీసుకొనేందుకు బీసీసీఐ వెనకడుగు వేయదు. జట్టుకు కావాల్సింది అందించేందుకు బోర్డు సిద్ధంగా ఉంటుంది. హర్మన్ ఇప్పటికీ జట్టులో కీలక సభ్యురాలు. జట్టులో మార్పులు చేయాల్సిన సమయం ఆసన్నమైందని బీసీసీఐ భావిస్తోంది. కోచ్, సెలక్షన్ కమిటీతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటాం' అని బీసీసీఐ వర్గాలు ఓ జాతీయ మీడియాకు తెలిపాయి.త్వరలోనే ప్రధాన కోచ్ అమోల్ ముజుందార్, సెలక్షన్ కమిటీతో బీసీసీఐ మేనేజ్‌మెంట్ సమావేశం కానుందట. హర్మన్‌ను సారథిగా కొనసాగించాలా? వద్దా? అనేది అప్పుడే తేలనుంది. ఒకవేళ ఆమెను తప్పిస్తే.. కెప్టెన్సీ రేసులో ఇద్దరు ముందువరుసలో ఉన్నారు. వైస్ కెప్టెన్ స్మృతీ మంధానతో పాటు బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ రేసులో ఉన్నారు. మంధాన కంటే రోడ్రిగ్స్‌కు పగ్గాలు అప్పగించడం మంచిదని మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ అంటున్నారు.




## పోస్టర్లు, టీజర్, ట్రైలర్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేశాయి

మున్నా కాశి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన సినిమా 'సి 202'. గోవా బ్యూటీ షారోన్ రియా ఫెర్నాండెజ్ హీరోయిన్‌గా నటించారు. మైటీ ఒక్ పిక్చర్స్ బ్యానర్‌పై మనోహరి కేఏ ఈ సినిమాని నిర్మించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్, ట్రైలర్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేశాయి. ట్రైలర్‌లో ఒక్క డైలాగ్ కూడా లేకుండా.. కేవలం నటీనటుల హావభావాలతోనే అందరినీ ఆకట్టుకున్నారు. సి 202 చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని 'ఏ' సర్టిఫికెట్‌ను పొందింది. ఇటీవలే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తవ్వడంతో చిత్ర యూనిట్ రిలీజ్ డేట్ ప్రకటించారు. అక్టోబర్ 25న విడుదల చేస్తునట్లు ఓ పోస్టర్ వదిలారు. ట్రైలర్‌లో ఒక్క డైలాగ్ కూడా లేకుండా సీన్స్, సౌండ్ ఎఫెక్ట్స్ తోనే భయపెట్టిన ఈ సినిమా.. మరి థియేటర్‌లో ఏ రేంజ్‌లో భయపెడుతుందో చూడాలి. డిఫరెంట్ కాన్సెప్ట్ కథతో వస్తున్న ఈ సినిమాలో తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, సత్య ప్రకాష్, షఫీ, చిత్రం శీను, వై విజయ, అర్చన ప్రధాన పాత్రల్లో నటించారు.





## రజినీ మీదా నెగెటివ్ ట్రెండా?

సూపర్ స్టార్ రజినీకాంత్‌ను ఆయన అభిమానులు ఎంతగా అభిమానిస్తారో, ఆరాధిస్తారో తెలిసిందే. ఐతే ఎంత ఎదిగినా ఒదిగి ఉండడమే కాక..వివాదాలకు దూరంగా ఉంటూ.. సున్నితంగా మాట్లాడే రజినీని ఇతర హీరోల అభిమానులు కూడా ఎంతో గౌరవిస్తుంటారు. ఆయన్ని నో నెగెటివిటీ స్టార్‌గా చెప్పొచ్చు. కానీ సోషల్ మీడియా పుణ్యమా అని అలాంటి హీరో మీద కూడా అదే పనిగా నెగెటివ్ ట్రెండ్ చేసే పరిస్థితులు వచ్చేశాయి. సూపర్ స్టార్ తాజాగా వేట్టయన్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. జై భీమ్ లాంటి గొప్ప సినిమా తీసిన టీజీ జ్ఞానవేల్ రూపొందించిన చిత్రమిది. జై భీమ్ తరహాలోనే మరోసారి సామాజిక అంశాలతో కథను అల్లుకున్నాడు జ్ఞానవేల్. రజినీ కూడా తన ఇమేజ్‌ను పక్కన పెట్టి విభిన్నమైన ప్రయత్నం చేశాడు. ఐతే సినిమాకు యావరేజ్ టాక్ వచ్చింది. కానీ ఇది తీసి పడేయదగ్గ మూవీ అయితే కాదు. ఐతే సినిమా నచ్చకపోతే బాలేదు అని చెప్పాలి కానీ.. అదే పనిగా సోషల్ మీడియాలో దాన్ని ట్రోల్ చేయడం, నెగెటివ్ ట్రెండ్ చేయడమే విడ్డూరం. వేట్టయన్ సినిమా చూసి తాము మానసిక ప్రశాంతత కోల్పోయామని.. టికెట్ డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఒక రోజంతా నెగెటివ్ ట్రెండ్ చేశారు. అనే హ్యాష్ ట్యాగ్ నిన్న ఇండియా లెవెల్లో ట్రెండ్ అయింది. ఈ హ్యాష్ ట్యాగ్ మీద దారుణమైన పోస్టులు పెట్టారు. రజినీని కించపరిచే ప్రయత్నం చేశారు. ఇది ప్రస్తుతం తమిళంలో నంబర్ వన్ హీరో అనదగ్గ విజయ్ అభిమానుల పనే అని భావిస్తున్నారు. కొన్నేళ్లుగా తమిళంలో విజయ్ హవా నడుస్తోంది. బాక్సాఫీస్ లెక్కల్లో రజినీని విజయ్ అధిగమించేశాడు. కానీ రజినీ అభిమానులు ఈ విషయాన్ని అంగీకరించరు. వారితో విజయ్ అభిమానులకు గొడవ జరుగుతూ ఉంటుంది. ఈ క్రమంలోనే విజయ్ ఫ్యాన్స్ రజినీ సినిమా మీద నెగెటివ్ హ్యాష్ ట్యాగ్ పెట్టి రజినీని ట్రోల్ చేస్తూ ఉన్నారు. ఐతే రజినీ లాంటి హీరో మీద కూడా ఇంత నెగెటివిటీ చూపించడం చూస్తే.. సోషల్ మీడియా దుష్పరిణామాలు ఎలాంటివో అర్థమవుతుంది.

## ప్రియదర్శితో సమంత మూవీ..


స్టార్ బ్యూటీ సమంత గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. మయోసైటిస్ కారణంగా కొన్నాళ్లు సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె ప్రస్తుతం మళ్లీ రీఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతుంది. ప్రస్తుతం సెలెక్టివ్ గా సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లు చేసుకుంటూ వెళ్తోంది. తాజాగా ఆమె నటిస్తున్న "సిటాడెల్: హనీ బన్నీ" వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఇదిలా ఉండగా, ఆమె సెలెక్టివ్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతుంది. ఆమె చివరి చిత్రం విజయ్ దేవరకొండతో తీసిన ఖుషి సినిమా. ఇది బాక్సాపీసు వద్ద యావరేజ్ గా నిలిచింది. తన సొంత ప్రొడక్షన్ హౌస్ ట్రలాల మూవీంగ్ పిక్చర్స్ బ్యానర్‌పై తనే లీడ్ క్యారెక్టర్ లో 'మా ఇంటి బంగారం' అనే సినిమాను ప్రకటించింది. తాజాగా మరో సినిమాను నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఆమె హీరోయిన్‌గా నటించబోతుందట. అయితే, ఈ సినిమాలో ఆమె టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శితో రొమాన్స్ చేసేందుకు సిద్ధమవుతున్నట్లుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రియదర్శితో సమంత జోడీ కట్టనుందన్న వార్త ప్రస్తుతం అభిమానుల్లో క్యూరియాసిటీని క్రియేట్ చేస్తుంది. ఇక సమంత పలు చిన్న సినిమాలను తన సొంత బ్యానర్‌పై నిర్మించేందుకు సిద్ధమవుతోంది. మరి ప్రియదర్శి-సమంత కాంబినేషన్‌లో నిజంగానే సినిమా వస్తుందా లేదా అనేది అధికారిక ప్రకటన వచ్చే వరకు చూడాల్సిందే.





## హీరోగా ఎంట్రీకి రెడీ అవుతున్న స్టార్ డైరెక్టర్ కొడుకు!

తెలుగు సినీ పరిశ్రమ అనే కాదు దాదాపు అన్ని సినీ పరిశ్రమలలో వారసులు ఎంట్రీ ఇవ్వడం అనేది సర్వసాధారణం. హీరోల వారసులతోపాటు హీరోయిన్ల వారసులు అలాగే దర్శకులు, నిర్మాతల వారసులు కూడా నటులుగా ఇతర టెక్నీషియన్లుగా ఎంట్రీ ఇచ్చి తమ సత్తా చాటుకునే ప్రయత్నం చేసి సక్సెస్ అయిన వాళ్ళు ఉన్నారు. ఇంకా తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేసే వాళ్ళు కూడా ఉన్నారు. ఇప్పుడు మరో దర్శకుడు కుమారుడు హీరోగా మారేందుకు రంగం సిద్ధమైంది. ఆ దర్శకుడు మరెవరో కాదు ఎన్నో యూత్ ఫుల్ సినిమాలు డైరెక్ట్ చేసి ప్రస్తుతానికి సరైన హిట్టు కోసం ఎదురు చూస్తున్న దర్శకుడు తేజ. దర్శకుడు తేజ తన కొడుకు అమితోవ్ తేజను హీరోగా పరిచయం చేయడానికి రెడీ అవుతున్నారు. ప్రస్తుతానికి ఈ సినిమాకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. నవంబర్ లేదా డిసెంబర్ నుండి షూట్ కి వెళ్లొచ్చు అనేది ఇండస్ట్రీ వర్గాల సమాచారం. దర్శకుడు తేజ గతంలో ఎన్నో సూపర్ హిట్ సినిమాలు చేశారు. చివరిగా నేనే రాజు నేనే మంత్రి అనే సినిమాతో హిట్ అందుకున్న ఆయన దగ్గుబాటి సురేష్ బాబు కుమారుడు దగ్గుబాటి అభిరామ్ హీరోగా అహింస అనే సినిమా చేశాడు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద మాత్రమే కాదు విమర్శకుల దగ్గర కూడా దారుణమైన విమర్శలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే తేజ కుమారుడి సినిమాకి తేజనే దర్శకత్వం వహించబోతున్నారు అని తెలుస్తోంది. అయితే నిర్మాత ఎవరు? అనే విషయం మీద ప్రస్తుతానికి క్లారిటీ లేదు. తేజ స్వయంగా సినిమా నిర్మిస్తారా? లేక బయట నిర్మాత ఎవరైనా సినిమా అని నిర్మిస్తారా? అనే విషయం మీద క్లారిటీ రావాల్సి ఉంది.




## మెగా రివ్యూ జరుపుకుంటున్న విశ్వంభర

ఇటీవలే విడుదలైన విశ్వంభర టీజర్ కొచ్చిన మిశ్రమ స్పందన ఊహించినట్టే చిరంజీవి దాకా వెళ్ళిపోయింది. విఎఫ్ఎక్స్ క్వాలిటీ మీద అధిక శాతం నెగటివ్ రెస్పాన్స్ రావడంతో సోషల్ మీడియా ట్రోలింగ్ గట్టిగానే జరిగింది. యాంటీ ఫ్యాన్స్ పనిగా కొందరు అభిమానులు సమర్థించుకున్నప్పటికీ 5జి కాలంలో గ్రాఫిక్స్ నాణ్యతను చిన్న పిల్లాడు సైతం సులభంగా జడ్జ్ చేయగలుగుతున్నాడు. ఆది పురుష్ బాలేదనే సంగతి పక్కనపెడితే ఆన్ లైన్ పోస్ట్ మార్టం వల్లే ఎక్కువ డ్యామేజ్ జరుపుకుంది. ఇప్పుడు విశ్వంభరకు సైతం అలా జరిగే సూచనలు ఉండటంతో మెగా టీమ్ వెంటనే అలెర్టయిపోయింది. అంతర్గత సమాచారం మేరకు పొరపాటు ఎక్కడ జరిగిందో తెలుసుకునే పనిని చిరంజీవే స్వయంగా పర్యవేక్షిస్తున్నారట. భోళా శంకర్ డిజాస్టర్ తర్వాత అదే పనిగా ఇంత గ్యాప్ తీసుకుని, కళ్యాణ్ కృష్ణకు ఓకే చెప్పిన సినిమాను వదులుకుని మరీ విశ్వంభరకు ఓటేశారు మెగాస్టార్. అలాంటప్పుడు రాజీపడే సమస్యే ఉండదు. కానీ ఊహించని విధంగా విశ్వంభరకు ఇలాంటి టాక్ రావడంతో తనతో గతంలో పని చేసి, ఎక్కువ ర్యాపో ఉన్న ఒకరిద్దరు దర్శకులతో దీని గురించి చర్చిస్తున్నట్టు తెలిసింది. వశిష్టకు ఇబ్బంది లేకుండా ఏం చేస్తే బాగుంటుందనే దాని మీద చోటా కె నాయుడు సైతం వీటిలో పాల్గొంటున్నారట. విడుదల ఎప్పుడో మేలో అనుకుంటున్నారు కాబట్టి చేతిలో ఇంకా ఆరు నెలలకు పైగా సమయ ముంది. ఒకటికి పదిసార్లు అవుట్ ఫుట్ చెక్ చేసుకోవచ్చు. షూటింగ్ దాదాపు అయిపో యింది కనక టెన్షన్ లేదు. ఒక క్రమ పద్ధతి ప్రకారం అన్నీ సర్దుబాటు చేయొచ్చు. యువి బడ్జెట్ విషయంలో కాంప్రోమైజ్ అయ్యే బాపతు కానప్పటికీ ఇలా ఎందుకు జరిగిందో విశ్లేషణ చేసు కోవాలి. లెన్స్ కోసం ఏఐ వాడితే అవే చేటు చేశాయని చిత్ర బృందం భావిస్తోందట. ఈ డ్యామేజ్ తగ్గాలంటే ట్రైలర్ తో సరిచేయాలి. రిలీజ్ దూరంలో ఉంది కనక వెయిటింగ్ తప్ప వేరే ఆప్షన్ లేదు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com